# ఈశావాస్యోపనిషత్తు

వ్యాఖ్యాత

'అభినవ వ్యాస'  'జ్ఞాన ప్రపూర్ణ' శ్రీ దేవిశెట్టి చలపతిరావు

వ్యవస్థాపకులు

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరిపేట.

# పూజ్య గురుదేవులు



జ్ఞానప్రపూర్ణ

**శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు B.Sc., (Ag)**

వ్యవస్థాపకులు : ఆధ్యాత్మిక జ్ఞానపీఠం, చిలకలూరిపేట


Contact : (Mobile) 80085 39770 / (Land Line) 08647 254716

Email : care@srichalapathirao.com


Visit www.srichalapathirao.com to listen Pravachanas

# గురుదేవుల పరిచయము

శ్రీ దేవిశెట్టి చలపతిరావు గారు 1946 సెప్టెంబర్ 12 వ తేదీన గుంటూరు జిల్లా తుర్లపాడు గ్రామంలో జన్మించారు. తండ్రి వీరరాఘవయ్య, తల్లి పుల్లమ్మ. వీరి నివాసం చిలకలూరిపేట. ప్రాధమిక విద్య తుర్లపాడు గ్రామంలోను, ఉన్నత విద్య చిలకలూరిపేట లోను అభ్యసించి, బాపట్ల వ్యవసాయ కళాశాల నుండి B.Sc. (Ag.) ప్రధమశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు.

పూవు పుట్టగానే పరిమళిస్తుందనే నానుడి ప్రకారం 4 సంవత్సరాల వయస్సు నుండి 8 సంవత్సరాల వయస్సు వరకు వీరి నోటి నుండి ఏ వాక్కు వస్తే అలాగే జరిగేది. పూర్వ జన్మ సంస్కారం వల్ల వీరు 12 సంవత్సరాల వయస్సు నుండే రామాయణ, భారత, భాగవత గ్రంధాలను, పురాణాలు - ప్రబంధాలను అధ్యయనం చేయటం ప్రారంభించారు. ప్రత్యేకంగా మహాభారతంపై విశేషమైన ఆసక్తి కలిగి, 20 సంవత్సరాలకు పైగా ఆంధ్ర మహాభారతం, సంస్కృత మహాభారత గ్రంధాలపై తీవ్ర పరిశోధనలు గావించి, చిలకలూరిపేటలో 1988 నుండి 1992 వరకు ధారావాహిక ప్రవచనములు చేసి, శ్రోతల ప్రశ్నలకు అప్పటికప్పుడే జవాబులిస్తూ వారికి సందేహనివృత్తి గావించారు.

1990 నుండి చిలకలూరిపేట చిన్మయ మిషన్ కార్యదర్శిగా అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలను, హెూమాలను, పూజలను, గీతాజ్ఞాన యజ్ఞాలను, సత్సంగాన్ని నిర్వహించారు. 1994 లో *ఆధ్యాత్మిక జ్ఞాన పీఠాన్ని* స్థాపించి, ప్రసన్న బండ్లమాంబ శ్రీ రాజమాతాదేవి వారిచే ప్రారంభింపజేశారు. అప్పటి నుండి ప్రతిరోజు సత్సంగము, ప్రతి నెల గీతాపారాయణలతో బాటు శ్రీకృష్ణ జన్మాష్టమి, గీతాజయంతి, శంకరాచార్య జయంతి, రమణమహర్షి జయంతి, ఆషాఢ - కార్తీక – మాఘ - వైశాఖ పౌర్ణమిల యందు ఆధ్యాత్మిక సదస్సులు, జన్మదినోత్సవం, విజ్ఞానయాత్రలు, వనసమారాధనలు, ధ్యానతరగతులు, వార్షికోత్సవం మొదలగు అనేక కార్యక్రమాలను జరుపుకొనుటలోను, నిరంతర జప, ధ్యాన, ఆత్మవిచారణ, సాక్షీభావన, బ్రహ్మనిష్ఠ మొ||న సాధనలతో, పూర్తి ఆధ్యాత్మిక జీవితాలను గడుపుటలోను, మాకు సదా

మార్గదర్శకులుగా ఉండి మా వెన్ను తట్టి, చేయిపట్టి ముందుకు నడిపిస్తున్న కర్మయోగులు, జ్ఞాన ప్రపూర్ణులు మా గురుదేవులు.

భగవంతుడు నిర్దేశించిన బాటలో పయనిస్తూ, తనలో నిక్షిప్తమైయున్న ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పదిమందికీ పంచాలనే సంకల్పంతో 1996 నుండి వివిధ పట్టణాలలో ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞముల ద్వారా భగవద్గీత, ప్రకరణ గ్రంధాలైన శంకరాచార్యుల వారి భజగోవిందం, తత్వబోధ, ఆత్మబోధ, వివేకచూడామణి, అద్వైతసారం, దక్షిణామూర్తి స్తోత్రం, అపరోక్షానుభూతి, శ్రీ సదాశివ బ్రహ్మేంద్ర స్వాముల వారి ఆత్మవిద్యావిలాసం, శంభు నటనం, భగవాన్ శ్రీ రమణ మహర్షుల వారి ఉపదేశసారం, నారద భక్తిసూత్రములు, బ్రహ్మ సూత్రములు, ఇంకా రామాయణ, భారత, భాగవతములు, అలాగే ఈశ, కేన, కఠ, ముండక, కైవల్య, తైత్తి రీయ, సూర్య, మొదలగు ఉపనిషత్తుల పైనను ప్రవచనములు చేస్తూ జ్ఞాన సుగంధాలను నలువైపుల ప్రసరింపజేస్తున్నారు. ఇప్పటి వరకు చిలకలూరిపేట, విజయవాడ ధర్మల్ పవర్ స్టేషన్, రాయలసీమ ధర్మల్ పవర్ ప్రాజెక్ట్, వినుకొండ, శ్రీశైలం, కాశీ, తిరువణ్ణామలై, నెల్లూరు, బాపట్ల మొదలగు చోట్ల 145 ఆధ్యాత్మిక జ్ఞాన యజ్ఞములను చేశారు. 1998 లో వి.టి.పి.యస్.ఎ. కాలనీ యందు 108 హోమకుండాలతో వాసుదేవ మహాయజ్ఞాన్ని నిర్వహించారు.

1993 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2001 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా చిలకలూరిపేటలోను; 1999 లో భగవద్గీత ముగింపు సందర్భంగాను, 2002 లో వివేక చూడామణి ముగింపు సందర్భంగా వి.టి.పి.యస్.లోను శిష్యులందరూ గురుదేవులను ఘనంగా సన్మానించారు. 2006 లో 100 జ్ఞాన యజ్ఞాలు పూర్తిగావించిన సందర్భంగా శిష్యులందరూ కలసి '<u>జ్ఞానప్రపూర్ణ</u>' బిరుదుతోను, 2011 లో మహాభారత పరిశోధనలో గురుదేవుల కృషికి '<u>అభినవ వ్యాస</u>' బిరుదుతోను గురుదేవులను సత్కరించటం జరిగింది.

1994 లో సామాన్యులకు కూడా వేదాంత విషయాలు సులభంగా అర్థమయ్యే రీతిలో గురుదేవులు 'కర్మసిద్ధాంతం' అనే చిన్న గ్రంధాన్ని రచించి ప్రచురింపజేశారు. తిరిగి 2002 లోను, 2008 లోను, 2009 లోను పునర్ముద్రణ జరిగింది. 1998 లో

శుక్ల యజుర్వేదమునందలి 'ఈశావాస్యోపనిషత్తు' పై అందరికి అర్ధమయ్యే విధంగా సరళమైన, వాడుకభాషలో విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. 1999 లో శంకరాచార్యుల వారి 'భజగోవిందం' పై అందరికీ అతి సులభంగా అర్ధమయ్యే విధంగా, ఎంతో వివరంగా, వ్యాఖ్యను వ్రాసి ప్రచురింపజేశారు. తిరిగి 2009 లో ద్వితీయ ముద్రణ జరిగింది.

'భగవద్గీత' అనగానే "అమ్మో! అది మనలాంటి సామాన్యులకు కాదు" అనుకొనేవారు "భగవద్గీతను ఇంత తేలికగా అర్ధం చేసుకోగలమా?" అనుకొనేటట్లు ప్రవచనములు చేస్తున్న గురుదేవులు 2011 లో 1,2 అధ్యాయములను ప్రచురింపచేశారు. ఇప్పుడు 2012 లో భగవాన్ రమణ మహర్షుల "ఉపదేశసారము"నకు, సామవేదం నుండి గ్రహించబడిన కేనోపనిషత్తుకు విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప చేశారు. ఇవిగాక ప్రస్తుతం నారదభక్తి సూత్రాలపై, శంకరాచార్యుల వారి ఆత్మబోధ, దక్షిణామూర్తి స్తోత్రంపై ఎంతో వివరణాత్మకంగా, సోదాహరణంగా, విపులమైన వ్యాఖ్యను వ్రాసి ప్రచురింప జేస్తున్నారు.

ఇవి గాక విజయవాడ నుండి వెలువడే *ధ్యానమాలిక* మాసపత్రికలో 2008 నుండి భగవద్గీతను, 2009 నుండి మహాభారతమును ధారావాహికంగా ప్రచురిస్తున్నారు. ఇక దేశవిదేశాలలో నున్న తెలుగువారు ఈ జ్ఞానాన్ని గ్రహించటానికి వీలుగా www.srichalapathirao.com పేరుతో ఒక వెబ్ సైట్ ను ప్రారంభించటం జరిగింది. దీని ద్వారా ఆధ్యాత్మిక జ్ఞానపీఠం కార్యక్రమాలను, గురుదేవుల ప్రవచనాలను, గురుదేవుల వివిధ రచనలను, భజనలు, కీర్తనలను వినవచ్చును, చదువవచ్చును, డౌన్లోడ్ చేసుకొనవచ్చును. ఇక వివిధ గ్రంధాలపై గురుదేవుల ప్రవచనములను సి.డి.ల రూపంలోను, వీడియో DVD ల ద్వారా అందిస్తున్నారు.

ముందు ముందు మోక్షమార్గంలో పయనించే ఎందరికో మార్గ నిర్దేశనం చేయగల ఎన్నో గ్రంధాలు ముముక్షు జనావళిని తరింపజేయుటకు అందుబాటులోనికి రావాలని, అందుకు త్యాగధనులైన భక్తులు, సాధకులు, మోక్షార్ధులు ముందుకు రాగలరని భగవంతుని మనసారా ప్రార్ధిస్తున్నాను.

జ్ఞాన సూర్యునిలా ప్రకాశిస్తూ, నిస్వార్ధంగా తన సేవలను అందిస్తున్న కర్మయోగి, సనాతనమైన వైదిక ధర్మాన్ని ప్రచారం చేస్తూ, మాకు మార్గదర్శకులైన భగవంతుని ముద్దుబిడ్డ మా గురుదేవులను పరిచయం చేసే భాగ్యం నాకు కలిగించినందులకు భగవంతునికి శతసహస్ర వందనములు సమర్పించుకుంటున్నాను.

- శ్రీమతి రావూరి అన్నపూర్ణ

కార్య నిర్వాహక అధ్యక్షులు
ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం
చిలకలూరిపేట

# ముందుమాట

మానవుడు తరించటానికి కావలసిన సమస్తమైన విషయాలను తెలియజేప్పేది వేదం. 'వేద' అంటే తెలుసుకొనుట అని. ఏమిటి తెలుసుకోవటం? దేనిని తెలుసుకోవటం? దేనిని తెలుసుకున్నతర్వాత ఇక తెలుసుకోవలసినది లేదో, దేనిని తెలుసుకుంటే సర్వమూ తెలిసినట్లో అట్టి జ్ఞానాన్ని తెలుసుకోవాలి. అట్టి జ్ఞానాన్ని అందించేదే 'వేదం'.

దీనిని మొదట సృష్టికర్త బ్రహ్మదేవుడు 'దివ్యవాణి' గా విన్నాడు. అందుకే దీనిని 'శృతి' అన్నారు. శృతి అంటే విన్నది అని అర్థం. అసంఖ్యాక మంత్రాలతో కూడిన వేదం మొదట ఒకటిగానే ఉండేది. ఐతే ద్వాపరయుగం వచ్చేటప్పటికి మానవులు అల్పాయుష్కులు, అల్పజ్ఞానులు కావటంతో దానిని అధ్యయనం చేయటం, అర్థం చేసుకోవటం చాలా కష్టమైపోయింది. అందుకే వ్యాసమహర్షి ఒక్కటిగా ఉన్న వేదమంత్రాలను నాలుగు భాగాలుగా విభజించాడు. అవే 1)ఋగ్వేదం 2)యజుర్వేదం 3)సామవేదం 4)అధర్వణవేదం. ఇందులో యజుర్వేదం మళ్ళీ రెండుగా విభాగించబడింది. అవి 1)శుక్లయజుర్వేదం 2)కృష్ణయజుర్వేదం.

ప్రతివేదమూ తిరిగి నాలుగు భాగాలుగా విభజించబడింది. 1)మంత్రభాగం (సంహిత) 2)బ్రాహ్మణం 3)ఆరణ్యకం 4)ఉపనిషత్. ఉపనిషత్తులు వేదాలకు అంతంలో ఉన్నాయి గనుకనే వాటిని వేదాంతము అన్నారు. చాలావరకు ఉపనిషత్తులన్నీ వేదాలకు అంతంలోనే ఉన్నా కొన్ని మాత్రం మంత్రభాగంలోను, బ్రాహ్మణాలలోను, ఆరణ్యకాలలోనూ కూడా ఉన్నాయి. ఈ ఈశావాస్యోపనిషత్ మంత్రభాగం (సంహిత) లోనే ఉన్నది. ఇది శుక్ల యజుర్వేదంలోని మంత్రభాగం లోనిది. శుక్లయజుర్వేద మంత్రభాగంలో 40 అధ్యాయాలున్నాయి. ఆ చిట్టచివరి 40 వ అధ్యాయమే ఈ ఈశావాస్యోపనిషత్. దీనిలో 18 మంత్రాలున్నాయి. మంత్రభాగంలో ఉన్నది గనుక

దీనిని 'మంత్రోపనిషత్' అని కూడా అంటారు. ఇది శుక్లయజుర్వేదంలోని వాజసనేయ సంహిత (మంత్రభాగం) లోనిది. కనుక దీనిని వాజసనేయోపనిషత్తు అని కూడా అంటారు.

ఉపనిషత్తులలో ప్రధానంగా పరమాత్మతత్త్వం ప్రస్తావించబడి ఉంటుంది. నిరాకారుడు, నిర్గుణుడు, నిరంజనుడు, నిర్వికారుడు, అజుడు, అవ్యయుడు, అచింత్యుడు, అనిర్దేశ్యుడు, సర్వవ్యాపి, సర్వాంతర్యామి, నిత్యుడు, శాశ్వతుడు, సచ్చిదానంద స్వరూపుడు అయిన పరబ్రహ్మ లేదా పరమాత్మతత్త్వం ఒకటి ఉన్నదని, ఈ జగత్తంతా దాని చేతనే సృష్టించబడినదని, ఈ జగత్తునందు అంతటా పాలలో వెన్నలాగా - నువ్వులలో నూనెలాగా ఆ తత్త్వమే ఉన్నదని, ఇక్కడ జీవాత్మగా భావించబడేది ఆ పరమాత్మేనని తెలియజేప్పేదే ఉపనిషత్తు.

'ఉపనిషత్తు' అనే పదం ద్వారా దానిలోని విషయాలను ఎలా తెలుసుకోగలమో కూడా వ్యక్తం అవుతుంది.

ఉప అంటే సమీపంగా

ని అంటే క్రింద

షత్ అంటే కూర్చొనుట

ఉపనిషత్ అంటే సమీపంగా క్రింద కూర్చొనుట. అంటే సాధకుడు శాస్త్ర జ్ఞానము, అనుభవజ్ఞానము గల కరుణాసముద్రుడైన ఒక సద్గురువును ఆశ్రయించి, ఆయనను పూజ్యభావంతో సేవించి, ఆయనకు సమీపంగా క్రింద కూర్చొని - వినయంతో, శ్రద్ధతో జ్ఞానాన్ని అందుకోవాలి. అంటే సాధారణ లౌకిక విద్యలలాగా తమంతట తాముగా, స్వయంగా ఈ విద్యను నేర్చుకొనే వీలులేదు. ఇది బ్రహ్మవిద్య,

ఆత్మవిద్య.  ఈ విద్య మానవులలోని అజ్ఞానాన్ని తొలగించి, దు:ఖాన్ని పోగొట్టి, పరబ్రహ్మాన్ని ఎరుకపరచి ముక్తిని ప్రసాదిస్తుంది.

ఈ కనిపించే ప్రపంచానికంతటికీ ఆధారమేదో - అధిష్టానమేదో - మూలకారణమేదో తెలియజెప్పి, అది నీలోనే ఉన్నదని చెప్పి, చివరకు అది నీవేనని చెప్పి, నీవు తప్ప మరేమీలేదని స్వరూపజ్ఞానాన్ని కలిగించేదే ఈ బ్రహ్మవిద్య, వేదాంతవిద్య, ఉపనిషత్  విద్య.

ఇటువంటి  ఉపనిషత్తులు వేదాలలో మొత్తం 1180 ఉన్నాయని పెద్దలు చెబుతుంటారు.  అయితే అన్ని ఉపనిషత్తుల పేర్లు కూడా లభించటం లేదిప్పుడు. మొత్తం మీద 108 ఉపనిషత్తులు మాత్రం సనాతనమైనవని అందరూ అంగీకరిస్తున్నారు.  ఇలా చెప్పటానికొక ఆధారం కూడా ఉన్నది.  ముక్తికోపనిషత్తులో శ్రీరాముడు ఆంజనేయునితో ఆంజనేయా! నా స్వరూపం తెలుసుకోవాలంటే ఈ అష్టోత్తరశత (108) ఉపనిషత్తులను చదువు అని 108 ఉపనిషత్తులను వివరించటం జరిగింది.

ఈ 108 ఉపనిషత్తులలోను అతి ముఖ్యమైనవి దశోపనిషత్తులు.  ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తిరీయ, ఐతరేయ, ఛాందోగ్య, బృహదారణ్యక ఉపనిషత్తులు.  ఈ పది ఉపనిషత్తులకూ అద్వైతపరంగా శంకరాచార్యుల వారూ, విశిష్టాద్వైతపరంగా రామానుజులవారూ, ద్వైతపరంగా మధ్వాచార్యుల వారూ భాష్యాలు వ్రాశారు.  దీనిని బట్టి ఈ పది ఉపనిషత్తుల యొక్క విశిష్టత ఏమిటో మనకు అవగతం అవుతుంది.  ఈ పది ఉపనిషత్తులలోను మొట్ట మొదటిది ఈశావాస్యోపనిషత్తు.  దీనికీ పేరు రావటానికి కారణం ఈ ఉపనిషత్తులోని మొదటి మంత్రంలోని, మొదటి పాదంలోని, మొదటి పదమే.

వేదాలలోని మంత్ర భాగంలో ఉన్న ఉపనిషత్తు గనుకనూ, గొప్ప ఆధ్యాత్మిక సత్యాలు దీనిలో ఉండటం వల్లనూ, బ్రహ్మ సాక్షాత్కారం కలిగేటప్పటికి అనుభవాన్ని అత్యద్భుతంగా వర్ణించటం వల్లనూ, ఇది అన్ని ఉపనిషత్తులలోను ప్రధమ స్థానంలో పేర్కొన దగియున్నది.

ఈ ఉపనిషత్తు విచిత్రమైన శాంతి పాఠంతో ప్రారంభమౌతుంది.  పరమాత్మకు ప్రపంచానికి మధ్య గల సంబంధాన్ని తెలియజేసి, మనం అందుకోవలసిన లక్ష్యాన్ని నిర్దేశిస్తూ మనలను ఉపనిషత్తు అధ్యయనం లోనికి ప్రవేశపెడుతుందీ శాంతి పాఠం.

శాంతి పాఠంతో ప్రారంభించి ఉపనిషత్తులోనికి ప్రవేశిద్దాం.

-- రచయిత

# ఈశావాస్యోపనిషత్తు

వ్యాఖ్యాత :

జ్ఞానప్రపూర్ణ - శ్రీ దేవిశెట్టి చలపతిరావు

వ్యవస్థాపకులు :

ఆధ్యాత్మిక జ్ఞాన పీఠం, చిలకలూరిపేట.

శాంతి పాఠం:

ఓం  పూర్ణ మదః పూర్ణమిదం

పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే।

పూర్ణస్య పూర్ణ మాదాయ

పూర్ణమే వావ శిష్యతే ॥

ఓం శాంతిః శాంతిః శాంతిః ॥

ప్రతిపదార్ధం:- ఓం = పరమాత్మా! అదః పూర్ణం = అది పూర్ణమైనది, ఇదం పూర్ణం = ఇది పూర్ణమైనది, పూర్ణాత్ = పూర్ణం నుండి, పూర్ణం = పూర్ణం, ఉదచ్యతే = ఉద్భవిస్తుంది, పూర్ణస్య = పూర్ణమైనదానినుండి, పూర్ణం = పూర్ణమును, ఆదాయ = తీసివేసినచో, పూర్ణంఏవ =  పూర్ణం మాత్రమే, అవశిష్యతే = మిగులుతుంది.

భావం:- అది పూర్ణమైనది, ఇది పూర్ణమైనది, పూర్ణం నుండియే పూర్ణం ఉద్భవిస్తుంది. పూర్ణమైనదాని నుండి పూర్ణాన్ని తీసి వేస్తే పూర్ణమే మిగులుతుంది.

అధి దైవిక, అధి భౌతిక, ఆధ్యాత్మిక తాపములు శాంతించుగాక!

వ్యాఖ్య:- ఇదీ ఈ ఉపనిషత్తు యొక్క విచిత్రమైన శాంతి మంత్రం. సాధారణంగా శాంతి మంత్రాలలో శరీర అవయవాలు పుష్టిని, తుష్టిని, కలిగి ఉండాలని, మనస్సు నిర్మలంగా ఉండాలని, బుద్ధి ప్రసన్నంగా ఉండాలని, ఈ ఉపనిషత్తును అధ్యయనం

చేయడానికి కూర్చున్న గురుశిష్యుల మధ్య చక్కని అవగాహన, సామరస్యమూ ఉండాలని, అధ్యయన కాలంలో ఎలాంటి విఘ్నాలు కలుగకుండా ఉండాలని భగవంతుని ప్రార్థించటం ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటి ప్రార్థన లేదు, వేడికోలు లేదు, శుభకామన లేదు. అందుకే ఇది ఒక విచిత్రమైన శాంతి మంత్రం.

మరి ఏముంది ఇందులో?

పరమాత్మ ఎట్టివాడు? ఈ ప్రపంచం ఎటువంటిది? ఈ ప్రపంచం ఎలా వచ్చింది? ఆ పరమాత్మకు, ఈ ప్రపంచానికి మధ్య సంబంధం ఏమిటి? అనే విషయాలను తెలియజేస్తున్నది. తద్వారా మనం అందుకోవలసిన లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నది.

అది పూర్ణం:- అది అంటే అక్కడెక్కడో ఉన్నది, మనకు దూరంగా ఉన్నది అని. అదే పరమాత్మ. అజ్ఞానంలో ఉన్న మానవులందరికీ అది ఎక్కడున్నదో తెలియదు. ఎలా ఉన్నదో తెలియదు. ఆ పరమాత్మనే ఇక్కడ పూర్ణమైనది, నిండైనది, ఏ లోపాలు లేనిది, ఏ కొరతలు లేనిదీ అంటున్నారు.

పరమాత్మ నిత్యుడు, శాశ్వతుడు. అంటే ఎల్లప్పుడూ ఉండేవాడు. ఆయన అజుడు, అవ్యయుడు - పుట్టుకలేని వాడు, నాశనం లేనివాడు. ఆయనకు లేని సంపద లేదు. మనకు ఏం కావలసి వచ్చినా ఆయననే అర్థిస్తాం, ప్రార్థిస్తాం. ఆయన నుంచే పొందుతాం. పైగా ఆయన ఎన్ని సంపదలు ఇస్తున్నా ఆయనకు తరుగేం ఉండదు. కామధేనువే. కల్పతరువే. ప్రాణులను ఈ లోకంలోకి పంపేముందే వారి అవసరాలు ఏముంటాయో అన్నీ ఏర్పాటు చేశాడు. మనకు కావలసిన గాలిని, నీటిని, వెలుగుని, అన్నాన్ని, ఆధారంగా భూమిని... ఇలా అన్నీ ఇచ్చాడు. ఎంత మందిని ఇక్కడకు పంపినా ఎన్ని రకాల ప్రాణులను ఇక్కడకు పంపినా అందరికీ అన్నీ సమకూరేలా చూస్తున్నాడు.

ఎప్పుడూ నోస్టాక్ బోర్డ్ పెట్టలేదు, పెట్టడు. గాలి అయిపోయింది, కొంచెంసేపు సర్దుకోండి, తయారు చేసి పంపిస్తాను, నీరు అయిపోయింది, కొన్నిరోజులు సర్దుకోండి తయారుచేసి పంపిస్తాను, అని అన్నాడా ఎప్పుడైనా? అంటాడా అలాగ? అనడు, అనలేడు, అనాల్సిన అవసరం లేదు. ఆయన దగ్గరున్న సరుకేదీ అయిపోయేది కాదు. అసలు తయారు చేయాల్సిన అవసరం కూడా లేదు. నిరంతరం తయారవుతూ సప్లయి అవుతుంది. అందుకే ఆయన పూర్ణుడు పరిపూర్ణుడు.

ఇది పూర్ణం:- ఇది అంటే మనకు దగ్గరగా, అందుబాటులో ఉన్నది, మనకు బాగా కనిపిస్తూ ఉన్నది, ఏమిటది? ఈ జగత్తే, ఈ ప్రపంచమే. ఈ ప్రపంచం కూడా పూర్ణమైనదే అంటున్నాడు. అదేమిటి? పరమాత్మ పూర్ణం అంటే బాగానే ఉందిగాని ఈ ప్రపంచం పూర్ణం ఎట్లా అవుతుంది? ఇక్కడెప్పుడూ అసంతృప్తి, కొరత, కోరికలు బాధలు, కష్టాలు ఉంటూ ఉంటాయిగదా! మరి పూర్ణం ఎట్లా అవుతుంది?

నిజంగా మన స్వార్ధాన్ని ప్రక్కన బెట్టి నిష్పక్షపాతంగా ఈ ప్రపంచాన్ని గనుక పరిశీలించినట్లయితే ఈ ప్రపంచం కూడా పూర్ణమే. ఈ లోకంలోని ప్రాణులన్నింటికి కావలసిన సమస్త అవసరాలూ కూడా ఇక్కడే పూర్తిగా ఉన్నాయి. శిశువు జన్మించేటప్పటికే తల్లిలో పాలు తయారవుతున్నాయి. అందరికీ కావలసిన వెలుతురు, గాలి, నీరు, భూమి అన్నీ సమిష్టిగా అనుభవించటానికి వీలుగా ఇక్కడే ఏర్పాటు చేయబడి ఉన్నాయి. అయితే మనం స్వార్ధంతో ఎక్కువగా తీసుకుంటే మిగిలిన వారికి అంతమేరకు తగ్గిపోతుంది. మార్కెట్‌లో సరుకు తక్కువగా ఉన్నప్పుడు మన అవసరాలను వీలైనంత వరకు తగ్గించుకుంటే అందరికీ తగినంత అందుబాటులోకి వస్తుంది. కాని కొందరు స్వార్ధంతో, తమకు ఎప్పటికీ కొరత లేకుండా ఉండాలని, అవసరానికి మించి

నిల్వచేసుకుంటారు. అప్పుడు ఇతరులు కొందరికి బాధ అవుతుంది. కనుక మన కష్టాలకు, బాధలకు కారణం మన స్వార్థమే తప్ప ఈ ప్రపంచం కాదు.

ఇది పూర్ణం ఎలా? ప్రాణులు జీవించటానికి గాలి అవసరం. మానవులు ఆక్సిజన్‌ను పీల్చుకొని కార్బన్ డయాక్సయిడును వదులుతారు. మొక్కలు ఆ కార్బన్ డయాక్సయిడును పీల్చుకుని ఆక్సిజన్‌ను వదులుతాయి, ఆ ఆక్సిజన్ మానవులకు ప్రాణాన్ని నిలిపే వాయువు. అయితే మానవుడు స్వార్థంతో చెట్లను నరికి వేస్తే గాలి కలుషితమౌతున్నది, మానవ జాతికి హాని  కలుగుతున్నది. అంటే మన స్వార్థం వల్లనే ఈ ప్రపంచం లోపాలతో కూడుకుని ఉంటున్నదే గాని నిష్పక్షపాతంగా చూచినప్పుడు ఇది పూర్ణమే.

పూర్ణం నుండే పూర్ణం వస్తుంది:- జ్ఞాని నుండి జ్ఞానం వస్తుంది. అజ్ఞాని నుండి అజ్ఞానం వస్తుంది. అలాగే పూర్ణమైన పరమాత్మ నుండి పూర్ణమైన ప్రపంచం వస్తుంది.

ఇలా పూర్ణం నుండి పూర్ణం వచ్చినప్పుడు మొదటి దానికి పూర్ణత్వం ఉంటుందా? పరమాత్మ యొక్క పూర్ణత్వం పోకుండా ఉంటుందా? ఆయన శక్తినంతా ఇక్కడ ధారపోసి ఆయన శక్తిహీనుడౌతున్నాడా? అంటే అదేం లేదు. ఆయన పూర్ణత్వానికేం లోపం లేదు.

ఒక దీపం నుండి మరొక దీపాన్ని వెలిగిస్తే మొదటి దీపం కాంతి తగ్గుతుందా? ఎన్ని దీపాలు వెలిగించినా తగ్గదు. అలాగే ఒక అద్దంలో నీరూపం కనిపిస్తే నీకేమైనా లోటు కలుగుతున్నదా? చుట్టూ 4 అద్దాలు పెట్టుకొని నీవు మధ్యలో నిలబడితే అన్నింటిలోనూ నీరూపం కనిపిస్తుంది. అయినా నీకేం లోపం రాదు. ఒక గురువు తన విద్యను ఎందరు శిష్యులకు పంచినా ఆయన విద్యకు తరుగేమీ ఉండదు. అలాగే

పరమాత్మ నుండి ఈ ప్రపంచం వచ్చినా పరమాత్మకేమీ లోపం లేదు. బంగారంతో నగ తయారైనట్టు, మట్టితో కుండ తయారైనట్టు పరమాత్మతోనే ఈ ప్రపంచం తయారైంది. పరమాత్మ ఉభయ కారణం. మనం ఏదైనా వస్తువును తయారు చేయాలంటే ముడి సరుకు కావాలి. తయారుచేసే తెలివి కావాలి. ముడిసరుకు - ఉపాదానం. తెలివి - నిమిత్తం. ఈ ప్రపంచం తయారు కావడానికి ముడి సరుకూ పరమాత్మే. తెలివీ పరమాత్మే. అందుకే ఆయన ఉభయ కారణం. కనుక ఈ పూర్ణమైన ప్రపంచం ఆ పూర్ణమైన పరమాత్మ నుండే వచ్చింది.

పూర్ణం నుండి పూర్ణాన్ని తీసివేస్తే పూర్ణమే మిగులుతుంది:- పూర్ణమైన పరమాత్మ నుండి ఈ పూర్ణ ప్రపంచం వచ్చింది. ఈ ప్రపంచాన్ని తీసివేసి - తొలగించి చూస్తే మిగిలేది పరమాత్మే.

మనం సాధారణంగా ఒక అంకె నుండి మరొక అంకెను తీసివేస్తే మొదటి అంకె తగ్గిపోతుంది. అయితే సున్న నుండి సున్న తీసివేస్తే మాత్రం మిగిలేది సున్నాయే.

అలాగే పూర్ణమైన పరమాత్మ నుండి ఈ పూర్ణమైన ప్రపంచాన్ని తీసివేస్తే మిగిలేది ఆ పూర్ణమైన పరమాత్మే.

పరమాత్మను దర్శించే ఉపాయం ఇక్కడ తెలియజేయబడుతున్నది. పరమాత్మ ఈ ప్రపంచంలోనే ఉన్నాడు. మనం ప్రపంచ వ్యామోహాన్ని కలిగి దానినే చూస్తున్నంత కాలం పరమాత్మ కనిపించడు. ప్రాపంచిక వ్యామోహాలు తొలగి నీవు ప్రపంచాన్ని నీ దృష్టి పథం నుండి తొలగించుకోగలిగితే నీకు ఆ పరమాత్మ సాక్షాత్కారం అవుతుంది. అసలక్కడ ఉన్నది ఆ పరమాత్మే గనుక పరమాత్మ దర్శనం సాధ్యం.

కొయ్యతో ఏనుగు బొమ్మ తయారైంది. ఎంతో అందంగా ఆకర్షణీయంగా ఉంది.

పిల్లలంతా దానిచేత ఆకర్షింపబడుతున్నారు. వారు దాని రూపాన్ని చూస్తున్నారే గాని కొయ్యవారికి కనిపించలేదు. అదే ఒక వడ్రంగి చూచాడనుకోండి, అతడికి ఏనుగుమీద దృష్టి ఉండదు. ఆ కొయ్య ఎలాంటి కొయ్య అనే విషయం మీదనే దృష్ఠి.

అలాగే మనం ఈ ప్రపంచంలో వ్యవహరిస్తూ ప్రాపంచిక విషయ భోగాలను ఆలోచించేటప్పుడు, వాటి భ్రమలకు లోనైనప్పుడు, మనం వాటియందు దృష్టి పెడతాం గాని ఆధారమైన పరమాత్మపై దృష్టిని పెట్టలేం. ఈ ప్రాపంచిక వ్యామోహాలను తొలగించుకున్నట్లయితే ఇక మిగిలేది ఆ పరమాత్మే గనుక ఆయనపైనే దృష్టి నిలిచిపోతుంది.

ఆ పరమాత్మను దర్శించటానికే, ఆయనను తెలుసుకోవటానికే అపురూపమైన, దుర్లభమైన ఈ మానవ జన్మ వచ్చింది. కనుక ఆ పరమాత్మను దర్శించి జన్మను సార్ధకం చేసుకోవాలి.

పరమాత్మ సాక్షాత్కారాన్నెలా పొందాలో 18 మంత్రాల ద్వారా ఈ ఉపనిషత్తు మనకు మార్గాన్ని చూపిస్తున్నది. అది చూపిన మార్గం వెంట ప్రయాణించటానికి మానవులుగా జన్మించిన మనం ప్రయత్నించాలి. అది మన విద్యుక్త ధర్మం.

ఓం శాంతిః శాంతిః శాంతిః

అయితే ఈ ప్రయత్నంలో, ఈ ప్రయాణంలో మనకు కొన్ని ఆటంకాలు కలుగవచ్చు. విఘ్నాలు కలుగవచ్చు. వాటిని మనం 3 రకాల తాపాలుగా విభజించవచ్చు. అవి:-

1. ఆధి దైవిక తాపములు
2. ఆధిభౌతిక తాపములు

3. ఆధ్యాత్మిక తాపములు

ఆ తాపాలు శాంతించాలనే భావనతోనే మనం 3 సార్లు శాంతి - శాంతి - శాంతి అని శాంతి పాఠం చివర అంటుంటాం.

1. ఆధి దైవిక తాపాలంటే దైవికంగా వచ్చే ఆటంకాలు. వర్షాలు, తుఫానులు, భూకంపాలు, విపరీతమైన వేడి, చలి మొదలైన ప్రకృతి విలయాలు. వీటివల్ల ఉపనిషత్ అధ్యయనానికి గాని, సాధనలకు గాని ఆటంకం కలుగవచ్చు.

2. ఆధి భౌతిక తాపాలు అంటే చుట్టూ ఉన్న భూత జాలం వల్ల వచ్చే ఆటంకాలు. సమయానికి స్నేహితులో బంధువులో వస్తుంటారు. ఇంటిలోని వారు ఏదో పని చెప్పి ఆటంక పెడుతుంటారు. ఏ పురుగో పుట్రో కుట్టి బాధ కలుగవచ్చు. ఇలా చుట్టూ ఉన్న ప్రాణికోట్ల వల్ల కలిగే ఆటంకాలనే ఆధి భౌతిక తాపాలు అన్నారు.

3. ఆధ్మాత్మిక తాపాలంటే ఇతరుల వల్ల గాక నీలోపల నుండే వచ్చే వ్యతిరేక భావాలు. ఇదంతా నిజమేనా? మనం సాధన చేయగలమా? మనం తెలుసుకోగలమా? ఆ తర్వాతెప్పుడో తెలుసుకోకూడదా? ఇంకా గొప్ప వారెవరైనా రాకపోతారా? అని మనలోనే కలిగే భావాల వల్ల ఈ అధ్యయనానికి, సాధనలకు ఆటంకం కలుగుతుంది. ఈ 3 తాపాలు శాంతించు గాక యని ప్రార్థిస్తూ అధ్యయనం ప్రారంభిద్దాం.

## ప్రధమ మంత్రం

మం॥ ఓం ఈశావాస్య మిదగ్ం సర్వం

యత్ కించ జగత్యాం జగత్ ।

తేన త్యక్తేన భుంజీథా

మాగృధః కస్యస్విద్ధనం॥

ప్రతిపదార్థం:- జగత్యాం= ప్రపంచంలో, జగత్= కదులుతున్నటు వంటి, యత్కించ= ఎంత చిన్నదైనా, ఇదం సర్వం= ఈ సర్వమూ, ఈశ= పరమేశ్వరుని చేత, ఆవాస్యం= ఆవరింపబడి ఉన్నది, నిండిఉన్నది. తేన= అందువల్ల, త్యక్తేన= త్యజించటం ద్వారా, భుంజీథా= అనుభవించు, కస్య స్విత్= ఎవరియొక్క, ధనం= ధనాన్ని కూడా, మాగృధ= ఆశించ వద్దు.

భావం:- ఈ ప్రపంచంలో కదులుతున్నటువంటి ప్రతిదీ అది ఎంత చిన్నదైనా సరే - ఈ మొత్తం ఆ పరమాత్మచేతనే ఆవరింపబడి ఉన్నది, ఆ పరమాత్మతోనే నిండి ఉన్నది. కనుక త్యాగం చేసి అనుభవించు. ఇతరుల ధనాన్ని ఆశించవద్దు.

వ్యాఖ్య:- పూర్ణమైన పరమాత్మ నుంచే పూర్ణమైన ప్రపంచం ఉత్పత్తి అయినదని, ఈ ప్రపంచ వ్యామోహాలలో చిక్కి భ్రమలకు లోనైన వారు ఆ పరమాత్మను అందుకోలేరని, ఈ ప్రాపంచిక వ్యామోహాలను విడిచిపెట్టిన వారు, ప్రాపంచిక విషయాల పట్ల వైరాగ్యం కలవారు మాత్రమే ఆ పరమాత్మను అందుకోగలరని శాంతి పాఠంలో చెప్పుకున్నాం.కనుక పరమాత్మను అందుకోవాలంటే ఈ కోర్కెలు, వ్యామోహాలు, భ్రమలు తొలగిపోవాల్సిందే. అలా తొలగించుకొని పరమాత్మను అందుకొనుటకే ఈ మానవ జన్మ మనకు వచ్చింది. అందుకుంటేనే ఈ మానవ జన్మ సార్థకమైనట్లు. ఈ ప్రపంచ భ్రమలను తొలగించు కోవాలంటే ఎలాంటి సాధనలు చేయాలో, ఆ పరమాత్మనెలా అందుకోవాలో ఈ మంత్రం నుండి వివరించబోతున్నారు.

ఇక్కడ ఆత్మనిష్ఠుడు, శాస్త్ర జ్ఞాన సంపన్నుడు, కరుణా సముద్రుడు అయిన గురువు సాధన చతుష్టయ సంపన్నుడై, అధికారియైన శిష్యునికి - పరమాత్మ

ఎక్కడున్నాడో, ఆయనను అందుకోవాలంటే ఉపాయం ఏమిటో, నీ మనోబుద్ధుల నెలా సరిచేసుకోవాలో ముందుగా తెలియజేస్తున్నాడు. మానవుడు జ్ఞాతగా ప్రపంచంలోని విషయాలు తెలుసుకుంటున్నాడు. భోక్తగా అనుభవిస్తున్నాడు. కర్తగా పనులు చేస్తున్నాడు. జ్ఞానం బుద్ధిది, భోగం మనస్సుది. కర్మ శరీరానిది. ఈ మూడింటిని సరిచేసుకోవాలి. ఈ మంత్రంలో మనో బుద్ధులను ఎలా సరిచేసుకోవాలో చెబుతున్నారు.

ఈ ప్రపంచం మన కంటి ముందున్నది. దీనిని మనం చూస్తూనే ఉన్నాం. దీని స్వభావం జగత్-అంటే కదిలేది, మార్పులు చెందేది అని. ఎలా కదులుతున్నది? ఎవరు కదిలిస్తున్నారు? ఈశ-నియమించే వాడు, శాసించేవాడు. అతడు కదిలిస్తున్నాడు. కొన్ని నియమాలతో కదిలిస్తున్నాడు. అతడెలా కదిలిస్తున్నాడు? వాస్య - అవాస్య. అంతటా వ్యాపించి యుండి , అంతటా నిండి యుండి, అన్నింటినీ కప్పియుండి కదిలిస్తున్నాడు.

అంటే ఈ ప్రపంచంలోని ప్రతి వస్తువులోనూ, ప్రాణి కోట్లన్నింటిలోనూ ఆ పరమాత్మే ఉండి, ఈ ప్రపంచం మొత్తాన్ని తానే ఆవరించి యుండి, ఈ ప్రపంచాన్ని ఒక నియమం ప్రకారం కదిలిస్తున్నాడు. కనుక మనం చూచే ఈ ప్రపంచంలో కదిలే ప్రతిదీ - చెట్టు, పుట్ట, పశువు, పక్షి, మనిషి, మృగం, ఆడ, మగ, చిన్నపెద్ద, అన్నీ, అందరూ ఆ పరమాత్మతోనే నిండి యున్నారు. అందరూ ఆ పరమాత్మ స్వరూపులే. ఇదే సాధకుని బుద్ధిలో ఉండవలసిన ఉత్తమోత్తమ జ్ఞానం. ఇట్టి జ్ఞానం బుద్ధిలో ఉన్నవాడే పరమాత్మను చేరుకోవటానికి అర్హుడు.

అయితే ఇక్కడ ప్రపంచం అంతా పరమాత్మతో నిండి ఉన్నదనీ, అంతటా ఉన్నది ఆ పరమాత్మయేనని తెలిసినప్పటికీ పరమాత్మ పరమాత్మగా కన్పించటం లేదు (పాలలో

వెన్నలాగ). పరమాత్మ నిరాకారుడు, నిర్గుణుడు, సర్వవ్యాపి గనుక ఆయనేమో కనిపించడు. ఇక్కడ ప్రపంచంలో కనిపించేవన్నీ నామ, రూప, గుణాలతో ఉండే విషయ వస్తువులే. నామ రూపాలతో కూడిన ఈ ప్రపంచంలో ఆ నిరాకార నిర్గుణ పరమాత్మను దర్శించటం ఎలాగ? ఇది శిష్యుని తీవ్ర జిజ్ఞాస. దీనికే గురువు మార్గాన్ని బోధిస్తున్నాడు. నామరూపాలతో కూడిన ఈ ప్రపంచంలోనే నీవు పరమాత్మను దర్శించాలంటే 'త్యక్తేన' అని. త్యాగం చెయ్యటం ద్వారా. నామ రూప గుణాలు లేని పరమాత్మ నామరూపగుణాలతో కూడి ప్రపంచంగా కనిపిస్తున్నాడు. కనుక ఈ నామ రూప గుణాలను విడిచిపెట్టు. నీ దృష్టిలో నుండి వాటిని తొలగించేసెయ్యి. అలా తొలగించాలంటే నీ దృష్టిని సరిచేసుకో. అంతే.

గాజులు, గొలుసులు, ఉంగరాలు, జూకాలు అన్నీ బంగారంతో తయారు చేయబడేవే. అన్నింటిలో ఉన్నది ఆ బంగారమే. నగలపై వ్యామోహంతో వాటి అందచందాలను, అందులో పొదిగిన రాళ్ళను చూస్తాం. ఆ వ్యామోహం కాస్తా తొలగిపోతే అన్నింటిలోనూ కనిపించేది బంగారమే. పైపై దృష్టితో చూస్తే అన్ని రకాల పేర్లు, రూపాలు కనిపిస్తాయి. ఆ దృష్టిని తొలగించి అంతర్‌దృష్టితో చూస్తే ఒక్కటే వస్తువు. అసలు వస్తువు.

అయితే ఒక్కసారిగా ఈ ప్రాపంచిక వ్యామోహాలను త్యజించటం కష్టం. అంతర్ దృష్టి కలగటం కూడా కష్టమే. అందుకే త్యక్తేన అని భుంజీథా అన్నారు. అనుభవించు అని.

ఈ ప్రపంచంలోని వస్తువులన్నీ అనుభవించటానికే ఉన్నాయి. అనుభవించవచ్చు. అయితే ఎలా అనుభవించాలి? త్యక్తేన - త్యాగం చేసి. ఎవరికి త్యాగంచేసి? ఈ

వస్తువులన్నీ పరమాత్మకు చెందినవి. ఆయనే మనకు ప్రసాదించాడు. ఈ లోకంలో దేనినీ మనం వస్తూ మన వెంట తెచ్చుకోలేదు. పోతూ మన వెంట తీసుకెళ్ళటం లేదు. మనం ఇక్కడికొచ్చేటప్పటికే అన్నీ సిద్ధం చేసి ఉన్నాయి. గాలి, నీరు, భూమి, అగ్ని, ఆకాశం, సూర్యుని వెలుగు, చెట్లు, చేమలు, పర్వతాలు, నదులు, ఆహారం.... ఇలా అన్నీ. మనం మన అవసరాల కనుగుణంగా వస్తువుల రూపాలు మార్చుకుంటున్నామే గాని వస్తువులను సృష్టించటం లేదు. అంటే అన్నీ సృష్టించి ఇచ్చినవాడు ఆ పరమాత్మే. ఇవన్నీ ఆయనవే. యజమాని ఆయనే. కనుక ఆయనకే సమర్పించాలి. ఆయన అనుమతితోనే మనం వాడుకోవాలి. ఆయన అనుమతి లేకుండా వాడుకుంటే దొంగలమవుతాం. మరి ఆయన లేడుగదా అనుమతి తీసుకోవటానికి? అక్ఖర్లేదు భావత్యాగం చెయ్యి. సమర్పణ భావన చెయ్యి. ఓ పరమాత్మా! ఈ వస్తువులన్నీ నీవి. నా మీద దయతో నాకు వీటన్నింటినీ ప్రసాదించావు. నీవిచ్చిన ఈ సర్వాన్నీ నీకే సమర్పిస్తున్నాను అని సర్వ సమర్పణ భావంతో, కృతజ్ఞతా భావంతో భగవదర్పణం చేసి వాడుకో. అనుభవించు. భగవత్ స్వరూపులైన ప్రాణులతో కలిసి పంచుకో. వారికి కొంత భగవదార్పణ బుద్ధితో త్యాగం చేసి మిగిలిన ప్రసాదాన్ని స్వీకరించు. ఇలా మనస్సు ద్వారా భగవంతునికి అర్పిస్తూ స్వీకరించాలి. నీవు అనుభవిస్తున్నపుడు మరొక జాగ్రత్త కూడా తీసుకోవాలి. దానినే మాగృధః కస్యస్విద్ధనమ్ అని చెప్పినది. అంటే ఇతరుల ధనాన్ని ఆశించవద్దు అని.

ఈ లోకంలో మనందరి సమిష్టి అవసరాల కోసం కావలసినంత వరకు భగవంతుడు ప్రసాదించాడు. అందులో మన వాటా మనం అనుభవించాలి. అపుడు ఇతరులు తమ భాగాన్ని తాము అనుభవిస్తారు. అలాగాక స్వార్థంతో మనం అధిక

భాగాన్ని గనుక సమిష్టిలో నుండి తీసుకుంటే అంతమేరకు ఇతరులకు లోటు కలుగుతుంది. ఈ భావనను వ్యక్తం చేయటానికే ఇతరుల ధనాన్ని ఆశించవద్దు అంటున్నారు. మన ప్రారబ్ధం కొద్దీ మనకు భగవంతుడు ప్రసాదించిన దానితో తృప్తి చెందాలి. ఇతరుల కోసం ప్రసాదించిన దానిని వారే అనుభవించాలి. వాటిపై మనం ఆశపెట్టుకోరాదు. ఇతరుల వస్తువులను నావి అనుకోరాదు. ఆశ, లోభం కూడదు. దేని మీద మనకు పూర్తి హక్కులేదు. అనుభవించే హక్కేగాని తీసుకెళ్ళే హక్కులేదు. కనుక లభించిన దానితో సంతృప్తి చెందాలి. భగవంతుడు మనకు ప్రసాదించిన దానిని భగవత్ ప్రసాదంగా కళ్ళకద్దుకొని స్వీకరించాలి. అప్పుడే మనస్సు శాంతంగా ఉండేది. ఇదే ప్రపంచాన్ని భోగించే పద్ధతి (త్యక్తేన భుంజీథా అనే దానిని మరొక విధంగా చెప్పుకోవచ్చు. త్యజించి అనుభవించట మంటే అరటి పండుపై తొక్కను త్యజించి పండును తిన్నట్టుగా ఈ ప్రపంచంలో అన్నీ నామ రూపాలనే తొడుగును ధరించుకొని ఉన్నాయి. అసలు వస్తువు పరమాత్మ. ఆ పరమాత్మతో అనుసంధానం కావాలంటే నామరూపాలను త్యజించాలి).

ఈ మంత్రంలో పరమాత్మ నందుకోవటానికి బుద్ధిలో ఎటువంటి జ్ఞానం ఉండాలో, మనస్సులో ఎటువంటి భావన ఉండాలో తెలియజేయటం జరిగింది.

ఈ ప్రపంచంలో అంతటా ఉన్నది ఆ పరమాత్మే తప్ప మరేమీ కాదు - అనేదే బుద్ధిలో ఉండాల్సిన ఉత్తమ జ్ఞానం. అట్టి జ్ఞానం మనలో స్థిరంగా నిలబడితే ఇక మన మనస్సులో కలిగే భావనలు కూడా అందుకు అనుగుణంగానే ఉంటాయి.

ఈ ప్రపంచం, అందులోని వస్తువులు అన్నీ పరమాత్మకు చెందినవేనని, ఆయనచేత మనకు ప్రసాదించబడినవని, కనుక మనం వాటిని మన అవసరాలకు

వాడుకోవచ్చు. అయితే వాటిని భగవంతునికి సమర్పించి వాడుకోవాలి. పైగా వాటి మీద ఆశలు పెంచుకోవద్దు. నీకిచ్చినదానితో నీవు సంతృప్తి చెందు. ఇతరులను చూచి అసూయచెంద వద్దు. ఇతరుల సొమ్ముకై ఆశించవద్దు. ఇది మనస్సులో ఉండాల్సిన భావన.

ఇంతవరకూ మనబుద్ధిలో ఉన్న జ్ఞానంగాని, మన మనస్సులో ఉన్న భావనగాని ఇలాంటిది కాదుగదా! ఇంతవరకు ప్రపంచమే సత్యమని, నిత్యమని ఇక్కడి వస్తువులను కష్టపడి సంపాదించుకోవాలని, వాటిని పొంది అనుభవించి, ఆనందించే హక్కు మనకున్నదని, అలా ఆనందించటానికే మనం ఈలోకంలోకి వచ్చామని, అనుకుంటూ ఆశలు, కోరికలు, వ్యామోహాలు పెంచుకుంటున్నాం. అందితే ఆనందిస్తున్నాం. అందకపోతే దుఃఖిస్తున్నాం. ఇట్టి మనోబుద్ధులతో పరమాత్మనెలా అందుకుంటాం ? కనుకనే ముందు మనో బుద్ధులను సవరించుకోవాలి. అలాసవరించుకొని శరీరంతో కర్మ చేయాలి. కర్మ ఎలా చేయాలో తరువాత మంత్రం చెబుతున్నది.

## ద్వితీయ మంత్రం

మం ॥ కుర్వన్నే వేహ కర్మాణి

జిజీ విషేచ్ఛతగ్ం సమాః ।

ఏవంత్వయి నాన్యథే తోస్తి

నకర్మ లిప్యతే నరేః ॥

ప్రతి పదార్థం :- కర్మాణి = కర్మలను, కుర్వన్ ఏవ = చేస్తూనే, ఇహ = ఈ

లోకంలో (ఈశరీరంలో), శతం= వంద, సమాః = సంవత్సరాలు, జిజీ విషే = జీవించాలి, ఏవం త్వయి = ఇదే నీకున్న మార్గం, ఇతః = ఇంతకన్న, అన్యధా నాస్తి = మరొక మార్గం లేదు, నరేః = మానవుడికి, కర్మ = పనిచేయటం, నలిప్యతే = బంధం కాదు (కళంకాన్ని కలిగించదు)

భావం :- కర్మలు చేస్తూనే ఈ లోకంలో వంద సంవత్సరాలు జీవించాలి. ఇదే నీకున్న మార్గం. ఇంతకన్న గత్యంతరం లేదు. మానవుడికి కర్మ కళం కాన్నివ్వదు. బంధంకాదు.

వ్యాఖ్య :- బుద్ధిలో ఎటువంటి జ్ఞానం ఉండాలో, మనస్సులో ఎలాంటి భావనలుండాలో ప్రధమ మంత్రంలో తెలియజేయటం జరిగింది. ఇలాంటి జ్ఞానం ఇలాంటి భావం సామాన్యులకుండదు. మహాత్ములకు, పరిపక్వం చెందిన సాధకులకు, సర్వసంగ పరిత్యాగులకు మాత్రమే ఉంటుంది. వారు మాత్రమే అంతటా పరమాత్మను దర్శిస్తూ ఉంటారు. బ్రహ్మభావనలో ఉంటారు. ప్రాపంచిక వస్తువులను వాటి నామరూపాలను తొలగించి పరమాత్మ స్వరూపంగా చూడగలుగుతారు. వాటిని భోగించేటప్పుడు కూడా బ్రహ్మభావనతోనే ఉంటారు. వారికీ లోకంలో చేయవలసిన కర్మలంటూ ఏమీ ఉండవు. వారినే ఉత్తమాధికారులు అంటారు.

అంతటి వైరాగ్యం లేని వారు ఈ లోకంలోని ఆకర్షణలలో చిక్కుబడి, పరమాత్మను దర్శించలేక, దర్శించాలనే కోరిక మాత్రం ఉండి దారీ తెన్నూ తోచక ఉంటారు. వారి మనస్సు ఈ ప్రపంచంలోని ఆకర్షణల వలయంలోనే చిక్కి ఉంటుంది. వీరినే మంద మధ్యమాధికారులు అంటారు. ఇట్టివారు ఈ ఆకర్షణల వలయం నుండి బయటపడాలి. మనస్సును శుద్ధం చేసుకోవాలి. మనస్సును శుద్దం

చేసుకోవాలంటే ఇక్కడ కర్మలు చేస్తూనే ఉండాలి. అయితే ఎలా చేయాలి కర్మలను? ఎలాచేస్తే కర్మలు బంధానికి దారి తీయకుండా ముక్తికి దారితీస్తాయి ? అనే విషయాన్ని ఈ మంత్రం తెలియ జేస్తున్నది.

కర్మలు చేస్తూనే నూరేళ్ళు జీవించాలని కోరుకో. ఇదే నీకున్న మార్గం. ఇంతకన్న వేరు మార్గంలేదు. కర్మలు కళంకాన్నివ్వవు.

అయితే ఇంతకీ కర్మలంటే ఏవి ? పుణ్యకర్మలు - పాపకర్మలు, మంచికర్మలు - చెడ్డకర్మలు, శాస్త్రవిహితకర్మలు - శాస్త్రవిరుద్ధ కర్మలు. ఐతే వీటిలో మనం ఏ కర్మలు చేయాలి ? మంచికర్మలు, పుణ్యకర్మలు, శాస్త్రవిహిత కర్మలనే చేయాలి. శాస్త్ర విరుద్ధమైన కర్మలను - పాపకర్మలను చేయరాదు.

శాస్త్రాలంటే ? వేదాలు, ఉపనిషత్తులు, వాటి సారమైన భగవద్గీత. వేదాలలోని బ్రాహ్మణాలలో మానవులకు కొన్ని కర్మలు విధించబడ్డాయి. అవే అగ్ని హోత్రం, సంధ్యావందనం, పూజలు , వ్రతాలు, భజనలు, యజ్ఞయాగాది క్రతువులు, దాన ధర్మాలు, పుణ్యకార్యాలు, భగవత్ కార్యాలు, దీనజనసేవ, అతిధిసేవ, భూతతృప్తి, మహాత్ములసేవ మొదలైనవి. ఇవన్నీ ఎందుకు చెప్పినట్లు ? చెడ్డకార్యాలు, పాపకార్యాలు చేస్తే నరకప్రాప్తి. అనేక యాతనలు అనుభవించాలి. ఆ తర్వాత నీచ జన్మలు వస్తాయి. ఇలా మళ్ళీ మళ్ళీ నీచ జన్మలెత్తుతూ ఇంకా ఇంకా హీన స్థితికి వెళ్ళాలి. అలాగాక పైన పేర్కొన్న సత్కర్మలు గనుక చేస్తే పుణ్యఫలం వస్తుంది. దానితో స్వర్గప్రాప్తి. అక్కడ అనేక భోగాలు అనుభవించిన తర్వాత ఉత్తమ జన్మలు లభిస్తుంటాయి. ఆ జన్మలలో మళ్ళీ మళ్ళీ ఉత్తమ కర్మలు చేస్తుంటే ఇంకా ఇంకా ఉత్తమ జన్మలు లభిస్తూ ఉంటాయి. ఇలా నిరంతరం ఉత్తమ జన్మలు - ఉత్తమ సుఖాలు పొందుతూ ఉండవచ్చు. అయితే ఏ జన్మలోనైనా దుష్టవాసనల కారణంగా మళ్ళీ చెడ్డపనులు చేసే అవకాశం కూడా

ఉంటుంది. మరైతే ఎలా ?

కనుకనే భగవద్గీత మరొక అడుగు ముందుకేసి ఉత్తమ కర్మలు కాకుండా నిష్కామ కర్మలు చేయాలని శాసిస్తున్నది. చేసే కర్మలు ఉత్తమమైనంత మాత్రాన, పుణ్యప్రదమైనవి అయినంత మాత్రాన ప్రయోజనం లేదు, అవి నిష్కామ కర్మలు అయి ఉండాలి, ఫలాసక్తిలేనివై ఉండాలి, ఫలితంపై అపేక్ష లేకుండా ఉండాలి అని స్పష్టం చేస్తున్నది భగవద్గీత.

ఈలోకంలో మనం జీవించి ఉన్నంత వరకూ కర్మలు చేస్తూనే ఉండాలి అని ఉపనిషత్తు చెబుతున్నది. నిజంగా మనం చేస్తూనే ఉన్నాం. అయితే ఎలా చేస్తున్నాం ? కొందరు కడుపు నింపుకోవటం కోసం, అవసరాల కోసం చేస్తున్నారు. కొందరు ఏవేవో కోరికలతో, ఆశలతో చేస్తున్నారు. కొందరు కష్టాలు, దుఃఖాలు తొలగాలని ఏవేవో కర్మలు చేస్తుంటారు. కొందరు అల్పమైన సుఖాలకోసం, భోగాల కోసం కర్మలు చేస్తుంటారు. మరికొందరు ఒక లక్ష్యమంటూ లేకుండా కడుపునిండా తిండి, కంటినిండా నిద్ర లేకుండా రెండు చేతులా సంపాదిస్తూ ఉంటారు. ఎందుకు ? తాను సుఖపడటానికా ? నిద్రాహారాలు కూడా లేకుండా పనిచేసేవాడికి సుఖం ఎక్కడ ? పోనీ జీవితం చివరి దశలో నన్నా ఆనందం అనుభవించాలనా ? అహా !అతడు చచ్చే దాకా సంపాదనలోనే ఉంటాడు. మరింకెప్పుడు సుఖం ? ఇలా రకరకాలుగా వ్యక్తులు సరైన అవగాహన గాని, ఉత్తమ లక్ష్యం గాని లేకుండా కర్మలు చేస్తూనే ఉంటారు. ఇలాంటి కర్మలనే సకామ కర్మలంటారు. కొందరు సత్కార్యాలు, పుణ్యకార్యాలు చేస్తారు కాని వారు కూడా ఇహలోకంలో కీర్తిని, పరలోకంలో స్వర్గసుఖాలను ఆశించే చేస్తారు. ఇలా కోరికలతో కర్మలు చేసినప్పుడు ఆ కర్మల యొక్క ఫలంలో స్థూలభాగం కర్మఫలంగా

కూడబెట్టబడి (సంచితమై) తర్వాత ఎప్పుడో ఈ జన్మలోనేగాని, లేదా తరువాత జన్మలలో గాని అనుభవించటానికి సిద్ధం చేయబడి ఉంటుంది. ఇక సూక్ష్మభాగమేమో వాసనలుగా పేరుకుంటాయి. ఈ కర్మఫలాలు అనుభవించటానికి, ఆవాసనలు ఖర్చు చేసుకొనుటకు జీవుడు మళ్ళీ మళ్ళీ అనేక జన్మలెత్తాలి. ఆ జన్మలలో మళ్ళీ మళ్ళీ కర్మలు చేస్తూ కర్మఫలాలు, వాసనలను కూడ బెట్టుకుంటాడు. వాటి కారణంగా మళ్ళీ జన్మ. ఇలా మళ్ళీ మళ్ళీ జన్మలు, మళ్ళీ మళ్ళీ కర్మలు - ఇలా జనన మరణ చక్రంలో బంధించబడతాడు. ఇలాగ కర్మలన్నీ బంధాలవుతున్నాయి.

ఇలా బంధనాలు కాకుండా జన్మలు లేకుండా చేసుకోవాలంటే ఈ వాసనలన్నీ క్షయం చేసుకోవాలి. కర్మఫలాలు రాకుండా చేసుకోవాలి. కర్మ ఫలాలు రాకుండా ఉండాలంటే, వాసనలు చేరకుండా ఉండాలంటే అసలు కర్మలు చేయకుండా ఉంటే సరిపోతుంది గదా ? అది అసలే కుదరదు. ఎందుకంటే 'నహికశ్చిత్ క్షణమపి' అని భగవద్గీతలో చెప్పినట్లు ఒక్కక్షణం కూడా కర్మ చేయకుండా ఉండే వీలులేదు. ఈ శరీరం ఉన్నంతకాలం ఏదో ఒక కర్మను చేస్తూ ఉండాల్సిందే. అంటే కర్మలు చేస్తేనేమో బంధం, అసలు చేయకుండా ఉండటానికా వీలులేదు. మరెలా ఈ చిక్కు సమస్య తీరేది ?

పాములను పట్టి ఆడించి పొట్టనింపుకొనే వాడుంటాడు. వాడు కుటుంబాన్ని పోషించటానికి పాములను పట్టి ఆడించక తప్పదు. అయితే అవి కాటేశాయా ? ప్రాణమే పోతుంది. మరెలాగ ? వాటిని కాటెయ్యకుండా ఆడించాలి. వాటి కోరలు పీకేస్తే సరి. ప్రమాదం ఉండదు. పోషణా జరిగిపోతుంది.

అదే ఉపాయాన్ని ఇక్కడా ప్రయోగించాలి. కర్మలు చేయక తప్పదు. చేస్తే

బంధం. కనుక బంధం కాకుండా చేయాలి. కోరికే బంధాన్ని కలిగిస్తున్నది. కనుక కోరిక అనే కోరను పీకేయాలి. ఫలాసక్తి అనే కోరను పీకేయాలి, అదే నిష్కామ కర్మ.

'కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన' - కర్మలు చేయుట యందే నీకధికారం. కర్మఫలాన్ని కోరవద్దు అని గీతా వాక్యం. ఫలితం మీద ఆసక్తి లేకుండా, భగవదార్పణ బుద్ధితో, నిష్కామంగా కర్మలు కనుక చేసినట్లయితే ఆ కర్మల ఫలం నీకురాదు. కనుక కర్మలు బంధాలు కావు. ఈ ప్రకారంగా తెలుసుకొని నీవు కర్మలు చేస్తూనే ఉండాలి. ఇహ అంటే ఈ లోకంలో లేదా ఈ శరీరంలో ఉన్నప్పుడు అని. ఇలా ఈ శరీరంలో ఉన్నంతవరకు కర్మలు చేస్తూ ఉండాలి. అలా చేస్తూనే నూరేండ్లూ జీవించాలని కోరుకోవాలి. నూరేండ్లు అని ఎందుకన్నారు ?

ఎన్నో జన్మల తర్వాత వచ్చిన అపురూప జన్మ ఇది. దుర్లభమైన జన్మ ఇది. సాధన చేసి పరమాత్మనందు కోవాలంటే ఒక్క మానవునికే సాధ్యం గాని దేవతలకు కూడా సాధ్యం కాదు. ఇట్టి అపురూపమైన మానవ జన్మను, - మోక్షసాధనకు అనువైన మానవ జన్మను - అల్పమైన కోరికలు తీరలేదనో, అవమానం జరిగిందనో అంతం చేసుకోవాలని అనుకోరాదు. నూరేళ్ళు జీవించాలనే కోరుకోవాలి. నిజంగా అందరూ నూరేళ్ళు జీవిస్తారా ? అహ! అదేం లేదు. ఎంతకాలం ఈ శరీరం ద్వారా మన కర్మ ఫలాలు అనుభవించటానికి వచ్చామో అంతకాలం ఉంటాం. అదే నూరేళ్లు అంటే. ఎవడైనా 20 ఏళ్ళ యువకుడు చనిపోతే అంటారు, అయ్యో ! అప్పుడే నీకు నూరేళ్ళూ నిండాయా నాయనా ? అని. కనుక భగవంతుడు ఎంతవరకు ఆయుష్షు ఇచ్చాడో అదే నూరేళ్ళు. అంతవరకు ఇలా కర్మలు చేస్తూనే జీవించాలి, అని కోరుకోవాలి.

ఏవం త్వయి, ఇతః అన్యథా నాస్తి - ఇదే నీకున్న మార్గం. మరొక మార్గం లేదు.

బుద్ధిలో ఉండాల్సిన జ్ఞానం, మనస్సులో ఉండాల్సిన భావం - ఈ రెండూ భగవంతుని అందుకొనుటకు అనుకూలంగా ఉండాలంటే శరీరంతో చేసే కర్మలు బంధాలు కాకుండా చెయ్యాలి. ఇదే చక్కని మార్గం. కర్మయోగ మార్గం. ఇంకా అనేక మార్గాలున్నా అవి కర్మయోగంలాగా సత్ఫలితాలనిచ్చేవి కావు. అందుకే ఇంక వేరొక మార్గంలేదు అని చెబుతున్నది. శరీరం కర్మలు చేయటానికే వచ్చింది. కర్మలు చేయకపోతే శరీరం నిలవదు. కనుక కర్మలు చేస్తూనే జీవించాలి.

కర్మనలిప్యతే - కర్మలు ఇలా చేస్తే కళంకాన్నివ్వవు. నిష్కామంగా, ఫలాపేక్ష లేకుండా కర్మలు చేస్తే కొత్తగా కర్మఫలాలు రావు, వాసనలు చేరవు. పైగా లోపలి వాసనలు క్షయమౌతాయి. వాసనలతో కూడియున్న మనస్సే మలిన మనస్సు. వాసనలు క్షయమైన మనస్సే శుద్ధ మనస్సు. ఈ ప్రకారంగా మనం ఈ శరీరంలో ఉండగానే, ఈ లోకంలో ఉండగానే నిష్కామ కర్మల ద్వారా మనస్సును నిర్మలం చేసుకోవాలి. శుద్ధం చేసుకోవాలి.

పరమాత్మ నందుకోవటానికి మనవద్ద 3 పరికరాలున్నాయి. వాటిని శుభ్రం చేసుకొని సరిచేసుకొని ఉపయోగించుకోవాలి. ఎలా సరిచేసుకొని ఉపయోగించు కోవాలో పైరెండు మంత్రాలు తెలియజేస్తున్నవి.

ఇలా శరీర మనోబుద్ధులను సరిచేసుకొని, ఈ ప్రపంచంలోనే ఉన్న పరమాత్మను తెలుసుకోవాలి. అలా తెలుసుకొని సాధనలు చేసిన వారే ఆయన నందుకుంటారు. ముక్తులౌతారు. మిగిలిన వారు జీవిత గమ్యం ఏమిటో తెలియక, లౌకికమైన వ్యామోహాలతో కర్మలు చేస్తూ, ప్రపంచంలోనే ఉన్న పరమాత్మ స్వరూపాన్ని తెలుసుకోలేక, ఆత్మను ఎరుగని అజ్ఞానంతోనే ఈ జీవితాన్ని గడిపేస్తారు. అలాంటి వారిగతి ఏమిటి ? వారు శరీరం వదిలిన తర్వాత ఎక్కడికి ప్రయాణమౌతారు ?

ఏలోకాలను చేరుకుంటారు అనేది తృతీయ మంత్రంలో వివరించబోతున్నారు.

## తృతీయ మంత్రం

మం ॥ అసూర్యా నామతే లోకాః

అంధేన తమ సా వృతాః ।

తాగ్ం స్తే ప్రే త్యాభి గచ్ఛంతి

యేకే చాత్మ హనో జనాః ॥

ప్రతిపదార్థం :- యేకేచ = ఎవరైతే, ఆత్మహనః = ఆత్మను నాశనం చేసుకుంటారో (ఆత్మానుభూతికై ప్రయత్నించరో) తేజనాః = అట్టి జనులు, ప్రేత్య = మరణించిన తర్వాత, అంధేన తమసా = కటిక చీకట్ల చేత, ఆవృతాః = ఆవరించబడిన, అసూర్యానామ = సూర్యుడు లేనివి (వెలుగు లేనివి) అనే పేరుగల, తే లోకాః = ఏలోకాలున్నాయో, తాం = అట్టి లోకాలను, అభిగచ్ఛంతి = చేరుకుంటారు.

భావం :- ఎవరైతే ఆత్మను తెలుసుకొనుటకు - ఆత్మానుభూతిని పొందటానికి ప్రయత్నంచేయరో అట్టి ఆత్మవినాశకారులు చనిపోయిన తర్వాత కటిక చీకట్ల చేత ఆవరించబడిన వెలుగులేని లోకాలను చేరుకుంటారు.

వ్యాఖ్య :- ఆత్మహనోజనాః అంటే ఆత్మహత్య చేసుకునే జనులు లేదా ఆత్మను నాశనం చేసుకునే జనులు అని. అంటే ఆత్మను అందుకొనుటకు ప్రయత్నం చేయని వారు అని. ఏం ప్రయత్నం చేయాలి ?

ఇంతకు ముందు రెండు మంత్రాల్లో చెప్పినట్లుగా పరమాత్మనందు కొనుటకు

మనోబుద్ధులను తగిన విధంగా సంస్కరించుకోవాలి. శరీరాన్ని దానికనుగుణంగా నడిపించుకోవాలి. ఎలా ?

ఈ ప్రపంచం అంతా పరమాత్మతోనే నిండి యున్నదనే జ్ఞానం బుద్ధిలో ఉండాలి. నామరూపాలతోకూడిన ఈ ప్రపంచంలో పాలలో వెన్నలాగా అంతటా ఆవరించిన పరమాత్మను అందుకోవాలంటే ఈ నామ రూపాలను తొలగించి చూడాలని, అంటే నామ రూపాలతోకూడిన ఈ ప్రాపంచిక విషయాలపై వ్యామోహాన్ని విడిచి పెట్టాలని, అందుకోసమై ఈ విషయ వస్తువులపై ఆశలు పెంచుకోకుండా భగవంతుడు నీకై ప్రసాదించిన దానినే భగవదార్పణ బుద్ధితో అనుభవించాలని, ఇతరుల సొమ్ముకై ఆశించ కూడదనే భావన మనస్సులో ఉండాలి.

మనస్సు అలా నిర్మలంగా, ప్రశాంతంగా ఉండాలంటే జీవించి ఉన్నంతవరకు నిష్కామంగా, ఫలాపేక్ష లేకుండా, కర్మలతో సంగభావం లేకుండా శరీరం ద్వారా కర్మలు చేయాలి.

ఇలా ఎవరైతే నిష్కామ కర్మల ద్వారా మనస్సును శుద్ధం చేసుకుని, సూక్ష్మమైన బుద్ధి ద్వారా ఆత్మ జ్ఞానాన్ని అందుకొని ఆత్మానుభూతికై ప్రయత్నం చేయరో అట్టివారు ఆత్మను నాశనం చేసుకొన్నవారే. వారే ఆత్మఘాతకులు అని చెప్పారు.

అట్టివారు చనిపోయిన తర్వాత చేరుకొనే లోకాలు చీకటి లోకాలే. అంటే చీకటి జన్మలు, బుద్ధిలేని జన్మలు అని అంతరార్ధం. కనుక మోక్షానికి ద్వారం వంటిదైన ఈ అపురూపమైన మానవ జన్మను పొంది కూడా మోక్షాన్ని పొందాలనే ధ్యాసలేక, ఎవరైతే నిరంతరము లౌకిక వ్యవహారాలలో మునిగిపోయి తినటం, త్రాగటం, నిద్రపోవటం, భోగాలనుభవించటం, పిల్లలను కనటం, సంపాదించుకోవటం, దాచుకోవటం,

దోచుకోవటం, అనే సామాన్య కర్మలతో, పుట్టిన దగ్గర నుండీ చచ్చేంతవరకు కాలక్షేపం చేస్తారో అట్టి వారు ఈ మానవ జన్మను వృధా చేసుకున్న వారే అవుతారు. ఒకసారి ఇలా వృధా చేసుకుంటే ఇక వారికి తరువాత లభించే జన్మలు నీచజన్మలే. బుద్ధిలేని జన్మలే అంటే జంతు జన్మలే. ఒకవేళ మానవ జన్మ వచ్చినా పిచ్చివారుగానో, మెదడు మొద్దుబారిన జడులుగానో జన్మిస్తారు. ఇవే అసూర్యానామతే లోకాః అంటే. ఈ జన్మలలో శరీరం, మనస్సు ఉంటాయేగాని బుద్ధి ఉండదు గనుక శరీరం ద్వారా పూర్వ వాసనల కనుగుణంగా పనిచేయటం, మనస్సు ద్వారా పూర్వ కర్మఫలాలను అనుభవించటం ఇంతే. ఆత్మ జ్ఞానం పొందే వీలుగాని, పొందాలనే ఆలోచన గాని అవకాశంగాని ఉండదు.

అసుర్యా అనే పాఠాంతరం కూడా ఉన్నది. అసుర్యా అంటే రాక్షస జన్మలు అని. అంటే కొందరు నిషిద్ధమైన కర్మలు చేసి రాక్షసులుగా ప్రవర్తించి ఇంకా ఇంకా భగవంతునికి దూరమై నీచాతి నీచమైన జన్మ పరంపరలలో చిక్కుకుంటారు.

ఇలా నీచయోనుల్లో పుట్టటం వల్లగాని, జన్మపరంపరలలో చిక్కుకోవటం వల్లగాని నష్టమేమిటి ?

ఈ జన్మలన్నీ దుఃఖ పరంపరలలో గడిచిపోతాయి. గర్భంలో ఉన్నప్పుడు గర్భనరకం అనుభవించాలి. అక్కడ ఇరుకు, మలమూత్ర సమ్మేళనం, బాధను చెప్పుకునే వీలులేదు. దానికితోడు పూర్వజన్మల స్మృతి. దానితో తానుచేసిన భయంకర కృత్యాలను తలచుకొంటే విపరీత భయం. గర్భం నుండి బయట పడటం ఒక నరకం. అంతా దుఃఖం. ఇక బయటకు వచ్చిన తర్వాత ఆశలు కోరికలు తీరక దుఃఖం, వ్యాధులతో దుఃఖం, ముసలితనం దుఃఖం. చివరకు అన్నీ వదలి, అందరినీ వదలి వెళ్ళటం మరింత

దుఃఖం. ఇలా జన్మలన్నీ దుఃఖపూరితాలే. మళ్ళీ మళ్ళీ జన్మలు రావటమే సంసార దుఃఖం. ఈ దుఃఖం తొలగాలంటే మళ్ళీ జన్మ లేకుండా చేసుకోవాలి. అదే మోక్షం. దానికే సాధన. ఆ సాధన చేయటానికి అనువైనదే ఈ మానవ జన్మ. ఇట్టి జన్మను వృథా చేసుకున్నావా ? ఇక నీ గతి నీచ జన్మలేనని హెచ్చరిక చేస్తున్నదీ మంత్రం.

ఐతే నిజంగా మనం ఈ జన్మలో బుద్ధిని సరిగ్గా వినియోగించుకోకపోతే బుద్ధిలేని హీన జన్మలే నిజంగా వస్తాయా ? ఔను. మన శరీరంలో ఒక భాగాన్ని పనిచేయించకుండా ఆపితే కొన్నాళ్ళకు ఆ భాగం చచ్చుబడి పోతుంది. ఇక పనిచెయ్యదు. చేతివ్రేలికి గట్టిగా కట్టుకట్టి రక్తప్రసరణం ఆపితే కొంతకాలానికి వ్రేలు పనిచెయ్యదు. అలాగే భగవంతుడు ప్రసాదించిన బుద్ధిని వినియోగించుకోకపోతే ఇక బుద్ధిలేని జన్మలేగతి. మానవత్వాన్ని మరిచిపోతే జంతు జన్మలేగతి.

కనుక మనం మానవ జన్మ నెత్తి ఎందుకొచ్చామో గ్రహించి ఈ జన్మను సార్థకం చేసుకోవాలి. అంటే ఆత్మ జ్ఞానం పొందాలి.

సరే, ఇంతకీ ఆ ఆత్మ అంటే ఏమిటి ? అది ఎలాంటిది ? దాని స్వరూప స్వభావాలేమిటి ? ఈ విషయాలను రాబోయే 2 మంత్రాలలో తెలియజేయబోతున్నాడు ఉపనిషద్గురువు.

## చతుర్థమంత్రం

మం ॥ అనేజదేకం మనసోజవీయో

నైనద్దేవా ఆప్నువన్ పూర్వమర్షత్ ।

తద్ధావతో న్యానత్యేతి తిష్ఠత్

తస్మిన్నపో మాత రిశ్వా దధాతి ॥

ప్రతి పదార్థం :- అనేజత్ = కదలనిది, ఏకం = ఏకమైనది, మనసః = మనస్సుకన్న, జవీయః = వేగమైనది, ఏనత్ = దానిని, దేవా = దేవతలు, నాఆప్నువన్ = అందుకోలేకపోయారు, (తెలుసుకోలేరు), పూర్వం = ముందే, అర్షత్= పరుగెత్తింది, తత్ = అది, తిష్టత్ = స్థిరంగా ఉండి, ధావతః = పరుగెత్తే, అన్యాన్ = ఇతరమైనవాటిని, అత్యేతి = దాటిపోతుంది, తస్మిన్ = దానిలోనే, మాతరిశ్వా = వాయువు, ఆపః = నీటిని, దధాతి = నిలబెడుతుంది.

భావం :- ఆత్మ కదిలేది కాదు, అది ఏకమైనది, మనస్సు కన్న వేగమైనది. దానిని దేవతలు అందుకోలేరు. అది ముందే పరుగెత్తింది. అది నిలబడి పరుగెత్తే ఇతరమైన వాటిని దాటిపోతుంది. దాని ఆధారంగానే వాయువు నీటిని నిలబెడుతుంది.

వ్యాఖ్య :- ఆత్మను తెలుసుకొని ఆత్మాను భూతిని చెందకపోతే ఆత్మ హత్య చేసుకున్నట్లు. అట్టి వారికి నీచజన్మలే, చీకటి జీవితాలేగతి. కనుక ఆత్మను తెలుసుకోవాలి. ఎలా ? ముందుగా శరీరంతో నిష్కామ కర్మలు చేస్తూ, మనస్సును నిర్మలంగావించుకొని, బుద్ధిని శుద్ధం చేసుకొని, సూక్ష్మ బుద్ధితో ఆత్మను తెలుసుకోవాలి.

ఆత్మను గురించి, దాని స్వరూప స్వభావాల గురించి తెలుపుతున్నదీ మంత్రం.

ఈ ప్రపంచాన్నంతటినీ ఒక పద్ధతి ప్రకారం నడిపిస్తున్నది ఏదో అద్భుతమైన శక్తి. భూమిని, ఇతర గ్రహాలను వాటి వాటి కక్ష్యలలో, వాటి వాటి వేగంతో త్రిప్పుతున్న అద్భుత శక్తి ఏది ? ఆ శక్తి ఎక్కడ కూర్చొని దీనినంతటిని నడుపుతున్నది? ఇలా ఆలోచిస్తే ఆ శక్తి ఈ బ్రహ్మాండం అంతటా వ్యాపించి యుండి అన్నింటికి ఆధారమై,

అధిష్టానమై, కారణమై, ఉండాలని తోస్తుంది. అదే ఆత్మ. అదే పరమాత్మ. దానినెలా తెలుసుకోవటం ? గుర్తించటం ?

అది సర్వ వ్యాపి. అంతటా ఉండేది. అది అంతటా ఉన్నది గనుక, అదిలేని చోటు లేనేలేదు గనుక దానికి కదిలే అవకాశం లేదు. నీవు గదిలో ఒకచోటినుండి మరొక చోటికి కదులుతున్నావంటే అక్కడ ఖాళీ ప్రదేశం ఉన్నది. నీవు లేకుండా ఉన్నచోటున్నది. కనుక కదలగలుగుతున్నావు. ఒకవేళ గదంతా నీవే నిండి ఉన్నావనుకో. ఇంక ఎలా కదులుతావు ? అలాగే అంతటా ఉన్న ఆత్మ ఎలా కదులుతుంది ? అందుకే అనేజత్ - కదలదు అన్నారు.

అది ఏకం - ఒక్కటే. అద్వితీయం, అంటే రెండవదేదీ లేదు అని, ఆత్మతో సమానమైనది మరొకటేదీలేదు. అది అవిభాజ్యం. ప్రపంచం లోని వస్తువులను విభాగించవచ్చు కాని ఆత్మ అవిభాజ్యం. విభాగించ వీలులేనిది.

మనసోజవీయః - మనస్సు కన్న వేగమైనది, ఈ లోకంలో అన్నిటి కన్న వేగమైనదేది? అని ధర్మరాజును యక్షుడు ప్రశ్నిస్తే మనస్సు అని సమాధానం చెప్పాడు. అయితే అట్టి మనస్సు కన్న వేగమైంది ఆత్మ. ఆత్మ కదలనిది అని పైన చెప్పి ఇపుడేమో మనస్సు కన్న వేగమైనది అని చెబుతున్నారేమిటి ? నిజమే మనస్సు వెళ్ళగలిగిన ఏచోటనైనా అది ముందే ఉన్నది, కనుక అది కదలకుండానే ఉన్నది, మనస్సు కన్న వేగమైనది. నేను హిమాలయాలకు వెళ్ళాలి అనుకున్నావు. తక్షణమే నీ మనస్సు అక్కడకు చేరింది. అయితే ఇలా అనుకొనేటప్పటికే అక్కడ ఆత్మ ఉన్నది. అందుకే దానినిముందే పరుగెత్తింది అనటం. మనస్సు కన్న వేగమైనది అనటం.

దేవతలు దానిని అందుకోలేకపోయారు. దేవతలు అంటే ఇంద్రియ శక్తులు.

ద్యోతనాత్‌దేవః అన్నారు. అంటే వెలిగించి చూపించేవారు. కంటికి సూర్యుడు, వాక్కుకు అగ్ని, చర్మానికి వాయువు, నాలుకకు వరుణుడు, ఇలా అధిష్టాన దేవతలున్నారు. వారి శక్తి వల్లనే ఈ ఇంద్రియాలు చూడగలగటం, వినగలగటం, మాట్లాడగలగటం, రుచి చూడగలగటం జరుగుతున్నది. అంటే వీరు ఇంద్రియాలకు శక్తినిచ్చి ప్రపంచంలో అన్నింటిని తెలుసుకోగలుగుతున్నారు. కాని ఆ శక్తి తమకు ఎవరినుండి వచ్చిందో ఆ ఆత్మను మాత్రం చూడలేరు.

ఇంద్రియాలు బయటి ప్రపంచాన్ని తెలుసుకోగలవుగాని తమకు లోపల నుండి శక్తినెవరు ఇచ్చారో వారిని చూడలేవు.

బ్యాటరీ లైటులోని బల్బు బయటనున్న చీకటిని పారద్రోలి అక్కడ ఏమున్నాయో చూపుతుంది గాని తనకా శక్తి నిస్తున్న సెల్స్‌ను మాత్రం చూడలేదు. అలాగే దేవతలు ఆత్మను అందుకోలేవు. అంటే ఇంద్రియాల ద్వారా ఆత్మను తెలుసుకోవటం కుదిరే పనికాదు.

ఇదే విషయం కేనోపనిషత్తులో కధారూపంలో చెప్పారు.

దేవతల గర్వం అణచటానికి పరమాత్మ యక్షరూపంలో ప్రత్యక్షమయ్యాడు. ఆ రూపం ఎవరో తెలుసుకొమ్మని ముందు అగ్నిని పంపుతారు దేవతలు. అతడు అవమానభారంతో తిరిగిరాగా, దేవతలు ఈసారి వాయుదేవుని పంపించారు. మళ్ళీ అలాగే జరిగింది. చివరకు ఇంద్రుడే స్వయంగా వెళ్ళాడు. యక్షరూపం అదృశ్యమైంది.

అగ్ని వాక్కుకు అధిష్ఠానదేవత. వాక్కు కర్మేంద్రియాలకు ప్రతినిధి. వాయువు చర్మానికి అధిష్టానదేవత. అది జ్ఞానేంద్రియాలకు ప్రతినిధి. ఇంద్రుడు అంటే ఇంద్రియాలకు అధిపతి. ఇంద్రుడు మనస్సుకు అధిష్టాన దేవత. కర్మేంద్రియాలు,

జ్ఞానేంద్రియాలు, చివరకు మనస్సు ప్రయత్నించినా తెలుసుకోలేకపోయినవి. కనుకనే దేవతలు ఆత్మను అందుకోలేకపోయారు అనటం.

అదికదలకుండా స్థిరంగా ఉండి పరిగెత్తే అన్నింటినీ దాటిపోతుంది. ఆత్మ అనేది అంతటా ఉన్నది. అదిలేని చోటులేదు. కనుక ఈ గ్రహాలు గాని, సూర్యచంద్రులు గాని, మానవులుగాని, క్రిమికీటక పశుపక్ష్యాదులు గాని, అన్నీకూడా దానిలోనే ఉన్నాయి. ఇవన్నీ తిరుగుతున్నాయి, కదులు తున్నాయి, పరుగులు పెడుతున్నాయి. ఇవన్నీ ఎంత పరుగులు పెట్టినా ఈ కనిపించే జగత్తులోనే. ఈ జగత్తు అంతా ఆ పరమాత్మలోఒక భాగమే.

విష్టభ్యాహమిదం కృత్స్నం ఏకాంశేన స్థితోజగత్ (గీ 10-42). ఈ జగత్తు నంతటినీ నేనే ఒక్క అంశతో ధరించి నిలిచిఉన్నాను. అని విభూతి యోగంలో తెలియజేశారు. అంటే జగత్తు అంతా పరమాత్మలో ఒక్క అంశ మాత్రమే. ఆ అంశలోనే అన్నీ పరుగెడుతున్నాయి. ఎంత పరిగెత్తినా అవి అంతటా ఉన్న ఆత్మను దాటిపోలేవు. వీటన్నింటిని ఆ పరమాత్మే దాటిపోయి ఉన్నది.

తస్మిన్నపో మాతరిశ్వాదధాతి - మంత్రంలోని ఈ పాదం జీవజగత్తులకు ఆ పరమాత్మే ఆధారం అని నిగూఢ భాషలో తెలియజేస్తున్నది. వాయువు నీటిని ధరించటానికి ఆధారం ఆ పరమాత్మేనని తెలియజేస్తున్నాడు.

ప్రాణులందరికీ ఆధారం భూమి. భూగోళంలో 3 భాగాలు నీరు, 1 భాగం భూమి కనుక నీరు భూమిని నిలబెడుతున్నది. ఈ మొత్తం భూ మండలం తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతున్నది. ఇలా తిరుగుతున్నప్పుడు 3 వంతులుగానున్న నీరు చెదిరిపోవటం లేదు. ఏమిటి దీనికి కారణం ? భూగోళం

చుట్టూ 150 మైళ్ళవరకు వ్యాపించియున్న వాయుమండలమే. ఆగాలి వత్తిడివల్లనే భూగోళంలోని నీరు చెదరకుండా నిల్చి ఉన్నది. కనుక నీటిని నిలబెట్టింది వాయువు.

నీటితో నింపిన గ్లాసుపై ఒక కాగితాన్ని నొక్కి పెట్టి గ్లాసును తలక్రిందులు చేస్తే నీరు క్రింద పడదు. దానికి కారణం గాలియొక్క ఊర్ధ్వపీడనమే. వత్తిడే.

నీటిని నిలబెట్టిన వాయువు సంచరించేది ఆకాశంలో. ఆకాశమే వాయువుకు ఆధారం. వాయువుకు ఆ శక్తి పరమాత్మ వల్లనే లభిస్తుంది. కనుక ఈ జగత్తుకు ఆధారం పరమాత్మే.

అలాగే జీవుడి దేహంలో 3 వంతులు నీరే. ఆ నీటిని నిలబెట్టేది ఉచ్ఛ్వాస నిశ్వాసాలే. అదే వాయువు. కనుక గాలియే నీటిని నిలబెడుతున్నది. ఎంతకాలం నిలబెడుతుంది ? ఆత్మ ప్రకాశం ఉన్నంతవరకే. కనుక జీవుడికి ఆధారంకూడా పరమాత్మే. ఇలా జీవ జగత్తులకు రెండింటికి ఆధారం ఆ పరమాత్మేనని ఋజువౌతున్నది.

## పంచమ మంత్రం

మం॥ తదేజతి తన్నైజతి<br>
తద్దూరే తద్వంతికే ।<br>
తదంతరస్య సర్వస్య<br>
తదుసర్వస్యాస్య బాహ్యతః ॥

ప్రతిపదార్థం :- తత్ ఏజతి = అది కదులుతుంది, తత్ న ఏజతి = అది కదలదు, తత్ దూరే = అది దూరంగా ఉన్నది, తత్ ఉ అంతికే = అది నిజంగా

దగ్గరగా ఉన్నది, తత్ = అది, అస్యసర్వస్య = ఈ అంతటికీ, అంతర = లోపల ఉన్నది, తత్‌ఉ = అది నిజంగా, అస్యసర్వస్య = ఈ అంతటికీ, బాహ్యతః = వెలుపలనున్నది.

భావం :- అది కదులుతుంది, కదలదు, అది దూరంగా ఉన్నది, నిజంగా దగ్గరగా ఉన్నది. అది ఈ సమస్త ప్రపంచానికీ లోపలనున్నది, నిజంగా అది ఈ ప్రపంచం అంతటికీ వెలుపలనున్నది.

వ్యాఖ్య :- ఈ మూడు వాక్యాలు పరస్పర విరుద్ధ వాక్యాలు. పరమాత్మ విలక్షణమైన వాడు, వర్ణించనలవిగానివాడు, వాక్కుకు అందని వాడు. ఇంకొక దానితో పోల్చవీలులేని వాడు. అట్టి పరమాత్మను ఇక్కడ పరస్పర విరుద్ధ వాక్యాల ద్వారా వర్ణిస్తున్నారు ఉపనిషద్గురువు.

ప్రపంచం తయారైంది పరమాత్మనుండి. ప్రపంచాన్ని నడిపేదీ ఆయనే. ఆయన కనిపించకుండా అవ్యక్తంగా అంతటా వ్యాపించియున్నాడు. ఆయనే ఇక్కడి జీవుళ్ళలో ఉండి జీవుల యొక్క కదలికల ద్వారా వ్యక్తం అవుతూ ఉన్నాడు. కనుక ఆయన వ్యక్తా వ్యక్త స్వరూపుడు.

అవ్యక్తంగా ఉండే కరెంటు వేర్వేరు పరికరాలలోనికి. యంత్రాలలోనికి ప్రవేశించి వెలుతురుగా, చల్లదనంగా, వేడిగా, ధ్వనిగా వ్యక్తమవుతుంది. అలాగే పరమాత్మ ఇక్కడ వివిధ రూపాలలో కదులుతూ, తిరుగుతూ వ్యక్త మవుతాడు.

(1) పరమాత్మ తనంతట తానుగా అవ్యక్తంగా ఉన్నప్పుడు కదలడు. ఆయనే ఉపాధులలో ప్రవేశించినప్పుడు ఈ ఉపాధుల కదలికను ఆ పరమాత్మ యందు ఆరోపిస్తాం, కదులుతున్నాడంటాం.

మనం రైలులో కూర్చొని ప్రయాణం చేస్తున్నాం. మనం కదలటం లేదు. కాని రైలు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి కదిలిపోతున్నది. ఇంతకీ మనం కదిలినట్లా? కదలనట్లా? కదలకుండానే కదిలాం. ఐతే ఇది మనకు ఎప్పుడు కుదిరింది? రైలువంటి ప్రయాణ సాధనంలో కూర్చున్నప్పుడు.

పరమాత్మకూడా అంతే. ఉపాధులలో నున్నప్పుడే ఇలా కదలకుండా కదలటం జరుగుతుంది.

సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. క్రింద మనం ఒక కుండలో నీరు పోశాం. అప్పుడు సూర్యబింబం అందులో కనిపిస్తుంది. అసలు సూర్యుడు కదలడు. కాని కుండలోని సూర్యబింబం మాత్రం నీరు కదిలితే కదులుతుంది. సూర్యుడు కదలడనీ తెలుసు. కుండలో కదలికనీ చూస్తున్నాం. కనుక కదలిక నీటిదే. నీటి కదలికను సూర్యునిపై ఆరోపిస్తున్నాం.

పరమాత్మ కదలిక లేనిదే అయినా మన శరీర మనోబుద్ధులలో అది ప్రతి బింబించినపుడు ఈ ఉపాధి కదలికలను దాని యందు ఆరోపిస్తున్నాం. నేను నడుస్తున్నాను. నేను నిద్రపోతున్నాను. నేను బాధపడుతున్నాను. నేను ఆనందిస్తున్నాను. నేను ఆలోచిస్తున్నాను. ఇదంతా నిజంగా శరీర మనోబుద్ధులదే.

(2) ఇక పరమాత్మ దూరంగా ఉన్నది, దగ్గరగా ఉన్నది అన్నారు. పరమాత్మ ఒక వస్తువులాంటిది కాదు దూరంగానో, దగ్గరగానో ఉన్నదని చెప్పటానికి. అది నిరాకారం, సర్వవ్యాపకం. కనుక చూచేవాని దృష్టిని బట్టి దూరంగా ఉంటుంది. దగ్గరగానూ ఉంటుంది. దూరం అంటే అందుకోవటం కష్టం అని , దగ్గర అంటే అందుకొనుట సులభం అని గ్రహించాలి. భగవంతుని పట్ల విముఖులై, ఆయనను తెలుసుకొనే

ప్రయత్నం చేయకుండా పూర్తిగా లౌకిక వ్యవహారాలలో మునిగిపోయి, సంపాదించుకోవటం, దాచుకోవటం, దోచుకోవటం, భోగాలనుభవించటం, తినటం, నిద్రపోవటం - ఇవే జీవిత పరమార్థంగా భావించేవారికి పరమాత్మ దూరం, అగోచరం ఎన్ని జన్మలెత్తినా అందుకోవటం కుదరదు.

అలాగాక ప్రాపంచిక విషయాల పట్ల వైముఖ్యం చెంది, పరమాత్మనందు కొనే మార్గాన్వేషణలో శాస్త్రాల ద్వారా, సత్పురుషుల ద్వారా, సద్గురువుల ద్వారా పరమాత్మ తత్వాన్ని తెలుసుకొని, తన్మయులై సాధన చేసే వారికి ఆ పరమాత్మ దగ్గరగా ఉన్నాడు. ఒక్క జన్మలోనే అందుకోవచ్చు. కనుక నీ దృష్టిని బట్టే దూరమో దగ్గరో.

తాళం చెవి నీ మొలత్రాడులో కట్టుకున్నావు. మరచిపోయావు. ఇల్లంతా వెదికావు. ఊరంతా గాలించావు. కనిపించలేదు. ఎప్పుడో గుర్తొచ్చింది. చేతితో తడిమిచూచావు. అక్కడే ఉంది. నీ దృష్టి బాహ్యంగా వెళ్ళి ఎంత వెదికినా, ఎంత దూరం వెళ్ళినా, ఎందరినడిగినా నీకు దొరకలేదు. కారణం మతి మరపు, అజ్ఞానం. మళ్ళీ జ్ఞాపకం వచ్చిందా - ఎవరినీ అడగాల్సిన పనిలేదు. ఎక్కడా వెతకాల్సిన పనిలేదు. అది నీ దగ్గరే ఉన్నది.

అజ్ఞానంలో ఉన్నంతకాలం అది నీకు దూరం. జ్ఞానం కలిగిందా బహు దగ్గర. అజ్ఞానంలో ఉన్న హిరణ్య కశిపునికి భగవంతుడు ఎక్కడా కనిపించలేదు, ఎంతో దూరం. ఎక్కడరా నీ హరి? అని ప్రశ్నించాడు ప్రహ్లాదుని. మరి ప్రహ్లాదుడో! పరమజ్ఞాని. పరమాత్మ సర్వవ్యాపి అని తెలిసినవాడు. విశ్వసించినవాడు. కనుక ఆయనకు చాలా దగ్గర. అందుకే నిర్భయంగా చెప్పాడు. ఇందుగలడు, అందులేడు అనే సందేహం నీకక్కరలేదు. ఆయన అంతటా ఉన్నాడు. నీవు ఎక్కడ వెతికితే అక్కడే కనిపిస్తాడు తండ్రీ ! అన్నాడు

తన్మయత్వంతో.

కనుక అజ్ఞానికి, అహంకారికి, బాహ్యదృష్టి గలవానికి దూరం. జ్ఞానికి, నిరహంకారికి, అంతర్దృష్టి గలవానికి అతడెంతో దగ్గర.

(3) ఇక మూడవ పరస్పర విరుద్ధ వాక్యం - అది ఈ ప్రపంచం అంతటికీ లోపల ఉన్నది. బయట వున్నది అని. ఏ వస్తువైనా లోపల ఉంటే బయట ఉండదు. బయట ఉంటే లోపల ఉండదు. పరమాత్మ వస్తువుకాదు. అది సర్వవ్యాపకం, దానికదేసాటి. అది ఈ ప్రపంచంలోని సమస్త ప్రాణికోట్లలోనూ ఉన్నది. కనుక అంతటికీ లోపల ఉన్నది అనవచ్చు.

మరి ఈ బ్రహ్మాండం అంతా ఆయనలో ఒక అంశగదా! ఏకాంశేనస్థితో జగత్ -తన ఒక్క అంశచేతనే ఈ జగత్తును ధరించి ఉన్నాడు. అంటే ఈ బ్రహ్మాండం అంతటికీ వెలుపల ఉన్నట్లే గదా. ఆకాశం కుండకు లోపల ఉన్నది. వెలుపలా ఉన్నది.

చిన్ని కృష్ణుడు యశోదకు చూపిన లీల యొక్క అంతరార్థం ఇదే. అమ్మా ! కృష్ణుడు మన్ను తిన్నాడని రిపోర్టు చేశాడు బలరాముడు. యశోద పరుగున వచ్చి ఏదీ నోరు తెరువు అన్నది. భయం నటిస్తూ నోరు తెరిచాడు కృష్ణుడు. అంతే బ్రహ్మాండం అంతా నోట్లో కనిపించింది. 7 + 7 = 14 లోకాలు, పర్వతాలు, నదులు, సముద్రాలు, ప్రాణికోట్లు, దేవతలు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు - ఆశ్చర్యంతో నోరు తెరవటం యశోద వంతయింది. బ్రహ్మాండం వెలుపలా ఆయనే ఉన్నాడు. బ్రహ్మాండం లోపలనున్న జీవుళ్ళలోనూ ఆయనే ఉన్నాడు.

ప్రథమ మంత్రంలో ఈశా - వాస్య అనే రెండు పదాల సంయుక్త పదం వచ్చింది. ఈశ అంటే ప్రభువు - శాసకుడు - నియామకుడు అని. ఆ విషయం నాల్గవ మంత్రంలో

చెప్పటం జరిగింది. వాస్య అంటే అంతటా వ్యాపించియున్నదని. ఈ విషయం ఈ ఐదవ మంత్రంలో వివరించటం జరిగింది. అట్టి పరమాత్మను చేరుకోవాలంటే శరీర మనో బుద్ధులతో సాధన చేయాలని మొదటి రెండు మంత్రాలలోను తెలియజేశారు. అలా సాధన చేయకపోతే నష్టం ఏమిటో 3వ మంత్రంలో తెలియ జేశారు. మానవ జన్మను సార్థకం చేసుకోవాలను కున్న ముముక్షువు జిజ్ఞాసతో ఆ పరమాత్మ తత్వం తెలుసుకోవాలి. ఆ తత్వం ఏమిటో 4, 5 మంత్రాలలో వివరించారు. నిరంతర ధ్యానముగ్నులై ఈ మంత్రార్థాన్ని విచారణ చేసి ఆ తత్వంలో నిలిచిన సాధకుడు ఈ లోకంలో ఎలా వ్యవహరిస్తాడో, తనకెదురైన జీవిత సంఘటనలను ఏ దృష్టితో చూస్తాడో రాబోయే రెండు మంత్రాలలో వివరించబోతున్నారు.

## షష్ఠ మంత్రం

మం॥ యస్తు సర్వాణి భూతాని
ఆత్మన్యే వాను పశ్యతి ।
సర్వ భూతేషు చాత్మానం
తతో న విజుగుప్సతే ॥

ప్రతి పదార్థం :- యః తు = ఎవరైతే, సర్వాణి భూతాని = అన్ని ప్రాణి కోట్లను, ఆత్మని ఏవ = ఆత్మయందే (తనయందే), అనుపశ్యతి = దర్శిస్తూ ఉంటాడో, సర్వభూతేషుచ = అన్ని ప్రాణికోట్లలోను, ఆత్మానం = ఆత్మను (తనను) (అనుపశ్యతి = దర్శిస్తూ ఉంటాడో) తతః = ఇక, నవిజుగుప్సతే = జుగుప్స చెందడు,

అసహ్యించుకోడు.

భావము :- ఎవరైతే అన్ని ప్రాణికోట్లను పరమాత్మయందే దర్శిస్తూ ఉంటాడో, అన్ని ప్రాణికోట్లలోనూ ఆ పరమాత్మనే దర్శిస్తూ ఉంటాడో అట్టివాడు ఎవరిని చూచీ అసహ్యించుకోడు.

వ్యాఖ్య :- ఈ ప్రపంచం అంతా పరమాత్మయందు నిల్చి ఉన్నది. ఏకాంశతో ఈ జగత్తు నంతటినీ ధరిస్తున్నాను - అని భగవానుడు తెలియజేశాడు. కనుక ఈ జగత్తు అందులోని జీవుళ్ళు - అంటే సర్వ భూతములు కూడా ఆయన యందే నిల్చి ఉన్నవి. ఆత్మయొక్క సాన్నిహిత్యం లేకపోతే ముక్కుద్వారా లోనికి ప్రవేశించే ఊపిరి కూడా ఆ ప్రాణిని నిలబెట్టలేదు. కనుక సమస్త ప్రాణులు ఆత్మయొక్క ఆధారంతోనే నిలిచి ఉన్నాయి.

ఒకే వస్త్రంపై ప్రింటు చేయబడిన పువ్వుల బొమ్మలన్నీ ఒకే తలం ఆధారంగా ఉన్నాయి. అన్ని ఏనుగుల బొమ్మలు కూడా ఒకే ఆధారంగా ఉన్నాయి. ఒకటి ఎత్తుగాని, ఒకటి పల్లంగాని ఉండవు. అన్నింటికి ఆధారం ఆ వస్త్రమే, కనుక ఒకటి గొప్ప, మరొకటి తక్కువ అంటూ లేదు.

పరమాత్మ తత్వాన్ని యదార్ధంగా గ్రహించి, సాధన చేసిన సాధకుడు సమస్త ప్రాణులను చూచినపుడు అలాంటి దృష్టినే కలిగి ఉంటాడు. ఇక్కడ ఎన్ని రకాలైన ప్రాణులున్నప్పటికీ నిజంగా వాటన్నింటికీ ఆధారం ఒక్కటే ఐన పరమాత్మేననే దృఢవిశ్వాసం ఉంటుంది.

అంతేగాదు ఈ ప్రాణులన్నింటిలోను ఉన్నది ఆ పరమాత్మ చైతన్యమే. నిజంగా దేహం, ఇంద్రియాలు, మనస్సు, బుద్ధి, ప్రాణాలు, అన్నీ జడమైనవి. స్వతహాగా వాటికి

కదలిక లేదు, పనిచేసే శక్తిలేదు. ఆత్మయొక్క చైతన్యంతోనే అవి అన్నీ పని చేయటం జరుగుతున్నది. కనుక ఆత్మ దృష్ట్యా అందరూ సమానులే. శరీర మనోబుద్ధులలో తేడాలుండవచ్చుగాని ఆత్మ స్వరూపంలో తేడాలేదు. ఇట్టి ఆత్మజ్ఞానం గల బ్రాహ్మజ్ఞాని తోటి ప్రాణులను చూసినపుడు ఒకరిని ప్రేమించటం ఒకరిని ద్వేషించటం ఉండదు. అందరిపట్ల సమభావనతో ఉంటాడు. ఎవరినీ అసహ్యించుకోడు. సామాన్యుడు ఆత్మనుపరిగణనలోనికి తీసుకోడు. పైపై నామరూపాలను చూస్తాడు. కనుక రాగద్వేషాలు ప్రదర్శిస్తాడు.

ప్రక్క ఇంటి బాలుడు ఆడుకుంటూ ఆడుకుంటూ బంతి విసిరాడు. అది వచ్చి నీకు తగిలింది. వెంటనే వాణ్ణి తిడతావు. వాణ్ణేకాదు, వాణ్ణి విచ్చల విడిగా - అచ్చుబోసిన ఆంబోతులా వదిలేశారని, వాడి తల్లి దండ్రులనీ - వారి పెద్దలనీ- వారి వంశాన్నీ కూడా తిడతావు - వారు గనక రోషంతో తగాదాకు వస్తే పోట్లాడతావు. అదే మన అబ్బాయిగనక ఆడుతూ - ఆడుతూ బంతి విసిరితే తగిలిందనుకోండి? అప్పుడేం చేస్తావు? ఎవరినన్నా తిడతావా? లేదు. పైగా వాణ్ణి దగ్గరకు తీసుకొని, ఎత్తుకొని, ముద్దాడి, అబ్బ ! బంతి ఆట ఆడుతున్నావా? ఎంతబాగా ఆడుతున్నావురా నాయనా? అని ప్రశంసిస్తావు. నీకు నీవే గర్విస్తావు. ఇద్దరూ చిన్న పిల్లలేగదా ! ఇద్దరూ ఒకే పనిగదా చేసింది. ఇద్దరి వల్ల నీ శరీరానికి తగిలింది ఒకే రకం దెబ్బ గదా ! అయినా ఇద్దరినీ ఒకే రకంగా చూడలేక పోతున్నావు. ఏమిటి దీనికి కారణం ? ఒకడు నీవాడు. మరొకడు నీవాడుకాదు. అంతే. ఇది సామాన్యుల దృష్టి.

అయితే మహాత్ముల దృష్టి ఇలా ఉండదు. అందరిలోను ఉన్నది ఆ పరమాత్మ చైతన్యమే గనుక, అందరూ పరమాత్మ స్వరూపులే గనుక, జడ స్వరూపమైన ఈ

రకరకాల మట్టి బొమ్మలను ఆడించే చైతన్యం ఒక్కటే గనుక, తనకు ఆధారమైనదీ ఆ చైతన్యమే గనుక వారు తనకన్న వేరుకాదని, తనవారేనని, అంతా ఒక్కటేనని భావిస్తాడు. అట్టి స్థితిలో ఎవరిని చూచి మాత్రం అసహ్యించుకుంటాడు? నిజంగా నీలో ఉన్నదేదో వారిలోనూ అదే ఉన్నది గనుక వారిని అసహ్యించుకుంటే నిన్ను నీవు అసహ్యించు కున్నట్టేగదా !

నీశరీరంలో  చేతులు, కాళ్ళు, కళ్ళు, ముక్కు, నోరు, చెవులు... అనే వివిధ భాగాలు ఉన్నాయి. చెయ్యి నీదే, కాలు నీదే, కన్ను నీదే, ముక్కు నీదే, నోరు నీదే... అన్నీ నీవే. అన్నింటిలో ఉన్నది నీవే. కనుకనే నీకాలు వంకరగా ఉంటే అసహ్యించుకోవు. నీచేయి వంకరగా ఉంటే అసహ్యించుకోవు. ఎగతాళి చేయవు. నీకన్ను కనిపించక పోయినా, నీచెవి వినిపించకపోయినా నీకు ద్వేషం లేదు, కోపం లేదు.

బ్రహ్మ జ్ఞానాన్ని పొందిన సాధకుడు - ఆత్మ తత్వాన్ని పూర్తిగ అవగాహన చేసుకున్న జ్ఞాని అంతటా ఉన్నది ఆపరమాత్మేనని తెలుసుకున్నవాడు గనుక తనను తిట్ట వచ్చినవాడు, తనను కొట్టవచ్చిన వాడు, తనను అవమానించినవాడు, అందరూ పరమాత్మ స్వరూపులేనని తెలుసుకుంటాడు. గనుక పరమాత్మయే ఆ రూపంలో తన ఎదుట నున్నాడని భావిస్తాడు. కనుకనే ఎవరినీ అసహ్యించుకోడు. ద్వేషించడు.

పంచదార పాకం తయారుచేసి చిలక అచ్చులలో పోస్తే చిలకలు తయారు అవుతాయి. కుక్క అచ్చులలో పోస్తే కుక్కలు తయారవుతాయి. పంది అచ్చులలో పోస్తే పందులు తయారవుతాయి. దుకాణాదారుడు అన్ని బొమ్మలనీ షోకేస్‌లో పేర్చి ఉంచాడు అమ్ముకోటానికి. చిన్న పిల్లలు వెళతారు వాటిని కొనుక్కోవటానికి. పిల్లలు డబ్బు ఇవ్వగానే దుకాణాదారుడు పంది బొమ్మనిచ్చాడు. ఛీ ! ఛీ! ఇది నాకొద్దు. నాకు

ఆ కుక్క బొమ్మ కావాలంటాడు పిల్లవాడు. వాడికి పంది అంటే అసహ్యం. కుక్కంటే ఇష్టం. వాడు కుక్కపిల్లను పెంచుకోవాలని ఎంతో ఆశపడుతున్నాడు చాలా రోజులనుంచి. మరొక పిల్లవాడికి కుక్క బొమ్మనిస్తే అబ్బే నాకది వద్దు. నాకు ఆ చిలక కావాలి అంటాడు. వాడికి చిలక అంటే భలే ఇష్టం. అంతలో పెద్దవాడొకడొచ్చాడు. ఎంతరేటని అడిగాడు. కిలో 25 రూ॥ అని చెప్పాడు. సరే అరకిలో తూకం వెయ్యమన్నాడు. ఇందులో వేటిని తూకం వెయ్యమంటారు ? అన్నాడు దుకాణాదారుడు. ఆ ఏవైతే ఏముంది ? అన్నీ కలిపి ఒక అరకిలో తూకం వెయ్యి అన్నాడు, ఇతడికి వాటి మధ్య భేదం లేదు. కుక్కయినా, పంది అయినా, చిలకయినా, అన్నీ ఒక్కటే. ఏమిటి ఇందులోని తిరకాసు ?

పిల్లవాడు అజ్ఞాని. అతడు పైపై రూపాన్ని చూచాడేగాని అసలు పదార్థం సంగతి పట్టించుకోలేదు. పెద్దవాడు జ్ఞాని (లౌకికజ్ఞాని). అతడు పైపై రూపాలను గురించి పట్టించుకోలేదు. అసలు పదార్థం ఒక్కటేగదా ! అన్నీ ఒకే రకమైన తీపినిచ్చేవేగదా! అని తెలుసుకున్నవాడు. అతడిది అంతర్‌దృష్టి.

మరిపెద్దవాళ్ళు వీటి విషయంలో- లౌకిక వస్తువుల విషయంలో అంతర్‌దృష్టిని కలిగిఉన్నారు గాని అలౌకిక విషయాల దగ్గరకొచ్చేటప్పటికి ఆ దృష్టి ఉండటం లేదు.

సామాన్యుల దృష్టి దేహదృష్టి , మనోదృష్టి ఆకారాలు గుణాలు చూస్తారు. అసహ్యించుకుంటారు. మహాత్ముల దృష్టి ఆత్మదృష్టి. అందరూ ఒక్కటిగానే కనిపిస్తారు. తనలో ఉన్నదే వారిలోనూ ఉన్నది గనుక తనపట్ల తనెలా ఉంటాడో ఇతరుల పట్ల కూడా అలాగే ఉంటాడు. అందరిలోనూ తననే చూసుకుంటాడు గనుక అసహ్యించుకోలేడు. రోడ్డు ప్రక్కగా వెళ్తున్న పందిలో ఉన్నది కూడా తనలో ఉన్న

ఆత్మేనని తెలుసుకున్న తర్వాత ఇకదానినెలా అసహ్యించుకుంటాడు? ఇదే మహాత్ముల దృష్టి.

కనుక అన్నింటా పరమాత్మను దర్శిస్తూ దేనినీ అసహ్యించుకోకు అని బోధిస్తున్నదీ మంత్రం, మహాత్ములలా ప్రవర్తిస్తారు అని తెలియజేస్తున్నది.

## సప్తమ మంత్రం

మం ॥ యస్మిన్ సర్వాణి భూతాని

ఆత్మైవా భూ ద్విజానతః ।

తత్రకో మోహః కః శోకః

ఏకత్వమను పశ్యతః ॥

ప్రతిపదార్ధం :- విజానతః = ఆత్మజ్ఞానికి (తాను ఆత్మ అని తెలుసుకున్న వానికి), యస్మిన్ = ఏ (ధ్యాన) సమయంలో, సర్వాణి భూతాని = సమస్త ప్రాణికోట్లు, ఆత్మఏవ = ఆత్మస్వరూపంగానే, అభూత్ = భాసిస్తాయో (కనిపిస్తాయో), తత్ర = అప్పటినుండి, ఏకత్వం = ఏకత్వాన్నే (ప్రాణులన్నీ ఒక్కటేనని), అనుపశ్యతః = చూస్తూ ఉంటాడు, మోహః కః = మోహమెక్కడ ? , శోకః కః = శోకమెక్కడ ?

భావం :- ఆత్మయే తానని తెలుసుకున్న ఆత్మజ్ఞానికి - ఏ సమయంలో ఈ సమస్త ప్రాణులు పరమాత్మ స్వరూపమేనని అనుభూతి కలుగుతుందో, ఇక అప్పటినుండి అతడు అన్ని ప్రాణులను ఒక్కటిగానే చూస్తుంటాడు. అట్టివానికి ఇక ఎట్టి భ్రమగాని, శోకంగాని ఉండవు.

వ్యాఖ్య :- ఆత్మజ్ఞాని అంటేఎవరు ? నేను ఆత్మను అని తెలుసుకున్నవాడు, ఆ తెలివి ఉన్నవాడు. మరి సామాన్యులో ! వీరి తెలివి ఏమిటి ? నేను శరీరాన్ని అని. అందుకే శరీరానికి దెబ్బ తగిలితే నాకు దెబ్బ తగిలింది అంటాం. శరీరం లావెక్కితే నేను లావెక్కాను అంటాం.

అంతేగాక మరొక తెలివి ఉంది. నేను మనస్సును అని. ఎవరన్నా మనను దూషిస్తే శరీరం మీద ఏ మార్పూ కనిపించదు. కాని మనస్సులో బాధ, కోపం, ఇలా అన్నారే అని ఉద్రేక పడతాం. నేను చాలా బాధ పడ్డానండీ అంటాం. లేదా నాకు చాలా కోపం వచ్చింది అంటాం. అంటే శరీరానికి కలిగిన బాధ నాకు కలిగిందంటాం. మనస్సుకు కలిగిన బాధ నాకు కలిగింది అంటాం. ఎందుకంటే మన జ్ఞానం నేను శరీరాన్ని - నేను మనస్సును అని గనుక. ఇలాంటి జ్ఞానం నిజమైన జ్ఞానమేనా ?

ఈశరీరం ఎవరిది ? అని ప్రశ్నిస్తే నాది అంటాం. ఈ పుస్తకం ఎవరిది అంటే నాది అంటాం. అంటే పుస్తకం కన్న దాని హక్కుదారుణ్ణయిన నేను వేరే ఉన్నట్లే గదా! నేనే పుస్తకాన్ని అనంకదా ! అలాగే శరీరంనాది అంటున్న నేను శరీరం కన్న వేరుగా ఉన్నట్లే గదా ! మరి నేనే శరీరం అని అనకూడదు గదా! అయితే అలాంటి భావనను - తెలివిని కలిగి ఉన్నామే! కనుక ఈ తెలివి తెలివి కాదు. ఈ జ్ఞానం నిజమైన జ్ఞానం కాదు. ఇది అజ్ఞానం.

ఈ అజ్ఞానం లో ఉన్న వారికి అంతటా భేదమే కన్పిస్తుంది. ఎందుకంటే ఒక శరీరం ఉన్నట్లు మరొక శరీరం ఉండదు. ఒక ప్రాణి ఉన్నట్లు మరొక ప్రాణి ఉండదు. కుక్కకు నక్కకు భేదం, నక్కకు పందికి భేదం, పందికి పక్షికి భేదం, పక్షికి పాముకు భేదం, పాముకు కోతికి భేదం, కోతికి మనిషికి భేదం. మనిషికి మనిషికి భేదం. అలాగే

మనసుకు మనసుకు భేదం. ఆకారంలో భేదం, గుణాలలో భేదం, మంచి చెడులలో భేదం, అంతటా భేదమే. అజ్ఞానుల దృష్టి భేద దృష్టి.

మరి జ్ఞానుల దృష్టి ఎలా ఉంటుంది? తాను ఆత్మ. ఎదురుగా ఉన్నవారూ ఆత్మయే. వారింట్లో కుక్కపిల్లకూడా ఆత్మయే. ఆయనను కుట్టే దోమలు, నల్లులు అవీ ఆత్మే. మురుగు కాల్వలో తిరుగుతున్న పంది. అదీ ఆత్మే. ఆయనను అకారణంగ దూషించే వాడో - అతడూ ఆత్మే. ఈ ప్రపంచంలో కనిపించే అన్ని ప్రాణులూ ఆత్మే. తానూ - అన్ని ప్రాణులూ - అన్నీ ఆత్మయే. ఇది సమాధి నిష్ఠలో కలిగే అనుభూతి. అట్టి మహాత్ముని దృష్టి ఎలాగుంటుంది ?

తనలోని ఆత్మ రంగు ఏమిటి ? సైజు ఏమిటి ? తూకం ఏమిటి ? పేరేమిటి ? మిగిలిన వారిలోని ఆత్మ రంగు, సైజు, తూకం, పేరు ఏమిటి ?

ఆత్మకు రంగులేదు, సైజులేదు, తూకంలేదు, పేరులేదు. కారణం ఆత్మ స్థూలమైనది కాదు. సూక్ష్మాతి సూక్ష్మం. కంటితో చూడలేం. మనస్సుతో భావించలేం. అది నిరాకారం, నిర్గుణం, నిరంజనం , నిర్వికారం, ఆత్మ ఎక్కడున్నా అంతా ఒక్కటే. మనిషి ఆత్మ, కుక్క ఆత్మ, నక్క ఆత్మ అని ఇన్ని ఆత్మ లుండవు. లైటులోని కరెంటు, ఫ్యానులోని కరెంటు, ఫ్రిజ్‌లోని కరెంటు, హీటరులోని కరెంటు అంటూ ఇన్ని కరెంట్లుండవు. అంతా ఒక్కటే. వేరు వేరు జీవుళ్ళలో ప్రతిబింబించే ఆత్మ కూడా ఒక్కటే. ఒకే సూర్యుడు అనేక పాత్రలలోని నీటిలో ప్రతిబింబించినట్లు - ఒకే గాలి అనేక గ్లాసులలో ఉన్నట్లు, ఒకే ఆకాశం అనేక పాత్రలలో ఉన్నట్లు, ఒకే ఆత్మ అనేక ఉపాధులలో (క్షేత్రాలలో) ప్రతిబింబిస్తుంది. అంతే. అన్ని ప్రాణులూ ఒకే ఆత్మయొక్క స్వరూపాలు. కనుకనే జ్ఞాని ఏకత్వం అనుపశ్యతి ఏకత్వాన్నే చూస్తాడు అని చెప్పటం.

ఇలా అంతటా ఏకత్వాన్నే చూసేవాడు ఈ లోకంలో ఎలా ప్రవర్తిస్తాడు ? అతడికి

మోహం లేదు. శోకం లేదు. మోహం అంటే భ్రమ. నేను వేరు, నీవు వేరు, అతడు వేరు అనే దృష్టియే భ్రమ. అదే మోహం. మోహం ఉన్నంత వరకు శోకం ఉంటుంది. మోహం తొలగితే శోకం కూడా తొలగిపోతుంది.

మనలో భేదదృష్టి ఉన్నంతకాలం, అందరూ వేరు వేరనుకున్నంత కాలం ఈ శోకం తప్పదు. ఆత్మీయుడు దగ్గరకొస్తే ఆనందం. దూరమైతే శోకం. మన అబ్బాయి మన గుండెల మీద తంతే ముద్దు. అదే ఇతరుల పిల్లలు తంతే కోపం. వాడిమీద ద్వేషం.

అదే ఏకత్వ దృష్టి ఉంటేనో ! అప్పుడు మోహం ఉండదు. శోకం ఉండదు. నీ కంట్లో పొరపాటున నీ వ్రేలు పొడుచుకున్నది. వ్రేలు మీద కోపమా ? చాకు తెచ్చి వ్రేలును కోస్తావా ? నీ పంటి క్రింద నీ నాలుక పడినలిగింది. పంటి మీద కోపమా ? రాయితెచ్చి పన్ను ఊడగొడతావా? డెంటిస్ట్ దగ్గరకు వెళతావా పన్ను పీకేయమని ? అహ! నీ గోరు నీ శరీరంలో గుచ్చుకుంది. గోరు మీద ప్రతీకారం తీర్చుకోవాలను కున్నావా ? లేదు. కారణం ? కన్నూ నీదే - వ్రేలూ నీదే, పన్ను నీదే - నాలుకా నీదే, గోరూ నీదే - శరీరమూ నీదే. అంతటా ఏకత్వం - అందుకే కోపం లేదు. శోకం లేదు. సర్దుకున్నావు. ఎలాగో సమాధానపడ్డావు.

అలాగే నీ మీద ద్వేషంతో నిన్ను దూషిస్తూ వచ్చినవాడు నీ స్వరూపమే అనుకున్నప్పుడు, అతడు నీవే అనుకున్నప్పుడు అతడిమీద కోపం ఉంటుందా ? ఉండదు గదా ! దొంగ నీ జేబులో 100 రూ॥ కొట్టేశాడు. శాపనార్థాలు పెడతావు. నీకుమారుడు 1000 రూ॥ దొంగిలించాడు. తిట్టవు. బాధపడతావు. నీ అల్లుడు బంగారు గొలుసు

కొట్టేశాడు. పోనీలెండి మనమ్మాయికేగా ఉండేది అని నీ భార్య హితోక్తి. అంతా నీ వారు అనుకుంటే కోపం లేదు శోకం లేదు.

ఏకత్వాన్ని దర్శించే అట్టి జ్ఞాని - జీవన్ముక్తుని స్వరూపం, లక్షణాలు తర్వాత మంత్రంలో.

## అష్టమ మంత్రం

మం ॥ సపర్యగాచ్ఛుక్ర మకాయ మవ్రణం

అస్నా విరగ్ం శుద్ధ మపాప విద్ధం ।

కవిర్మ నీషీ పరిభూః స్వయం భూః

యాధా తథ్యతో ర్థాన్ వ్యదధా చ్ఛాశ్వతీభ్యః సమాభ్యః ॥

ప్రతిపదార్థం :- సః = అతడు, శుక్రమ్ = స్వచ్ఛమైనవాడు, అకాయం = శరీరం లేనివాడు, అవ్రణం = గాయాలు లేనివాడు, అస్నావిరం = నాడులు లేని వాడు, శుద్ధం = కల్మషాలు లేనివాడు, అపాపవిద్ధం = పాపంచేత తాకబడనివాడు, పర్యగాత్ = అంతటా వ్యాపించియున్నవాడు, కవిః = సర్వజ్ఞుడు (సర్వసాక్షి), మనీషి = మనస్సుకు ప్రభువు, పరిభూః = అన్నింటికన్న పైనున్నవాడు, స్వయంభూః = తన స్వరూపంలో నిల్చినవాడు, శాశ్వతీభ్యః = శాశ్వతంగా ఉండే, సమాభ్యః = సంవత్సరాలకు, యాధా తథ్యతః = ఎప్పటిలాగానే, అర్థాన్= సర్వపదార్థాలను , వ్యదధాత్ = సృష్టించి ఇచ్చేవాడు.

భావం :- జీవన్ముక్తుడైన జ్ఞాని స్వచ్ఛమైన వాడు, శరీరంలేనివాడు, గాయాలు

- వ్యాధులు లేనివాడు, నాడులు లేనివాడు, నిర్మలమైనవాడు, పాపముల చేత తాకబడని వాడు, అంతటా వ్యాపించియున్నవాడు, అతడు సర్వజ్ఞుడు (సర్వసాక్షి), మనస్సుకు ప్రభువు, అన్నింటికి పైన ఉన్నవాడు, తన స్వరూపంలో నిల్చినవాడు (స్వాత్మజ్ఞానం గలవాడు) శాశ్వతంగా ఉండే సంవత్సరాలకొరకు ( మనువులకు) యధాప్రకారంగా ఎప్పటిలాగా సమస్త పదార్ధాలను సృష్టించి ఇచ్చేవాడు.

వ్యాఖ్య :- ఆత్మజ్ఞానం పొంది, అంతటా పరమాత్మనే దర్శిస్తూ సర్వత్రా ఏకత్వాన్నే దర్శించగల మహాత్ముణ్ణే జీవన్ముక్తుడు అంటాం. అంటే జీవించి యుండగానే ముక్తిని పొందినవాడు అని. అట్టి మహాత్మునికి ప్రారబ్ధవశాత్తు వచ్చిన దేహం ఇంకా ఉంటుంది. అయినా దానితో ఆయనకేమీ సంబంధం లేదు. నారింజకాయకు ఎలాగైతే పైన ఉన్నతోలు అంటీ ముట్టనట్టు ఉంటుందో దేహంతో జీవన్ముక్తునికి ఉండే సంబంధం అలాంటిదే.

ఇప్పుడు జీవన్ముక్తుడు తన నిజస్వరూపంలో నిలిచి ఉంటాడు. దేహ మనోబుద్ధులతో సంబంధం లేకుండా ఉంటాడు.

నీ పేరు ఆనంద్, బ్యాంకులో ఆఫీసరువు. నల్లగా ఉంటావు. నీ స్నేహితులతో కలిసి నాటకం వేస్తున్నావు. అందులో నీది హీరోయిన్ పాత్ర. ఎర్రగా, అందంగా ఉండేట్లు మేకప్ చేశారు. ఆ పాత్రలో నీవు నటిస్తున్నప్పుడు కూడా నేను ఆనంద్ అనే పేరుగల బ్యాంకు ఆఫీసర్‌ను అనుకుంటున్నావా ? లేక పరిమళ అనే పేరుగల అమ్మాయిని అనుకుంటున్నావా ? ఏ వేషంలో ఉన్నా దానితో నీకేం సంబంధంలేదు. నీవు పురుషుడివని, నల్లగా ఉండేవాడివని ఎవరూ నీకు గుర్తు చేయనక్కరలేదు. అలాగే జీవన్ముక్తునకు తాను పరమాత్మను అన్న సంగతిని ఎవరూ గుర్తు చేయనక్కరలేదు.

తానూ గుర్తు చేసుకోనక్కరలేదు. నేను పరమాత్మనే అనే అనుభూతి ఎల్లవేళలా అతడికి ఉంటూనే ఉంది. ఇప్పుడట్టి పరమాత్మ స్వరూపాన్నే వర్ణిస్తున్నారు. అతడి దేహాన్ని గాని, అతడి మనోబుద్ధులనుగాని కాదు.

సః - అంటే అతడు, ఆ జీవన్ముక్తుడు, సాధన చేసి తన స్వరూపంలో నిలిచిన మహాత్ముడు. అతడి నిజస్వరూపం ఎలాంటాది ?

(1) శుక్రం :- స్వచ్ఛమైనది. తేజస్సుతో కూడినట్టిది. కల్మషాలు లేనట్టిది. కల్మషాలు శరీర మనోబుద్ధులకే గాని ఆత్మకు కాదు.

(2) అకాయం :- కాయంలేని వాడు. శరీరం అనేది దేనికి ? చేసిన కర్మఫలాలు అనుభవించటానికి, వాసనలనుబట్టి కర్మలు చేసి ఖర్చుచేసుకోవటానికి. అయితే జీవన్ముక్తునికి కర్మఫలాలు, వాసనలు, జ్ఞానాగ్నిలో దగ్ధమై పోయాయి. కనుక అతడికి అనుభవించవలసిన సుఖ దుఃఖభోగాలేమీ లేవు. కనుక వాటిని అనుభవించేందుకు దేహం లేదు. ఉన్నదేహంతో అతడికేం సంబంధంలేదు. కురిడీ కొబ్బరికాయలో కొబ్బరికి టెంకెతో సంబంధం లేనట్లు అతడికి శరీరంతో సంబంధంలేదు. కనుక శరీరంలేనివాడే.

(3) అవ్రణం :- కాయంలేనివానికి గాయం ఉండదు. కనుకనే అవ్రణం అన్నారు. మనకు శరీరం ఉంది గనుకనే గాయాలు, వ్యాధులు, ఉంటున్నాయి. ఆయనకు శరీరం ఉన్నా దానితో సంబంధంలేదు కనుక గాయాలు లేవు, వ్యాధులు లేవు.

మరి రామకృష్ణ పరమహంస, రమణ మహర్షి వ్యాధులతో బాధ పడ్డారు గదా - వాళ్ళేమీ బాధలు పడలేదు. వాళ్ళు బాధపడుతున్నారని వాళ్ళని చూస్తున్న శిష్యులు - ఇతరులు బాధపడ్డారు. వారి శరీరానికి కలిగిన బాధ - వ్యాధి వారికి కలిగినట్లు కాదు. వారికేమీ బాధ లేనేలేదు.

(4) అస్నావిరం :- నాడులు లేని వాడు. శరీరమే లేనప్పుడు నాడులెలా ఉంటాయి?

(5) శుద్ధం :- ఆకాశంలాగా నిర్మలమైనది. ఆకాశంలో ఎన్నో పక్షులు తిరుగుతుంటాయి. కాని వాటి కాలి గుర్తులుగాని, రెక్క గుర్తులు గాని అక్కడేమీ ఉండవు. ఆకాశంలో సంచరించే వాయువు అనేక వాసనలను మోసుకుంటూ ఒకచోటినుండి ఒకచోటికి పోతుంది. ఐనా ఆకాశానికేమీ ఆ వాసనలంటవు. శరీరం మల సంబంధం. శరీరంలేని ఆత్మ నిర్మలం - శుద్ధం. అద్దంలాగా దేనినీ అంటించుకోదు.

(6) అపాపవిద్ధం :- పాపాలేమీ అంటనివాడు. అసలు పాపాలు ఎలా జరుగుతున్నాయి ? కారణ శరీరంలో వాసనలున్నాయి. అవే పాపాలు. అవి ప్రేరేపిస్తుంటే మనస్సు దానికి సంబంధించిన ఆలోచనలు చేస్తుంది. బుద్ధి ఆ ఆలోచనలకు ఒకరూపమిచ్చి ఇలా చేయమంటుంది. శరీరం దాని కనుగుణంగా కర్మలు చేస్తుంది. జీవన్ముక్తునికి శరీర మనోబుద్ధులతో సంబంధం లేదు. కారణ శరీరంలోని వాసనలన్నీ జ్ఞానాగ్నిలో దగ్ధమైపోయాయి. కనుక ప్రేరణలేరావు. కనుక పాపం చేసే ప్రశ్నేలేదు. ఇక్కడ పాపం అంటే పాపపుణ్యాలు రెండూ. రెండింటినుండి విడుదల పొందినవాడు ఆత్మజ్ఞాని. అందుకే అపాపవిద్ధం.

(7) పర్యగాత్ :- సర్వత్రా వ్యాపించియున్నవాడు. శరీరం ఉంటే ఒకచోట ఉంటుంది. మిగతా చోట్ల ఉండదు. స్థూలమైన దానికి పరిమితులుంటాయి. ఆత్మ సూక్ష్మాతిసూక్ష్మం. కనుక అంతటా వ్యాపించి యుంటాడు. ఆకాశం సూక్ష్మం గనుక అంతటా ఉన్నది, అయితే స్థూల వస్తువులలో ఉండదు. కాని ఆత్మ సూక్ష్మాతిసూక్ష్మం గనుక సర్వత్రా ఉంటుంది. స్థూల వస్తువులలో కూడా ఉంటుంది.

ఇది పరమాత్మ యొక్క యదార్ధ స్వరూపం. ఇక అతడి లక్షణాలేమిటో చూద్దాం. అతడు కవి, మనీషి, పరిభూః, స్వయంభూః...

(8) కవి :- అంటే సర్వమూ తెలిసినవాడు అని, సర్వాన్ని దర్శించేవాడు అని. రవిగాంచనిచో కవిగాంచును అన్నారు కవుల ప్రతిభను వర్ణిస్తూ. అన్ని విషయాలను తెలుసుకొంటూ తన రచనలను సాగిస్తాడు గనుక అతణ్ణి కవి అన్నారు. మరి ఆత్మజ్ఞాని అంతటా వ్యాపించి యున్నవాడు, అంతటా ఉన్నాడు గనుక ఎక్కడెక్కడి విషయాలు అతడికి తెలుసు. ఆయన పరిమితమైన బుద్ధితో ఆలోచించేవాడు కాదు. అపరిమిత తత్వమైన ఆత్మగా తెలుసుకొనేవాడు. కనుక ఆయనది పరిపూర్ణ జ్ఞానం. బుద్ధికి కొన్ని తెలుసు. కొన్ని తెలియవు. ఆత్మకు అన్నీ తెలుస్తాయి.

సూపర్ బజారులో కిరాణా సరుకులుంటాయి, ఫ్యాన్సీ సామానుంటుంది, బట్టలుంటాయి, కూరగాయలుంటాయి, ఎలక్ట్రిక్ సామానులుంటాయి. ఒక్కొక్క రకానికి ఒక్కొక్క గది, ఒక్కొక్క మేనేజరును నియమిస్తారు. ఏ గదిలో కూర్చొనే మేనేజరుకు ఆ గదిలోని వస్తువుల విషయమే తెలుస్తుంది. కాని అన్నింటిని చూసుకొనే మేనేజింగ్ డైరెక్టరుకు అన్ని విషయాలు తెలుస్తాయి. అతడు అన్ని గదులను పరిశీలన చేస్తుంటాడు.

డాక్టరుకు వైద్యం తెలుస్తుంది. లాయరుకు న్యాయ విషయాలు తెలుస్తాయి. చెప్పులు కుట్టేవానికి తోళ్ళ పరిజ్ఞానం ఉంటుంది. వీరంతా పరిమిత జ్ఞానం కలవారే. ఒక నవల రాయాలనుకున్న కవి తన నవలలో వచ్చే పాత్రల స్వభావాలన్నింటిని తెలుసుకోవాలి గనుక అన్ని విషయాలను కొంచెం కొంచెం అవగాహన చేసుకుంటాడు. అలాగే ఈ సమస్త ప్రపంచాన్నీ నడిపించాల్సిన పరమాత్మ అన్ని జ్ఞానాలు కలిగి ఉంటాడు, అన్నింటిని దర్శిస్తూ ఉంటాడు. అందుకే ఆయన సర్వజ్ఞుడు, సర్వసాక్షి అన్నారు. అట్టి

వాడు గనుకనే కవి అన్నారు.

(9) మనీషి :- అంటే మనస్సుకు ప్రభువు అని. మనస్సును జయించి తన ఆధీనంలో పెట్టుకున్నవాడు ఆత్మజ్ఞాని. మనస్సుకు బానిస సామాన్యుడు. నిజంగా ఈ మనస్సే ప్రపంచాన్ని సృష్టించింది. ఆత్మను మరుగు పరచి ప్రపంచాన్ని కల్పించి ఈ కల్పిత ప్రపంచంలో మరుగు పడిన ఆత్మను అంటే జీవుణ్ణి త్రిప్పుతున్నది. అయితే సాధన చేసి జీవుడు మనస్సుయొక్క వలలోనుండి బయటపడి కల్పిత ప్రపంచం నుండి తప్పుకున్నాడా! అతడిక ఆత్మ స్వరూపంలోనే నిలుస్తాడు.

ఒక పారిశ్రామిక వేత్త ఒక గుమాస్తాను నియమించుకున్నాడు. అతడు ఈ పారిశ్రామిక వేత్తను క్లబ్బుల చుట్టూ త్రిప్పుతూ అతణ్ణి తన బానిస చేసుకున్నాడు. దానితో అతడు పేకాట , త్రాగుడు లాంటివి అలవాటు చేసుకొని పతనమైపోతున్నాడు. అతడు ఆ గుమాస్తాకు బానిసగా ఉన్నంతకాలం అతడి గతి అధోగతే. తన దురలవాట్ల నుండి బయట పడి ఆ గుమాస్తాను తన ఆధీనంలోనికి తెచ్చుకోవటమో, తీసివేయటమో చేస్తే మళ్ళీ అతడు తన నిజస్థితిలోకి, ఉన్నత స్థితిలోకి వస్తాడు.

ఇక్కడ పారిశ్రామికవేత్త ఆత్మ. గుమాస్తా మనస్సు, క్లబ్బు ప్రపంచం. జీవన్ముక్తుడు మనస్సును తన స్వాధీనంలో ఉంచుకుంటాడు. తనలో లయం చేసుకుంటాడు. దానికి ప్రభువు అవుతాడు. ఆయన చెప్పినట్లు అది వినాల్సిందే. అతడే మనీషి.

(10) పరిభూః :- అన్నింటికీ అతీతుడు. అన్నింటికీ పైన ఉన్నవాడు. మనస్సులో కామక్రోధాలు, రాగద్వేషాలు ఉంటాయి. మనస్సును లోబరచుకున్న జ్ఞానిలో ఈ ద్వంద్వాలుండవు. మనోస్థాయిని దాటిన ఆత్మజ్ఞానిలో ఏవిధమైన రాగద్వేషాలుండవు. ఆయనే పరిభూః అంటే.

(11) స్వయంభూః :- ఆయన స్వతస్సిద్ధుడు. కొన్ని దేవాలయాలలో విగ్రహాలు చెక్కించి ప్రతిష్ట చేయిస్తారు. కాని కొన్ని పురాతన దేవాలయాలలో విగ్రహాలు తయారు చేయించరు. ఎప్పటినుండో అక్కడొక విగ్రహం ఉంటుంది. దాని చుట్టూ ఆలయం కట్టిస్తారు. ఇట్టి విగ్రహాలను స్వయంభూః అంటారు. అలాగే జీవన్ముక్తుడు ఏసాధనలూ చేయనక్కరలేదు. ఏజ్ఞానాన్నీ పొందనవసరం లేదు. ఆయన స్వయంగా జ్ఞానియే. అందుకే ఆయన స్వయంభూః అన్నారు. స్వప్రకాశం గలవాడాయన.

(12) ఎప్పటిలాగానే శాశ్వత సంవత్సరాల కొరకు సర్వపదార్థాలను సృష్టించును. ఇది అత్యంత నిగూఢంగా చెప్పిన ఉపనిషద్వాక్యం. ఇది పరమాత్మ యొక్క ముఖ్య కార్యం. అదేమిటో తెలుసుకుందాం.

మనకు 4 యుగాలున్నాయి. కృత త్రేతా ద్వాపర కలియుగాలు. ఈ నాలుగు కలిపితే మహాయుగం అన్నారు. ఇలాటి 71 మహాయుగాలైతే మన్వంతరం అంటారు. ఇలాంటి మన్వంతరాలు 14 అయితే కల్పం అంటారు. అదే బ్రహ్మకు ఒక పగలు. బ్రహ్మకు పగలు అంటే సృష్టి, రాత్రి అంటే లయం. ఈ బ్రహ్మయొక్క పగటి కాలంలో 14 మన్వంతరాలుంటాయి. ఒక్కొక్క మన్వంతరాన్ని ఒక్కొక్క మనువు పాలిస్తాడు. అంటే 14 మంది మనువులు ఒకరి తర్వాత ఒకరు పాలిస్తారు. వీరే శాశ్వత సంవత్సరాలు. వీరికి పేర్లున్నాయి. స్వారోచిష, స్వాయంభువ, చాక్షుస, రైవత, రుద్రసావర్ణి, బ్రహ్మసావర్ణి, వైవస్వత అని. ఇప్పటి మనువు వైవస్వత మనువు. ఇది వైవస్వత మన్వంతరం.

ఈ సృష్టిని పాలించే ప్రభువులు వీరే. వీరు పాలించే వారేగాని, సృష్టించేవారుకాదు. వీరుకూడా బ్రహ్మచేత సృషింపబడిన వారే. మరి వీరు పాలించాలంటే ఇక్కడొక ప్రపంచం - జగత్తు సృష్టింపబడాలి గదా ! అందులో అనేక ప్రాణులు, జడపదార్థాలు, చెట్లుచేమలు,

రకరకాల వస్తువులు సృష్టింపబడాలి. వీటన్నింటిని సృష్టించేవాడు చతుర్ముఖ బ్రహ్మ - పరమేష్ఠి. అయితే ఆయనా స్వతంత్రుడు కాదు. ఆయనను సృష్టించి నడిపే దివ్యశక్తి ఒకటుంది. అదే పరమాత్మ. కనుక ఆ పరమాత్మ ఈ శాశ్వత సంవత్సరాలకొరకు అంటే మనువులకొరకు ఎప్పటిలాగానే బ్రహ్మచేత ఇష్ఠిద్వారా నిరంతర సృష్టిచేయిస్తూ సమస్త వస్తువులను సృష్టింపజేస్తూ ఉంటాడు. ఈ 14 మంది మనువులు ఒకరి తర్వాత ఒకరు పాలించటం పూర్తి కాగానే ఆ బ్రహ్మ యొక్క పగటికాలం (కల్పం) పూర్తవుతుంది. ఆయనకు రాత్రికాలం (ప్రళయం) వస్తుంది. ఆసమయంలో ఈ సృష్ఠి, మనువులు అంతా అవ్యక్తంలోకి పోతారు. మళ్ళీ తెల్లవారగానే రాత్రి గడచి పోగానే ఎప్పటిలాగే ఈ మనువులు వారి కొరకు ఈ జగత్తు, వస్తువులు సృష్టింపబడతాయి. ఇలా సర్వాన్ని సృష్టించే ఆ పరమాత్మే ఈ జీవన్ముక్తుడు.

ఇట్టి స్థితిని-జీవన్ముక్త స్థితిని-పరమాత్మ స్థితిని పొందటానికే ఉపనిషత్తులు మార్గాలను చూపిస్తున్నాయి. అవే కర్మ మార్గం భక్తి మార్గం జ్ఞాన మార్గం ధ్యాన మార్గం. అయితే ఈ మార్గాలన్నీ స్వతంత్ర మార్గాలా ? ఒకదానికొకటి అనుబంధమా ? ఏదో ఒక మార్గాన్ని పట్టుకుంటే మనను గమ్యానికి చేరుస్తుందా ? లేక అన్నింటిని సమన్వయం చేసి ఆ మార్గాలలో ప్రయాణించాలా ? ఈ విషయాలను రాబోయే 6 మంత్రాలలో వివరించబోతున్నారు.

# నవమ మంత్రం

మం॥ అంధం తమః ప్రవిశంతి

యే విద్యా ముపాసతే ।

తతో భూయ ఇవతే తమః

య ఉ విద్యా యాగ్ం రతాః ॥

ప్రతిపదార్థం - యే = ఎవరైతే అవిద్యాం = కర్మ మార్గమును, ఉపాసతే = అనుష్ఠిస్తారో, అంధం తమః = కటిక చీకట్లోనికి, ప్రవిశంతి = ప్రవేశిస్తారు, యఉ =ఎవరైతే నిజంగా, విద్యాయాం = జ్ఞానమార్గమునందు, రతాః = రమిస్తూ ఉంటారో, తే = అట్టి వారు, తతః = అంతకన్న, భూయ = ఎక్కువైనదా, ఇవ = అనిపించే, తమః = తమస్సులోనికి - చీకట్లలోనికి (ప్రవేశిస్తారు)

భావం:- ఎవరైతే కర్మ మార్గాన్ని అనుసరిస్తారో అట్టివారు కటిక చీకట్లలోకి ప్రవేశిస్తారు. ఎవరైతే నిజంగా జ్ఞానమార్గంలో రమిస్తూ ఉంటారో, వారు అంతకన్న ఎక్కువైనదా అనిపించే చీకట్లలోనికి ప్రవేశిస్తారు.

వ్యాఖ్య:- మొదటి మంత్రంలో చెప్పినట్లు మన మనోబుద్ధులు సరిచేసుకోవాలంటే - కుర్వన్నేవేహకర్మాణి - అంటూ మనం కర్మలు చేస్తూనే నూరేళ్ళూ జీవించాలి. ఇదే నీకున్న ఏకైక మార్గం అని రెండవ మంత్రంలో చెప్పారు. శరీరం ద్వారా కర్మలు చేస్తూ జీవించాలి అని చెప్పారు గనుక జీవితాంతం నేను కర్మలు చేస్తూనే జీవిస్తాను. ఇంక నాకేం అవసరం లేదు అనుకున్నావా? నీవు అంధకారంలోకి తోసివేయబడతావు అని ఇక్కడ హెచ్చరిక చేస్తున్నారు. ఇదేమిటి? -

కర్మలు 2 రకాలు. 1. నిషిద్ధ కర్మలు (శాస్త్ర విరుద్ధ) 2. ఉత్తమ కర్మలు (శాస్త్ర

విహిత కర్మలు). నిషిద్ధ కర్మలు చేస్తే దుఃఖాన్ని పొందాలి. నీచమైన జన్మలు పొంది అధోగతియే. అలాగాక ఉత్తమ కర్మలు - అంటే పుణ్యకార్యాలు, దాన ధర్మాలు, పూజా పునస్కారాలు, యజ్ఞ యాగాలు - ఇలాంటివి చేస్తూ ఉంటే - వీటి కారణంగా సుఖాలు కలుగుతాయి. దేవజన్మలు కలుగుతాయి. అక్కడ భోగాలు అనుభవించవచ్చు. కాని ఈ కర్మ ఫలాలు ఖర్చుకాగానే మరల భూలోకానికి రావాల్సిందే. వెనుకటి సంచిత కర్మలలో నుండి ఏ కర్మఫలాలు పక్వానికి వస్తే వాటికనుగుణంగా నీచజన్మలో మంచి జన్మలో పొందాలి. అంటే మళ్ళీ మళ్ళీ గర్భనరకం తప్పదు. జన్మ, జరా, వ్యాధి, మరణ దుఃఖాలూ తప్పవు. కనుక కర్మ మార్గంలో ప్రవేశిస్తే కటిక చీకట్లే అనటం.

మరి భగవద్గీత వంటి శాస్త్రాలవల్లనో, మహాత్ముల సాంగత్యం వల్లనో నిష్కామ కర్మల ప్రాముఖ్యత తెలుసుకొని ఆ కర్మలనే ఆచరిస్తేనో - అలా నిష్కామకర్మలాచరిస్తే కొత్తగా కర్మఫలాలు వచ్చిచేరేదిలేదు. పాతవాసనలు ఖర్చుఅయిపోయి మనశ్శుద్ధి ఏర్పడుతుంది. అయితే అంతవరకే చేస్తే మనశ్శుద్ధి జరిగే మాట నిజమే. కొత్తగా కర్మఫలాలు రావు. మరి పూర్వార్జితమైన సంచిత కర్మల మాటేమిటి? వాటి కోసం ఎన్నో లక్షల - కోట్ల జన్మలెత్తాల్సిందే గదా! కనుక కటిక చీకట్లలోకి పోక తప్పదన్నమాట. కనుక కేవలం కర్మలు చేసినంత మాత్రాన మళ్ళీ మళ్ళీ జన్మలు తప్పవు. దుఃఖాలు తప్పవు. అందుకే కటిక చీకట్లలోనికి ప్రవేశిస్తావు అని హెచ్చరిక.

సరే, ఎప్పుడూ కర్మలు చేస్తే కటిక చీకట్లలోనికి పోవటమే గదా! సంచిత కర్మల మాట అలాగే ఉంటున్నది గదా? మరి వాటిని దగ్ధం చేయాలంటే జ్ఞానాగ్నిని పుట్టించాలిగదా! అంటే జ్ఞాన మార్గంలో నడవాలి గదా! అని జ్ఞాన మార్గంలో నీవు ప్రయాణించినా అంతకన్న ఎక్కువైనదా అనిపించే అంధకారంలో పడిపోతావు అని

హెచ్చరిక చేస్తున్నారు.

జ్ఞానం అంటే ఆత్మజ్ఞానం. ఈ ఆత్మజ్ఞానాన్ని ఉపనిషత్తులు, భగవద్గీత, వేదాంత గ్రంధాలు మనకు తెలియజేస్తాయి. కనుక నిరంతరం వీటిని గురించి అధ్యయనం చేస్తుంటాం. ఎవరైనా మహాత్ములు ఉపన్యశిస్తుంటే వింటుంటాం. వాటిని గురించి ఇతరులతో చర్చిస్తుంటాం, ఇతరులకు బోధిస్తుంటాం. ఇలా ఎంత చేసినా మనకు ప్రయోజనం లేదు. ఎందుకంటే ఈ శాస్త్రాల్లోని జ్ఞానం నిజంగా మనకు ఎక్కాలంటే, వాటియొక్క లక్ష్యార్థాలు మనకు తెలియాలంటే వాటిని గ్రహించే బుద్ధి సూక్ష్మత ఉండాలి. ఆ బుద్ధి సూక్ష్మత శాంతమైన మనస్సుంటేనే సాధ్యం. కాని మనస్సు ఈ లౌకిక ప్రపంచంలో ఇరుక్కుని ఉన్నది. వస్తువుల వ్యామోహంలో ఉన్నది. వాటిని సంపాదించుకొని భోగించే కర్మల రంగంలో ఉన్నది. ఈ కారణంగా మనస్సు ఆందోళనలు, ఉద్రేకాలతో ఉంటుంది. మనస్సు అశాంతితో ఉంటే బుద్ధి సూక్ష్మత ఎక్కడ? కనుక ఎంత జ్ఞానాన్ని తెలుసుకున్నా పదాల అర్థం తెలుస్తుందేగాని అనుభూతి రాదు. అనుభూతి కలగకుండా ఎంత జ్ఞానాన్ని పొందినా అది నీకు ఆనందాన్నివ్వలేదు. స్వస్వరూప జ్ఞానం కలుగదు. సంచిత కర్మఫలాలు అలాగే ఉంటాయి. కనుక మళ్ళీ మళ్ళీ జన్మలు ఎత్తాల్సిందే - మళ్ళీ మళ్ళీ దుఃఖాలు, గర్భనరకాలు తప్పవన్న మాట. అందుకే జ్ఞాన మార్గంలో (కేవల జ్ఞాన మార్గంలో) ఉన్నా కటిక చీకట్లు తప్పవు అనటం.

అయితే తతోభూయఇవతే తమః అంటూ అంతకన్న ఎక్కువైనదా అనిపించే చీకట్లలోకి ప్రవేశిస్తారు అన్నారుగదా! అంటే కర్మ మార్గం కన్న జ్ఞాన మార్గం మరీ ప్రమాదకరం అనేగదా! అవుననే చెప్పాలి.

సత్కర్మలు, నిష్కామ కర్మలు చేస్తుంటే చెడ్డ ఫలితాలు రావు. లేదా అసలు ఏ

ఫలితాలు రావు. అలాగే పాత వాసనలు కొన్ని క్షయమైపోతూ ఉంటాయి. కొత్త వాసనలు చేరకుండా ఉంటాయి. కనుక ఇది కొంతలో కొంత ప్రయోజనం.

కాని కేవలం జ్ఞాన మార్గంలో ప్రయాణించేవాడికి, శాస్త్రాలలోని జ్ఞానాన్ని తెలుసుకుంటూ ఉండే వాడికి మనశ్శుద్ధి జరిగే అవకాశం లేదు. పైగా నేను గొప్ప పండితుణ్ణని, నాకు చాలా శాస్త్రాలు తెలుసని, నాతో సమానంగా వాదించే మొనగాడు లేడని అహంకారం తలెత్తుతుంది. ఇది కొందరిలో వ్యక్తమౌతుంది. కొందరిలో వ్యక్తం కాదు. అంతే తేడా. ఈ అహంకారం అతణ్ణి మరింత అంధకారంలోనికి నెడుతుంది. అతడి చిత్తం శాంతించదు. కనుక ఆనందం కోసం ఇంకా ఇంకా కర్మల రంగంలోనే ఇరుక్కుపోతాడు. కనుకనే మరింత అంధకారం.

అయితే రెండూ వదిలేయాలా? తరువాత మంత్రంలో సమాధానం.

## దశమ మంత్రం

మం. అన్యదేవాహుర్విద్యయా

అన్య దాహు రవిద్యయా।

ఇతి శుశ్రుమ ధీరాణాం

యేనస్త ద్విచ చక్షిరే ॥

ప్రతి పదార్థం:- విద్యయా = కేవలం జ్ఞాన మార్గం వల్ల, అన్యత్ ఏవ = ఒక్కటే (ఫలితం) అని, ఆహుః = చెబుతారు. అవిద్యయా = కేవలం కర్మ మార్గం వల్ల, అన్యత్ = మరొకటి (ఫలితం) అని, ఆహుః = చెబుతారు. ధీరాణాం = బుద్ధిమంతులైన

(ఆత్మజ్ఞాన సంపన్నులు, బ్రహ్మనిష్టులు ఐన) యే = ఎవరు, నః = మాకు, విచచక్షిరే = స్పష్టంగా ఉపదేశించారో, (వారి వల్ల) తత్ = దానిని (ఆ విషయాన్ని), ఇతి = ఈ ప్రకారంగా, శుశ్రుమ = విన్నాము.

భావం:- కేవలం జ్ఞాన మార్గం వల్ల ఒక్కటే ఫలితమని, కేవల కర్మ మార్గం వల్ల వేరొక్కటి ఫలితమని పెద్దలు చెబుతారు. ఈ విషయాన్ని బ్రహ్మనిష్టులైన బుద్ధిమంతులు ఎవరైతే మాకు స్పష్టంగా ఉపదేశించారో వారివల్ల ఈ ప్రకారంగా విన్నాము.

వ్యాఖ్య:- కేవల జ్ఞాన మార్గంలో పయనిస్తే ఆత్మజ్ఞానాన్ని గురించి శాస్త్రాల్లో ఏం చెప్పారో తెలుసుకుంటారు. ఇదొక్కటే ప్రయోజనం. అయితే ఎంత శాస్త్రజ్ఞానాన్ని తెలుసుకున్నా పదాల యొక్క అర్థం తెలుస్తుందే తప్ప అనుభూతి కలగదు. అలా అనుభూతిని కలిగించే బుద్ధి సూక్ష్మత లేదా బుద్ధి కుశలతను ఈ జ్ఞానం కలిగించదు. అలాగాక కేవలం కర్మ మార్గాన్ని ఆచరిస్తేనో! నిష్కామకర్మల వల్ల వాసనాక్షయం జరిగి చిత్త శాంతి కలిగి బుద్ధి సూక్ష్మత కలుగుతుంది. జ్ఞానాన్ని అందుకొనే అర్హత లభిస్తుందేగాని జ్ఞానం మాత్రం కలుగదు. కనుక కేవల కర్మ మార్గం వల్ల బుద్ధి కుశలత అనే ఒక్క ఫలితమే కలుగుతుంది. కాని ఆ బుద్ధి సూక్ష్మత ద్వారా ఆత్మానుభూతిని పొందటానికి కావలసిన జ్ఞానం మాత్రం అందదు.

ఇలా కేవల కర్మ మార్గాన్నో, లేక కేవల జ్ఞాన మార్గాన్నో అనుసరిస్తే ఒక్కొక్క ప్రయోజనమే గాని పూర్తి ప్రయోజనం కలగదు.

కర్మ మార్గం అంటే హైస్కూలు విద్యాభ్యాసం. జ్ఞాన మార్గమంటే ఎమ్.బి.బి.ఎస్ విద్య.. నేను కేవలం హైస్కూలు విద్యను పూర్తి చేసి 98 శాతం మార్కులు పొంది డాక్టరు నవుతాను అంటే కుదరదు. అలాగయితే సరాసరి ఎమ్.బి.బి.ఎస్ లో

కూర్చుంటానండీ అంటే అసలే వీలులేదు. నీకెవరూ సీటివ్వరు. వారివ్వక పోయినా నేనే ఒక సీటు స్వయంగా తెచ్చుకుని కూర్చొని వింటాను అన్నప్పటికీ అక్కడ చెప్పేదేమిటో నీకర్థంకాదు. కనుక నీవు డాక్టరువు కాలేవు.

అంటే హైస్కూలు విద్య ఎమ్.బి.బి.ఎస్ చదవటానికి నీకు అర్హతను కలిగిస్తుందే గాని అదే డాక్టరును చేయదు. అచ్చంగా ఎమ్.బి.బి.ఎస్ చదువుతానంటే వారు మాట్లాడే శబ్దాలు వినిపిస్తాయే గాని అవేమిటో మనకు తెలియదు. కనుక ఒక్కొక్కదాని వల్ల ఒక్కొక్క ప్రయోజనం.

అలాగే కేవల కర్మ మార్గం వల్ల, కేవల జ్ఞాన మార్గం వల్ల ఒక్కొక్క ప్రయోజనమే గాని పూర్తి ప్రయోజనం సిద్ధించదు.

ఎవరు చెబుతున్నారు ఇలాగని?

ఉపనిషత్తులను బోధించే గురువులు చెబుతున్నారు. తమ ఇష్టం వచ్చినట్లు చెప్పేయటమేనా? కానే కాదు. ఇలాగని పెద్దలు చెబుతున్నారని ఎంతో నిగర్వంగా చెబుతున్నారు. ఇవి మా స్వంత అభిప్రాయాలు కాదు. మేమూ విన్న విషయాలే. ఎవరివల్ల విన్నారు? ఎవరైతే ఆత్మజ్ఞాన సంపన్నులై, బుద్ధిమంతులై, బ్రహ్మనిష్ఠులై, కరుణాస్వభావులై ఈ విషయాలను మాకు ఉపదేశించారో వారి వల్ల విన్నాము. వారే ధీరాణాం, ధీరులైనవారు. ఏమిటి వారి ధీరత్వం? వికారాలకు లొంగకుండా ఉండటమే వారి ధీరత్వం.

మనమేమో వికారాలకు లొంగిపోయే సామాన్యులం. మనకిష్టమైన స్వీటు మనకంట బడితే చాలు నోటిలో లాలాజలం ఊరుతుంది. ఏదైనా డబ్బు మూట కనబడితే చాలు వికారం కలుగుతుంది. చెత్త సినిమా చూస్తే కలుగుతుంది వికారం.

కనీసం వాల్‌పోస్టర్ చూచినా చాలు వికారమే. వీటికి మనం లొంగుతాం. మహాత్ములు లొంగరు, వారే ధీరులు.

చుట్టూ వికారం కలిగించే వస్తువులు ఉన్నా, చలించకుండా బుద్ధిని నిశ్చలంగా నిలిపి సర్వత్రా ఆ తత్ పదార్థమైన పరమాత్మ గురించి ఉపదేశించగలవారు. అట్టివారి వల్ల విన్నాం. దీనిని బట్టి బ్రహ్మవిద్య గురు శిష్య పరంపరాగతంగా లభించవలసిన విద్య అని తెలుస్తుంది.

ఇట్టి బ్రహ్మ విద్యను బోధిస్తున్న గురువు, కేవల కర్మ మార్గం గాని, కేవల జ్ఞాన మార్గం గాని పూర్తి ప్రయోజనాన్ని కలిగించదని హెచ్చరించి పూర్తి ప్రయోజనం కలగటానికి ఏం చెయ్యాలో తరువాత మంత్రంలో తెలియజేయబోతున్నారు.

## ఏకాదశ మంత్రం

మం. విద్యాంచా విద్యాంచ
యస్త ద్వేదో భయగ్ం సహ ।
అ విద్య యా మృత్యుం తీర్త్వా
విద్య యా మృత మశ్నుతే ॥

ప్రతిపదార్థం:- యః = ఎవరైతే, విద్యాంచ = జ్ఞాన మార్గాన్ని, అ విద్యాంచ = కర్మ మార్గాన్ని, ఉభయం సహ = రెండింటిని కలిపి, తత్ = ఆ పరమాత్మను, వేద = తెలుసుకుంటాడో, (అతడు) అవిద్యయా = కర్మ మార్గం ద్వారా, మృత్యుం = మార్పులతో కూడిన ఈ ప్రపంచాన్ని, తీర్త్వా = దాటి, విద్యయా = జ్ఞాన మార్గం ద్వారా, అమృతం = మార్పులు లేనట్టి ఆ పరమాత్మను, అశ్నుతే = పొందగలడు.

భావం:- ఎవరైతే జ్ఞాన మార్గాన్ని, కర్మ మార్గాన్ని రెండింటిని అనుసంధానం చేసి ఆ పరమాత్మను తెలుసుకుంటాడో అట్టి సాధకుడు కర్మ మార్గం ద్వారా మార్పులతో కూడిన ఈ ప్రపంచాన్ని (ప్రాపంచిక వ్యామోహాలను) దాటి, జ్ఞాన మార్గం ద్వారా మార్పులేమీ లేనట్టి ఆ అవ్యయ పరమాత్మను పొందగలుగుతాడు.

వ్యాఖ్య:- కర్మ మార్గం ఒక ప్రయోజనాన్ని, జ్ఞాన మార్గం మరొక ప్రయోజనాన్ని కలిగిస్తాయని క్రిందటి మంత్రంలో చెప్పారు. మరేం చెయ్యాలి? రెంటిని కలిపి అనుసంధానం చేసి ఆచరించాలి.

అమెరికా వెళ్లాలంటే విమానాశ్రయంలో విమానం ఎక్కి వెళ్ళాలి. ఆ విమానాశ్రయం చేరుకోవాలంటే కారులో వెళ్ళాలి. నాకు కారున్నది గదా సరాసరి అమెరికా వెళ్తాను అంటే కుదరదు. పోనీ కారు పనికి రావటం లేదు, గనుక ఆ విమానాన్నే ఎక్కి పోవచ్చుగదా! అహ! వీల్లేదు. ఆ విమానం నీ ఇంటి దగ్గర కొచ్చి నిన్ను ఎక్కించుకోదు. నీవే కారు మీద దాని దగ్గరకు వెళ్లాలి. కనుక కారు గాని విమానం గాని ఏదో ఒక్కటి మాత్రం నిన్ను అమెరికా చేర్చదు. రెండింటిని ఉపయోగించు కోవాల్సిందే.

అలాగే ఇక్కడ అమెరికా అనేది మనం చేరుకోవలసిన గమ్యస్థానం. అదే పరమాత్మ. మరి అక్కడకు చేరే విమానమే జ్ఞాన మార్గం. కారే కర్మ మార్గం. కనుక కర్మ మార్గాన్నీ, జ్ఞాన మార్గాన్నీ రెండింటిని ఉపయోగించుకోవాలి. అప్పుడే చేరవలసిన చోటుకు చేరేది.

ఇక్కడ సాధకునికి అలాంటి వివేకం కావాలి. పరమాత్మను అందుకోవాలంటే - పరమాత్మానుభూతి పొందాలంటే ముందుగా పరమాత్మకు సంబంధించిన జ్ఞానం

కావాలి. ఆ జ్ఞానాన్ని పొందితేనే ఆ జ్ఞానాగ్నిలో సర్వకర్మలు - అంటే ఆగామి - సంచిత - ప్రారబ్ధకర్మలు దగ్ధమై పోయేది. జీవుడు ఆ పరమాత్మతో ఏకమయ్యేది. అదే జీవబ్రహ్మైక్య భావన. ఇట్టి స్థితిని పొందటానికే జ్ఞాన మార్గం.

అయితే అట్టి జ్ఞానం మనకు కలగాలన్నా, ఆ జ్ఞానం జ్ఞానాగ్నిగా సమస్త కర్మలను దగ్ధం చేయాలన్నా, ఆ జ్ఞానం మన హృదయంలో బాగా నాటుకోవాలి. అలా నాటుకోవాలంటే చిత్తం శుద్ధంగాను, నిర్మలంగాను, ప్రశాంతంగాను ఉంచుకోవాలి. అలా తయారుచెయ్యాలి.

అందరి మనస్సు అలా ఉంటున్నదా? ఉండదు. కారణం? కల్మషాలు, వాసనలు. ఇవెలా వచ్చినవి? పూర్వజన్మల నుండి మన సంకల్పాలవల్ల, మనం చేసిన కర్మల వల్ల ఆర్జించుకున్నాం.

అసలు ఏమిటీ వాసనలు. ఒక కాగితంలో పొట్లంకట్టి గారెలు ఇచ్చాడు షాపువాడు. వాటిని మనం తిన్నాం. కాగితాన్ని అవతల పారేస్తాం. ఆ కాగితానికి కూడా వాసన అంటుకుంటుంది. చిన్న పిల్లలు ఆ వాసన చూసి అలాంటి గారెలు తింటే బాగుండుననుకుంటారు.

మనం చేసిన కర్మలకు ఫలాలు అనుభవిస్తాం. అనేక ఆలోచనలు చేస్తుంటాం. ఆ సమయంలో మన మనస్సు మీద కొన్ని ముద్రలు పడతాయి. అవే వాసనలు. ఆ వాసనలే మనను కర్మలకు ప్రోత్సహిస్తూ ఉంటాయి. ఇవే మనస్సును శాంతంగా నిలువనివ్వకుండా పరిగెత్తిస్తుంటాయి. అందుకే వీటిని వదిలించుకోవాలి. వదిలించుకోవాలంటే కర్మలు చేయాలి. అయితే పాతవి వదిలిపోతాయిగాని మళ్ళీ కొత్తవి చేరుకుంటాయి కర్మలు చేస్తూంటే. అందువల్ల కొత్తవి చేరకుండా, పాతవి

ఖర్చుకావాలంటే నిష్కామంగా, ఫలాపేక్షలేకుండా కర్మలు చేయాలి. భగవదార్పణ బుద్ధితో చేయాలి. ఇదే కర్మ మార్గం - కర్మ యోగం. ఇలా కర్మల ద్వారా మనశ్శుద్ధి - మనశుద్ధి వల్ల బుద్ధి సూక్ష్మత - బుద్ధి సూక్ష్మత వల్ల జ్ఞానం బాగా నాటుకోవటం - ఆ జ్ఞానం జ్ఞానాగ్నిగా మారి సమస్త కర్మ బంధనాలను దగ్ధం చేయటం కుదురుతుంది. దీనివల్లనే స్వస్వరూప జ్ఞానం లేదా మోక్షం కలుగుతుంది.

ఈ స్థితినే అమృతం అన్నారు. మృతం లేనిది, మార్పులు లేనిది. అదే పరమాత్మ స్థితి. శాశ్వతానంద స్థితి. అట్టి స్థితిని అందుకోవటమే మానవ జన్మ ద్వారా చేయవలసినది.

అయితే మనం మార్పులతో కూడిన ఈ ప్రపంచాన్ని చూసి, మారిపోతూ ఉండే వస్తువులను, విషయాలను చూచి, వాటి ఆకర్షణలకు లొంగి పరమాత్మను మరచిపోతున్నాం. ఆటబొమ్మల ఆకర్షణకు లొంగి తల్లిని మరచిన బిడ్డల్లాగ ప్రవర్తిస్తున్నాం. మార్పులతో కూడిన ఈ ప్రపంచమే - మారిపోతూ ఉండే విషయవస్తువులే మృత్యువు. ఈ ప్రాపంచిక ఆకర్షణల నుండి తప్పించుకోవటమే మృత్యుం తీర్త్వా - మృత్యువును దాటటం అంటే. ఆ మృత్యువును దాటటానికే కర్మయోగం.  కనుక అవిద్య చేత ఈ మృత్యువును దాటాలి. ఆ తర్వాత విద్యచేత - జ్ఞానమార్గం చేత - ఆత్మజ్ఞానాన్ని పొందటం ద్వారా అమృతాన్ని - మార్పులు లేని తత్వాన్ని అందుకోవాలి. కనుక విద్య - అవిద్యలు రెండింటిని అనుసంధానం చేయాలి.

ఇంతవరకు కర్మ మార్గం - జ్ఞాన మార్గం రెండూ భగవంతుని అందుకోవటానికి ఉపాయలని తెలుసుకున్నాం. ఈ రెండింటిని కలిపి ఆచరిస్తేనే ప్రయోజనం అని కూడా గ్రహించాలి.

మరి ఈ రెండు మార్గాలను సమన్వయం చేసి ఆచరించినంత మాత్రాన లక్ష్యాన్ని చేరుకోగలమా? ఇంకా ఏవైనా మార్గాలను కూడా సమన్వయం చేయాలా? మరొకటి కూడా ఉన్నది. అదే భక్తి మార్గం.

కర్మ మార్గం శరీరం ద్వారా చేసేది. అది మనలోని తమోగుణాన్ని తొలగిస్తుంది.

అయితే మనలోని రజోగుణం మనలో ఆందోళనను కలిగిస్తూ మనసు ఒకచోట నిలువ నివ్వదు. దానిని కూడా తొలగించుకోవాలి. అప్పుడే మనలో సత్వ గుణం అభివృద్ధి చెందేది. ఆ సత్వగుణంలోనే జ్ఞానాన్ని పొందగలుగుతాం, పొందిన జ్ఞానాన్ని ఉపయోగించుకుని ధ్యాన మార్గంలో ఆత్మానుభూతిని పొందగలుగుతాం. కనుక రజోగుణాన్ని వదిలించుకోవాలి. దానికి భక్తి యోగమే మార్గం.

భక్తి అంటే పరమాత్మపై నిశ్చలమైన ప్రేమ. ఆయనను విడిచి ఒక్క క్షణం కూడా ఉండలేని స్థితి. ఆయన కోసం ఏమైనా త్యాగం చేసే స్థితి. సమస్త కర్మల పట్ల వైముఖ్యం కలిగే స్థితి. అలా పరమాత్మ పట్ల భక్తి కలిగినపుడు కర్మల పట్ల ఆసక్తి తగ్గిపోయి రజోగుణం తొలగిపోతుంది.

ఐతే ఇట్టి భక్తి కలగాలంటే అసలు పరమాత్మ తత్వం ఏదో తెలియాలి. ఆయనను గూర్చి తెలియజెప్పేవి ఉపనిషత్తులే. ఆయన నిరాకారుడు, నిర్గుణుడు, సర్వవ్యాపి, అజుడు, అవ్యయుడు, అకర్త, అభోక్త అని వర్ణిస్తున్నాయి ఉపనిషత్తులు. అట్టి పరమాత్మయందు భక్తి కలిగి ఉపాసించుటనే నిరాకార నిర్గుణోపాసన అంటారు. ఇదే ధ్యాన యోగం.

కర్మరంగంలో ఉన్న సామాన్యులు పరమాత్మను ఇలా ఉపాసించలేరు. వారు చూడటానికి ఒక రూపం కావాలి. వినటానికి కొన్ని గుణాలు కావాలి. పిలవటానికి

పేరు కావాలి. ఇలా నామ రూప గుణాలను నిరంతరం మననం చేస్తూ భక్తిని కలిగియుండుటే సాకార సగుణోపాసన. ఇదే భక్తి యోగం.

ఈ భక్తియోగాన్ని, ధ్యాన యోగాన్ని ఏదో ఒకటి ఆచరిస్తే సరిపోతుందా? వాటివల్ల మనం కోరుకున్న ప్రయోజనాన్ని పొందగలమా? లేక ఆ రెండింటిని కూడా సమన్వయం చేసి ఆచరించాలా? రాబోయే 3 మంత్రాలలో వివరించబోతున్నారు.

## ద్వాదశ మంత్రం

మం॥ అంధం తమః ప్రవిశంతి
యే సంభూతి ముపాసతే ।
తతో భూయ ఇవతే తమః
య ఉ సంభూత్యాగ్ం రతాః॥

ప్రతిపదార్థం :- యే = ఎవరైతే, అసంభూతిం = సాకార సగుణరూపాన్ని, ఉపాసతే = పూజిస్తారో - ఉపాసన చేస్తారో, (వారు) అంధం తమః = కటిక చీకట్లలోకి, ప్రవిశంతి = ప్రవేశిస్తారు, య ఉ = ఎవరైతే నిజంగా, సంభూత్యాం = నిరాకార నిర్గుణరూప పరమాత్మయందు, రతాః = రమిస్తూ ఉంటారో - ధ్యానిస్తూ ఉంటారో, తే= అట్టివారు, తతః = అంతకంటే, భూయ = ఎక్కువైనదా, ఇవ = అనిపించే, తమః = చీకట్లోనికి, (ప్రవేశిస్తారు).

భావం :- ఎవరైతే సాకార సగుణరూపాన్ని ఉపాసన చేస్తారో వారు కటిక చీకట్లలోకి ప్రవేశిస్తారు. ఎవరైతే నిజంగా నిరాకార నిర్గుణరూప పరమాత్మను ధ్యానిస్తూ ఉంటారో

వారు అంతకన్న ఎక్కువైనదా అనిపించే చీకట్లలోనికి ప్రవేశిస్తారు.

వ్యాఖ్య :- భూతి అంటే సంపద. సంభూతి అంటే మంచి సంపద. నశించని సంపద. అదే పరమాత్మ. పరమాత్మతో ఏకత్వానుభూతి చెందటమే 'సంభూతి'. ఇది ధ్యానయోగం ద్వారానే సాధ్యం. దీనినే నిరాకార నిర్గుణోపాసన అన్నారు.

అసంభూతి = ప్రకృతి ఉపాసన = దేవతోపాసన = సగుణోపాసన

అసంభూతి అంటే నిరాకార, నిర్గుణ పరమాత్మకు వేరుగా - నామ, రూప, గుణాలతో వ్యక్తమవుతున్న ఈ ప్రపంచం లేదా ప్రకృతి. ఇది ఆ పరమాత్మకు ప్రతిరూపం. ఈ ప్రకృతి పట్ల, విగ్రహాలపట్ల, భగవంతుని గుణాలపట్ల ఆసక్తిని కలిగి ఉండటం - ఉపాసించటం భక్తియోగం. ఇదే సాకార సగుణోపాసన.

ఎవరైతే సాకార సగుణరూప ప్రకృతిని ఉపాసిస్తారో వారు కటిక చీకట్లలోనికి ప్రవేశిస్తారు అని ఉపనిషత్ గురువు హెచ్చరిక చేస్తున్నారు. అంటే ఎవరైతే కేవలం రూపాలమీద ఆకర్షణతోను, గుణగణాల పట్ల ఆకర్షణతోను, మనకు కలిగే ప్రయోజనాలపైగల ఆసక్తితోను ఎవరైతే వివిధరూపాలతో, నామాలతో ఉండే దేవతలను కొలుస్తూ ఉంటారో, పూజిస్తూ ఉంటారో, పూజలు, వ్రతాలు, యజ్ఞ యాగాదులు చేస్తూ ఉంటారో - అట్టివారు అంధకారంలో ప్రవేశిస్తారు. ఇదేమిటి ? మంచి పనులు చేస్తుంటే - దేవతలను పూజిస్తుంటే అంధకారంలో పడిపోవటమేమిటి ?

కేవలం భక్తి మార్గంలో ఉన్నవాడు - అంటే అందరూ చేస్తున్నారు గనుక తానూచేసేవాడు, ఈ సాకార సగుణరూపాలను పూజిస్తూ ఉంటాడేగాని అసలు తాను ఎందుకు భగవంతుని పూజిస్తున్నాడో సరియైన జ్ఞానంగాని అవగాహనగాని ఉండదు.

భగవంతుడంటే కోరిన కోర్కెలు తీర్చేవాడని, తాను గనుక భక్తితో ఆయనను

కొలిస్తే, పూజిస్తే, వ్రతాలుచేస్తే ఆయన కరుణించి తన కోర్కెలు తీరుస్తాడని, తనకు వచ్చిన కష్టాలు తీరుస్తాడని, అందరికన్న ఉన్నతంగా తాను జీవించవచ్చునని భావిస్తాడు. అందుకోసం కొంతకాలాన్ని, కొంతడబ్బును పెట్టుబడిగా పెడతాడు. తన పెట్టుబడికి తగిన ప్రతిఫలం రాబట్టుకోగలనని భావిస్తాడు. తనకోర్కెలు తీరితే తాను కొలిచే రాముడో, కృష్ణుడో, ఆంజనేయుడో, వేంకటేశ్వరుడో, లక్ష్మీదేవియో, విఘ్నేశ్వరుడో.. ఎవరో వారే నిజమైన దేవుడని, ఆయనను మించినవాడు మరొకడు లేడని మూఢభక్తిని పెంచుకుంటాడు. దానితో ఒక విధమైన ఉన్మాదం కలుగుతుంది. మిగిలిన రూపాలపై చిన్నచూపు కలుగుతుంది. ఆరూపాలనారాధించేవారిని పిచ్చివాళ్ళుగానో, మూర్ఖులుగానో తలచి చిన్నచూపు చూస్తాడు. తాను చాల గొప్పవాడై నట్లు ఫోజు పెడతాడు. అహంకరిస్తాడు. ‘‘నేను సాయిబాబా భజనలు పెట్టించిన తర్వాతనేనండీ నాకు బాగా కలిసొచ్చింది’’, ‘‘నేను అయ్యప్పస్వామి దగ్గరకు వెళ్ళివచ్చిన దగ్గరనుండీ నాదశ తిరిగిందండీ’’, ‘‘అసలు వెంకటేశ్వరుని నమ్ముకుంటే చాలండీ మొన్న చచ్చినవాడుకూడా బ్రతికాడు’’. ఇలాంటి భావాలు వ్యక్తం చేసే భక్తులెందరో! మరికొంత కాలానికి వారికి ఉన్నది కాస్తా ఊడిపోతే, దొంగలు పడి అంతా ఎత్తుకు పోతే, దశతిరిగి తినటానికి తిండికి నోచుకోకపోతే, బాగా ఆరోగ్యంగా ఉండి హఠాత్తుగా జబ్బు పడితే, అసలు శాల్తీ గల్లంతైతే అప్పుడు దేవుడికి కోపం వచ్చిందా ? దేవుడి శక్తి తగ్గిందా ? లేక ఆయన మన మొర ఆలకించే వీలులేకుండా చెవుడు వచ్చిందా ? మొత్తంమీద ఆయనకేదో అయిందని మరొకరివైపు తిరుగుతారు. ఆయనకిప్పుడు శక్తి పోయిందండి అని తీర్మానిస్తారు. చివరి కొకనాటికి ఆ! అసలు దేవుడు లేడూ గీవుడూ లేడండీ ! అంతా మన కర్మకొద్దీ జరగటమేనంటాడు. నాస్తికుడుగా మాట్లాడుతాడు.

ఇలాగ దేవుడంటే కోర్కెలు తీర్చే యంత్రమని, మనం లంచం బాగా ఇచ్చిన కొద్దీ ఆయన మనకు పనులు బాగా చేసి పెడతాడని చేసే ఉపాసనలు, పూజలు వ్యర్థమైపోతాయేగాని వాటి వల్ల నీకేమీ ప్రయోజనం కలగదు. ముక్తి అసలే లేదు. నీ దృష్టి అంతా ప్రాపంచిక వ్యామోహాల మీద ఉన్నప్పుడు అసలు ముక్తి అనేది అసాధ్యం. మళ్ళీ మళ్ళీ జన్మలు కర్మలు. రజోగుణం ఏ మాత్రం తగ్గదు.

పోనీ ఇవన్నీ తెలుసుకొని ఎటువంటి కోర్కెలు లేకుండా భగవంతుని రూపాలను కొలిస్తేనో దాని వల్ల రజోగుణం తగ్గిపోతుంది. మనస్సు శుద్ధమౌతుంది. చిత్త ఏకాగ్రత కలుగుతుంది. కాని అసలు పరమాత్మతత్వం తెలియదు. ఆత్మానుభూతి కలగదు. ఆత్మానుభూతి కలగక పోతే పూర్వార్జిత మైన సంచిత కర్మలు అలాగే ఉంటాయి. కనుక మళ్ళీ మళ్ళీ జన్మలు - దుఃఖాలు తప్పవు. కనుక కేవల సాకార సగుణోపాసన వల్ల సంసార బంధం తొలగిపోదు. జన్మరాహిత్యం కలగదు. అందుకే అంధకారంలోకి పోతావు అంటున్నాడు ఉపనిషత్ గురువు.

సరే నిరాకార నిర్గుణ పరమాత్మను ఉపాసిస్తేనో అంతకన్న ఎక్కువైన అంధ కారంలోకి పోతావు అంటున్నాడు.

ఏ సాధనలూ చేయకుండా, చిత్తాన్ని ఏకాగ్రపరచకుండా, ప్రాపంచిక వ్యామోహాలను వదలకుండా, "పరమాత్మతో ఐక్యం చెందటం ధ్యాన మార్గం వల్లనే సాధ్యమని" తెలుసుకొని కేవలం ధ్యాన యోగాన్ని ఎంతకాలం ఆచరించినా అతడి మనస్సు ప్రపంచం వైపుకే పరుగులు తీస్తుందిగాని పరమాత్మపై నిలవదు. కారణం -అతడు నిష్కామ కర్మయోగ సాధన చేయలేదు గనుక, సాకార సగుణోపాసన చేసి ఏకాగ్రత సాధించలేదు గనుక. ఇట్టి స్థితిలో మనస్సు ఆత్మలో అంతమయ్యే స్థితి - జీవ బ్రహ్మైక్యసిద్ధి ఎలా కలుగుతుంది ? కలగదు. ఎంతకాలం ధ్యానం చేసినా ఏ

అనుభవమూ కలగక ఈ వేదాంత మంతా చెత్త అని తీసి పారేస్తాడు. అనవసరంగా ఈ ధ్యానంతో కాలం వృధా చేసుకోవటమెందు కనుకుంటాడు. ఎలాగూ ప్రాపంచిక వ్యామోహాల వాసనలు లోపల గగ్గోలు పెడుతున్నాయి గనుక పూర్తిగా పతన దశలో పడిపోతాడు. ఇదే కటిక చీకట్లలోకి ప్రవేశించట మంటే.

ఇట్టి కేవల ధ్యానయోగసాధనవల్ల అంతకన్న ఎక్కువైన చీకట్లలోకి ప్రవేశిస్తారని హెచ్చరిస్తున్నారు ఉపనిషద్గురువు. సగుణోపాసన చక్కగాచేస్తే - పరమాత్మను అందుకోలేకపోయినా, చేసేది సత్కర్మ గనుక చిత్తశుద్ధి, మనోఏకాగ్రత కలుగుతాయి. కాని భక్తిలేని ఈ ధ్యాన సాధనవల్ల మనస్సు అందోళనలు, ఉద్రేకాలతో బాహ్యప్రపంచం లోకే పోతుంది. చివరకు ఈ సాధనలపై నమ్మకం చెడి ఇంకా ఇంకా పతనమై పోతాడు.

అయితే రెండూ వదిలేయాలా ? తరువాత మంత్రంలో -

## త్రయోదశ మంత్రం

మం॥ అన్యదేవాహుః సంభవాత్

అన్యదాహుర సంభవాత్ ।

ఇతిశుశ్రుమ ధీరాణాం

యేనస్త ద్విచచక్షిరే ॥

ప్రతిపదార్థం :- సంభవాత్ = ధ్యానయోగం వల్ల, అస్యత్ ఏవ = ఒక్కటే (ఫలితం) అని, ఆహుః = చెబుతారు, అసంభవాత్ = భక్తియోగం వల్ల, అన్యత్ ఆహుః = మరొక ప్రయోజనం అని చెబుతారు, యే = ఎవరైతే, ధీరాణాం =

బుద్ధిమంతులు, నః = మాకు, విచచక్షిరే = బోధించారో, (వారివల్ల) తత్=దానిని, ఇతి = ఈ విధంగా, శుశ్రుమ = విన్నాము.

భావం :- కేవల ధ్యాన యోగం ద్వారా ఒక్కటే ఫలితమని, కేవలభక్తి యోగం ద్వారా వేరొక్కటి ఫలితమని పెద్దలు చెబుతారు. ఈ విషయాన్ని ఎవరైతే బుద్ధిమంతులు, బ్రహ్మనిష్టులు అయిన పెద్దలు మాకు ఉపదేశించారో వారివల్ల ఈ ప్రకారంగా విన్నాము.

వ్యాఖ్య :- కేవల ధ్యాన యోగం వల్ల భగవధ్యానం ఎలా చేయాలో తెలుసు కుంటారు, నిరాకార పరమాత్మ తత్వం గురించి శాస్త్రాలలో ఏం చెప్పారో తెలుసు కుంటారు, ధ్యానానికి అనుకూల పరిస్థితులేవో తెలుసుకుంటారు. ప్రపంచ వ్యామోహాలలో చిక్కి పరుగులు తీసే మనస్సును స్వాధీనం చేసుకోవాలని, ఏకాగ్రం చేయాలని, చివరకు ఆ మనస్సు ఆత్మధ్యానంలో నిర్విషయం కావాలని తెలుసుకుంటారు. అంతవరకే ప్రయోజనం. అయితే ఎంత తెలుసుకున్నా మనస్సును ఏకాగ్రం చేయడంగాని, నిర్విషయం చేయడం గాని కుదరదు. మనస్సులో ఉన్న రజోగుణం కారణంగా అది ఒకచోట నిలవదు. కనుక తెలుసుకోవటమేగాని అనుభూతి కలగదు. పూర్తి ప్రయోజనం కలగదు.

అలాగాక కేవలం భక్తి మార్గాన్ని - అంటే సాకార సగుణోపాసనను అనుష్టిస్తేనో - మనస్సనేది ఒక ప్రేమ భాండారం. అది ప్రపంచంలోని రకరకాల విషయ వస్తువుల వెంట పరుగులిడుతూ తిరుగుతుంది. దానియొక్క పరుగులను అరికట్టి ఏకాగ్రం చేస్తే దానికొక గొప్ప శక్తి వస్తుంది. అలా ఏకాగ్రం చేయటానికే ఉన్నతమైన పరమాత్మయొక్క రూపం - గుణాలు. ఉన్నతమైన పరమాత్మయొక్క రూపం మీద మనస్సు నిలిచిపోయి ఏకాగ్రమౌతుంది. పరుగులు ఆగిపోతాయి. మనస్సు శుద్ధము, నిర్మలము అవుతుంది. ఇంతవరకే దీని ప్రయోజనం. మనస్సు నిర్విషయం కాదు. జీవబ్రహ్మైక్య సిద్ధి లభించదు.

ఎవరు చెబుతున్నారు ఇలాగ ? గురువులు. వారికెలా తెలుసు ? వారు కూడా ఇలాగ విన్నారు. ఎవరి దగ్గర ? బ్రహ్మనిష్ఠులు, ఆత్మజ్ఞాన సంపన్నులు ఐన ధీరుల వద్ద. కనుక ఈ బ్రహ్మ విద్య గురు శిష్య పరంపరాగతంగా లభించింది మాత్రమే.

ఇలా బోధించిన గురువు కేవల నిరాకార నిర్గుణోపాసనతో కూడిన ధ్యాన యోగాన్ని గాని, సాకార సగుణోపాసనతో కూడిన భక్తి యోగాన్ని గాని, ఏదో ఒకదాన్ని అనుష్ఠిస్తే ఏదో ఒక్క ప్రయోజనమే సిద్ధిస్తుంది గాని పూర్తి ప్రయోజనం సిద్ధించదని హెచ్చరించి, మరి పూర్తి ప్రయోజనం కలగాలంటే, పరమాత్మ సాక్షాత్కారం లేదా మోక్షం కలగాలంటే ఉపాయం ఏమిటో తరువాత మంత్రంలో తెలియజేస్తున్నాడు.

## చతుర్దశ మంత్రం

మం ॥ సంభూతించ వినాశంచ

యస్తద్వేదో భయగ్ం సహ ।

వినాశేన మృత్యుం తీర్త్వా

సంభూత్యా మృత మశ్నుతే ॥

ప్రతిపదార్థం :- యః = ఎవరైతే, సంభూతించ = నిరాకార నిర్గుణో పాసననూ, వినాశంచ = సాకార సగుణో పాసననూ, తత్ = ఆ, ఉభయం సహ = రెండింటిని కలిపి, వేదః = తెలుసుకుంటారో, సః = అతడు, వినాశేన = సాకార సగుణోపాసన ద్వారా , మృత్యుం తీర్త్వా = మార్పులతో కూడిన ఈ ప్రపంచాన్ని దాటి, సంభూత్యా = నిరాకార నిర్గుణోపాసనద్వారా, అమృతం = మార్పులు లేని ఆ పరమాత్మను, అశ్నుతే= పొందగలడు.

భావం :- ఎవరైతే నిరాకార నిర్గుణో పాసనను, సాకార సగుణోపాసనను ఆ రెండింటిని కలిపి సమన్వయం చేసి తెలుసుకుంటాడో, అతడు సాకార సగుణోపాసన ద్వారా మార్పులతో కూడిన ప్రపంచాన్ని దాటి, నిరాకార నిర్గుణో పాసన ద్వారా మార్పులు లేని పరమాత్మను పొందగలుగుతాడు.

వ్యాఖ్య :- సాకార సగుణోపాసన , నిరాకార నిర్గుణో పాసన అనే రెండింటిలో ఒక్కొక్క దాని వల్ల ఒక్కొక్కటే ప్రయోజనం అని తెలుసుకున్నాం. మరి పూర్తి ప్రయోజనం కలగాలంటే రెండింటిని కలిపి సమన్వయం చేసి ఆచరించాలి. ఆ విషయాన్నే ఈ మంత్రంలో తెలియజేస్తున్నారు.

నిరాకార నిర్గుణో పాసనయే ధ్యాన యోగం. పరమాత్మ తత్వాన్ని గురించి నిరంతరం ధ్యానించాలి. అలా ధ్యానించాలంటే పరమాత్మ తత్వం తెలియాలి. అది జ్ఞాన యోగం ద్వారా తెలుస్తుంది. ఉపనిషత్తుల అధ్యయనం ద్వారా తెలుస్తుంది. అలా తెలుసుకున్న తర్వాత నిశ్చలమైన మనస్సుతో ఏకాగ్రమైన మనస్సుతో తైలధారలాగా ఆత్మ తత్వాన్ని ధ్యానించాలి. అలా ధ్యానించి ధ్యానించి మనస్సు కాస్తా నిర్విషయమై, శూన్యమై, అంతమైపోతుంది. మనస్సు అంతమైతే మిగిలేది పరమాత్మయే. అదే ఆత్మ సాక్షాత్కారం ఐతే ఇది ఎప్పుడు సాధ్యమవుతుంది ? మనస్సు ఏకాగ్రమైతేనే.

మనస్సు అలా ఏకాగ్రం కావాలంటే దీర్ఘకాలం ఏదోఒక లక్ష్యం మీద నిలపటానికి సాధన చేయాలి. ఎందుకంటే మనస్సు కోతిలాంటిది. చంచలమైనది. కోతి ఆ కొమ్మ నుండి ఈ కొమ్మకు, ఈ కొమ్మ నుండి ఆ కొమ్మకు దూకినట్లుగ మనస్సు కూడా ఒక విషయం పైనుండి మరో విషయానికి, ఒక కోరిక నుండి మరొక కోరికపైకి దూకుతుంది. కనుక ప్రాపంచిక విషయాలలోను, వ్యామోహాలలోను చిక్కుకుని సంచరిస్తుండే

మనస్సును ఆ విషయాల నుండి వెనక్కు తీసుకురావాలి.

ఎలా తెస్తాం ? ఈ ప్రాపంచిక విషయాలన్నీ అనిత్యమైనవని, అనిత్యమైన విషయాలు అనిత్యమైన సుఖాన్నే ఇస్తాయని, నిత్య వస్తువైన ఆత్మ ఒక్కటే నిత్యమైన సుఖాన్నిస్తుందని వివేకంతో తెలుసుకొని, అనిత్యమైన ప్రాపంచిక విషయాల పట్ల వైముఖ్యం కలిగి ఉండాలి. వైరాగ్య భావన కలిగి ఉండాలి. ఇదే మనస్సు నిర్మలం, నిష్కల్మషం, వాసనారహితం కావటం అంటే.

ఇలా నిర్మలమైన మనస్సును ఏదో ఒక లక్ష్యంపై నిలపాలి. ఒకరూపం - కొన్ని గుణాలు గల ఇష్ట దేవతపై నిలపాలి. ఆ గుణాలను చింతిస్తూ, ఆ రూపాన్ని కన్నులతో దర్శిస్తూ తన్మయం చెందాలి. అయితే మనస్సు దాని సహజ గుణం కారణంగా మళ్ళీ మళ్ళీ చలిస్తూనే ఉంటుంది. ప్రపంచంలోకి పరుగులు తీస్తూనే ఉంటుంది. అయినప్పటికీ అభ్యాసం - వైరాగ్యం అనే రెండు ఉపాయాలతోను మళ్ళీ మళ్ళీ దానిని స్వాధీనం లోనికి తెచ్చుకోవాలి, ఆ పరమాత్మ రూపంపై నిలపాలి. ఇలా చెయ్యటాన్నే సాకార సగుణోపాసన అంటారు.

కనుక రెండు ఉపాసనలు కలిపిచేస్తేనే పూర్తి ప్రయోజనం. సాకార సగుణో పాసన వల్ల ప్రాపంచిక వ్యామోహాలు తొలగిపోయి, భగవంతుని రూపం మీద మనస్సు నిలుస్తుంది. నిరంతరం ఆ భగవంతుని అద్భుత రూపాన్ని చూస్తూ ఆయన గుణాలను ప్రేమతో, భక్తితో, తన్మయత్వంతో తలచుకుంటూ, ఏది మాట్లాడినా, ఆభగవంతుని గురించే మాట్లాడుతూ, ఏమి వింటున్నా ఆ భగవంతుని గురించే వింటూ, ఏమి చూస్తున్నా ఆ భగవంతుని మహిమగానే చూస్తూ, ఏమి జరిగినా ఆ భగవంతుని ఇచ్ఛ ప్రకారమే జరిగినదని భావిస్తూ, ఏమి తింటున్నా ఆ భగవంతుని ప్రసాదమే ఇది

అని భావిస్తూ, ఒకటే రందితో, రెండవ ఆలోచన ఏదీ లేకుండా, నిరంతరం ఆ భగవంతునితో తన్మయం చెందటమే సాకార సగుణోపాసన. ఇట్టి భక్తి వల్ల మనస్సు ఎటూపోకుండా ఏకాగ్రమవుతుంది. దానివల్ల రజోగుణం పూర్తిగా తగ్గి సత్వగుణం పెరిగి ఆ భగవంతునే ఆశ్రయిస్తాం. ఇదే మార్పులతో కూడిన ప్రపంచాన్ని దాటటం అంటే. ఇక ఈ ప్రాపంచిక విషయాలన్నీ భక్తియోగంతో వదిలేయటం జరుగుతుంది. భగవంతుని మీద మనస్సు ఏకాగ్రమవుతుంది.

అలా ఏకాగ్రమైన మనస్సుతో ఇప్పుడు నిరాకారుడు, నిర్గుణుడు, సర్వవ్యాపి అయిన పరమాత్మను తైలధారలాగ ధ్యానించటం కుదురుతుంది. అలా ధ్యానించగా ధ్యానించగా మనస్సు కాస్తా నిర్విషయమై అంతమై పోతుంది. అదే ఆత్మానుభూతి. ఆత్మ సాక్షాత్కారం. ఇదే అమృతత్వస్థితి.

ఇలా కర్మ, భక్తి, జ్ఞాన, ధ్యాన యోగములన్నింటిని సమన్వయం చేయటం ద్వారానే బ్రహ్మసాక్షాత్కారాన్ని పొందటం జరుగుతుంది అని 9 నుండి 14 వరకుగల 6 మంత్రాలు నిర్దేశిస్తున్నాయి.

సంభూతి అంటే పరమాత్మ సంపదతో ఐక్యం కావటం.

వినాశం అంటే ప్రాపంచిక విషయాలను త్యజించటం లేదా అహంకారాన్ని నాశనం చెయ్యటం. ఈ రెండు పదాలు వాడారు ఈ మంత్రంలో. ఈ సాధనలతో బ్రహ్మ సాక్షాత్కారానికి అర్హత కలిగింది. మరి ఆ బ్రహ్మ సాక్షాత్కారం ఎలా అనుభవంలోకి వస్తుంది ? ఇంకా ఏమైనా ఆటంకం ఉన్నదా ? ఉంటే దానిని తొలగించుకోవటం ఎలా ? అనే విషయం రాబోయే మంత్రంలో వివరిస్తున్నారు.

## 9-10-11-12-13-14 మంత్రముల సారాంశము

మానవ జన్మ వచ్చింది ముక్తినందుకోవటానికే - ఎన్ని జన్మలు ఇలా ఎత్తినప్పటికీ, ఎన్ని భోగాలు అనుభవించినప్పటికీ మళ్ళీ మళ్ళీ జన్మలు తప్పవు. జన్మలుంటే దుఃఖాలు తప్పవు. ఈ దుఃఖాలన్నీ శాశ్వతంగా తొలగిపోవాలన్నా, శాశ్వతంగా ఆనందాన్ని పొందాలన్నా ఒక్కటే మార్గం. అదే ముక్తి లేదా మోక్షాన్ని అందుకోవటమే.

కనుక ఎప్పుడో ఒకప్పుడు ఏదో ఒక జన్మలో మనం ఆ భగవంతుని వైపుకు తిరగక తప్పదు. ఆ భగవంతునితో తాదాత్మ్యం చెందక తప్పదు.

ఇంతకీ భగవంతునితో తాదాత్మ్యం చెందవలసినదేది ? మనస్సే. మనస్సు గనుక ఆత్మతో తాదాత్మ్యం చెంది ఐక్యమై పోతేనే మోక్షం. సముద్రం నుండి బయటపడిన ఉప్పుగల్లు అనేక ప్రదేశాలు తిరుగుతుంది. అనేకమంది చేతుల్లో పడుతుంది. రోళ్ళలో వేసి దంచుతారు. దానికీ తిప్పలన్నీ తప్పాలంటే అది తిరిగి సముద్రాన్ని చేరాలి. సముద్రంతో తాదాత్మ్యం చెంది సముద్రాకారంగా మారాలి. అలాగే ఆత్మ నుండి బయటపడిన మనస్సు ఈ ప్రపంచంలో అంతటా తిరిగి తిరిగి, అనేక బాధలు పడి చివరకు ఆత్మను చేరి ఆత్మతో తాదాత్మ్యం చెందాలి. ఆత్మాకారంగా మారాలి. అదే మోక్షం.

ఇంతకీ ఆత్మ లేదా పరమాత్మ ఎక్కడున్నాడు ? మనస్సు ఎక్కడుంది ? పరమాత్మ ఏమో ఈ ప్రపంచానికి ఆధారంగా, ఈ ప్రపంచమునందంతటా - పాలలో వెన్నలాగా వ్యాపించియున్నాడు. మనస్సేమో ఈ ప్రపంచంలో తిరుగుతున్నది. ఇప్పుడు ప్రపంచంపై వ్యామోహంతో తిరిగే మనస్సును ఆ వ్యామోహాన్నుండి వదిలించి శుద్ధిచేసి ఆ పరమాత్మతో ఐక్యం చేయాలి, ఎలా చేయాలి?

దీనికొక చక్కని రాజమార్గం ఉన్నది.

మన మనస్సు ప్రపంచంలో తిరుగుతూ ప్రాపంచిక విషయాలలో ఇరుక్కుని ఉన్నది గనుక, ముందు ఈ మనస్సును ప్రాపంచిక వ్యామోహాల నుండి వెనుకకు మరలించాలి. ఏదో ఆనందం పొందాలని, సుఖాలను, భోగాలను పొందాలని ప్రపంచంలో విహరించే ఈ మనస్సుకు నిజమైన ఆనందం అనేది ఈ అనిత్య ప్రపంచంలో, అనిత్య విషయ వస్తువులలో లభించదని తెలియజెప్పాలి. కోరికలను, వ్యామోహాలను అరికట్టాలి. సాధారణ జీవితాన్ని గడపటానికి, సాత్వికాహారం తీసుకోవటానికి అలవాటు చేయాలి. భోగసక్తిని తగ్గించుకొని, శాస్త్ర విహితమైన కర్మలను ఎటువంటి కోరికలు లేకుండాను, ఫలితంపై ఆసక్తి లేకుండాను, నేను చేస్తున్నాననే అహంకారం లేకుండాను, నిర్లిప్తంగా చేయాలి. పదిమందికీ ఉపయోగపడే కర్మలు చేయాలి. ఇదే కర్మయోగం.

ఇలా చేస్తూ చేస్తూ వుంటే కొంతకాలానికి మనస్సులో కోరికలు తగ్గిపోతాయి. భోగాసక్తి తగ్గిపోతుంది. దానితో ఈ మనస్సుకు ప్రాపంచిక విషయాల పట్ల, భోగాల పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. ఇలా ఆసక్తి తగ్గిన ఈ మనస్సుకు ఏదో ఒక ఆధారం కల్పించాలి. ఈ మనస్సుకెప్పుడూ తిరిగే అలవాటు. కనుక మరల తిరగటానికి విషయాలలోకి వెళ్తుంది. అందుకే దీనికొక ఆధారం చూపించాలి. అదే భగవంతుడు. ఈ మనస్సును భగవంతుడు అనే స్తంభానికి కట్టి వేస్తే ఎప్పుడూ ఆ స్తంభం చుట్టూ తిరగుతుంటుంది. ఒకరూపం, ఒకనామం, కొన్ని గుణాలతో ఒక దేవతా రూపాన్ని ఆరాధించటం ప్రారంభించాలి. ఇంతకాలం ప్రాపంచిక విషయాల చుట్టూ తిరిగిన మనస్సు ఇప్పుడు ఈసాకార సగుణ రూప దేవత చుట్టూ తిరుగుతుంది. ఆ రూపాన్నే చూస్తూ - దానినే పూజిస్తూ - దానినే

ఆరాధిస్తూ - దానికే నమస్కరిస్తూ - దానినే స్మరిస్తూ - దానినే భజిస్తూ - దానినే ధ్యానిస్తూ - దాని గురించే వింటూ - దాని గురించే మాట్లాడుతూ - నిరంతరము దానితోనే తన్మయం చెంది ఉంటుంది. దానిని గురించి ఒక్క క్షణం కూడా విడిచి ఉండలేనంతటి పరిస్థితి రావాలి.. ఆ దేవతారూపాన్ని తలచుకుంటే పరవశం కలగాలి. ఇదే భక్తి యోగం.

ఇట్టి నిజమైన ప్రేమ -లేదా భక్తి కారణంగా మనస్సు ఆ దేవతా రూపంనందే నిలిచి ఉంటుంది. ఆ రూపం మీదనే ఏకాగ్రమవుతుంది. అన్నివైపులా పరుగులు తీయదు. ఇలా ఏకాగ్రత సాధించిన తర్వాత అసలు ఈ దేవతా రూపం ఏమిటి? దీని అసలు స్వరూపం ఏమిటి? అనే ఆలోచన వస్తుంది. దానితో ఈ దేవతా స్వరూపం వెనుక నున్న పరమాత్మ తత్వం గురించి తెలుసుకోవాలనే తపన కలుగుతుంది. దానితో అన్వేషణ ప్రారంభిస్తాం. భగవత్తత్వాన్ని ఉన్నది ఉన్నట్లు చెప్పేవి ఉపనిషత్తులు - వేదాంత శాస్త్రాలు, అలాగే ఉపనిషత్సారమైన భగవద్గీత. కనుక వీటిని గురించి తెలుసుకొని - వీటిని అధ్యయనం చేయాలి. అందులోని విషయాలను తెలుసుకోవాలి. అలా తెలుసుకోవాలంటే శాస్త్రజ్ఞాన సంపన్నులు, బ్రహ్మనిష్టులు, కరుణామయులు అయిన సద్గురువులను సేవించి, వారి ద్వారా శాస్త్రాలలో వివరించిన భగవత్తత్వాన్ని గురించి చక్కగా తెలుసుకొని, నిరంతరం ఆ విషయాలను మననం చేసుకోవాలి. ఇదే జ్ఞానయోగం.

ఇలా భగవత్తత్వాన్ని గురించి తెలుసుకున్న తర్వాత ఒక ప్రశాంత ప్రదేశంలో ఆసనం ఏర్పాటు చేసుకొని, కన్నులు మూసుకొని, తైలధారలాగా, ఏకాగ్రచిత్తంతో ఆ పరమాత్మ తత్వాన్ని గురించి ధ్యానించాలి. నేనెవరు? అని విచారణ ప్రారంభించి,

నేను ఈ దేహ, మనో బుద్ధుల కన్న వేరుగా చైతన్య రూపంగా నున్న ఆత్మ స్వరూపాన్నని, ఈ ఆత్మ స్వరూపం ఆ పరమాత్మయేనని, శుద్ధమైన బుద్ధి ద్వారా ధ్యానించి, ఇంతవరకు జీవుడుగా వ్యవహరించిన తాను, భగవంతుడుగా ఆరాధించబడిన ఆ దివ్య చైతన్యము రెండూ ఒక్కటేనని అనుభూతిని పొందాలి. అలా పొందే వరకు ఈ ధ్యాన సాధన సాగించాలి. ఇదే ధ్యాన యోగం.

ఇలా ధ్యానం కొనసాగించగా కొనసాగించగా ధ్యానించే నీవు, ధ్యానించబడే పరమాత్మ, చేసే ధ్యానమూ అన్నీ ఒక్కటిగా అవుతాయి. అదే త్రిపుటి నశించుట. అదే సమాధిస్థితి. అదే మోక్ష స్థితి - ఈ నాలుగు మార్గాలను తెలుసుకుంటే ముక్తి తథ్యం.

మనస్సుకు అంటిన మూడు కల్మషాలు సత్వరజస్తమో గుణాలు. వీటిలో కర్మయోగం ద్వారా తమోగుణాన్ని వదిలించుకుంటాం.

భక్తి యోగం ద్వారా రజోగుణాన్ని వదిలించుకుంటాం.

ఇక మిగిలింది సత్వ గుణం. ఇది మంచి గుణం. ఈ గుణంలో ఉన్నప్పుడే మనం జ్ఞానాన్ని అర్జించగలం. ధ్యాన సాధన కొనసాగించగలం.

సత్త్వ గుణం అంటే మంచి ఆలోచనలు చేసే స్థితి.అయితే సమాధి స్థితితో ఆలోచనలన్నీ ఆగిపోవాలి. ఆలోచనలన్నీ ఆగాలంటే సత్త్వ గుణం కూడా పోవాలి. ఆ గుణం కూడా పోతేనే నేను ధ్యానం చేస్తున్నాననే ఆలోచన ఆగిపోతుంది. త్రిపుటి ఏకమవుతుంది. ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది.

మరి సత్వగుణాన్ని వదిలించుకోగలమా? దానికేదైనా సాధన ఉన్నదా? ఏమీ లేదు. మనంతట మనంగా ఈ సత్వగుణాన్ని వదిలించుకోలేం.

ఈ సత్వ గుణ స్వభావం ఎలాంటిదో దానిని వదిలించుకొనుటకు ఉపాయం

ఏమిటో 15వ మంత్రంలో తెలియజేయబోతున్నారు.

ఈ ఉపాయాన్ని అనుసరించి ఆ సత్వగుణాన్ని తొలగించుకుంటే అన్ని ఆలోచనలు ఆగిపోతాయి. ఆత్మ సాక్షాత్కారం కలుగుతుంది. మరి ఆ సత్వగుణాన్ని తొలగించుకోవటం ఎలాగో తరువాత మంత్రంలో....

## పంచ దశ మంత్రం

మం॥ హిరణ్మయేన పాత్రేణ

సత్య స్యాపి హితం ముఖం।

తత్త్వం పూషన్న పావృణు

సత్య ధర్మాయ దృష్టయే ॥

ప్రతిపదార్థం:- హిరణ్మయేన పాత్రేణ = బంగారు పాత్రవల్ల, సత్యస్యముఖం = సత్య స్వరూపుడైన పరమాత్మయొక్క ముఖం, అపిహితం = కప్పివేయబడి ఉన్నది. సత్య ధర్మాయ = సత్యస్వరూపుడైన ఆ పరమాత్మతో ఐక్యం చెందటమే ధర్మంగా పెట్టుకొన్న నేను, దృష్టయే = (ఆ పరమాత్మను) దర్శించుటకు గాను, పూషన్ = ఓ పోషకుడా! (సూర్యభగవానుడా) త్వం = నీవు, తత్ = దానిని ( ఆ బంగారు పాత్రను) అపావృణు = తొలగించు.

భావం:- సత్యస్వరూపుడైన పరమాత్మ ముఖం బంగారు పాత్ర చేత కప్పబడి ఉన్నది. ఆ పరమాత్మతో ఐక్యం చెందటమే ధర్మంగా పెట్టుకున్న నేను దర్శించటానికి, ఓ పోషకుడా! నీవు దానిని తొలగించు.

వ్యాఖ్య:- కర్మయోగాన్ని ఆచరించటం ద్వారా సాధకుడు తనలోని తమోగుణాన్ని వదిలించుకున్నాడు. అయితే రజోగుణం ప్రబలంగా ఉంది. కనుక దీనిని తొలగించుకొనుటకు సాకార సగుణోపాసన చేశాడు. అంటే భగవంతునిపై నిరంతర భక్తితో మనస్సును పూర్తిగా భగవన్మయం చేశాడు. భగవంతునికి శరణాగతుడయ్యాడు. తమోగుణం, రజోగుణం తొలగి పోవటంతో సత్త్వగుణం మిగిలింది. పరమాత్మ జ్ఞానాన్ని అందుకొనుటకు అర్హత గలిగించేది ఈ సత్వగుణమే. కనుక పరమాత్మకు సంబంధించిన జ్ఞానాన్ని శాస్త్రాల ద్వారా తెలుసుకుంటూ తెలుసుకున్న జ్ఞానాన్ని మననం చేసుకుంటూ నిధి ధ్యాసన ద్వారా ఆ జ్ఞానాన్ని లేదా పరమాత్మ తత్వాన్ని అనుభవానికి తెచ్చు కుంటున్నాడు. జ్ఞానాన్ని పొందాలన్నా - నిరాకార నిర్గుణ పరమాత్మ తత్వాన్ని ధ్యాన యోగంలో ఉపాసన చేయాలన్నా ఈ సత్వగుణంలోనే సాధ్యం.

ఇలా ధ్యానిస్తూ ధ్యానిస్తూ మనస్సు కాస్తా నిర్విషయం కావాలి. ఆలోచనలన్నీ ఆగాలి. ఎటువంటి సంకల్పాలు లేని నిర్వికల్ప స్థితి రావాలి. దానినే సమాధిస్థితి అంటారు. ఇట్టి స్థితి కలగటానికి సత్వగుణం అడ్డువస్తున్నది. సత్వగుణం జ్ఞానాసక్తి కలిగించి ఆనందం ఇచ్చేది. చూస్తూ చూస్తూ దీనిని వదులుకోలేం. ఇప్పటి వరకు ధ్యానం చేసే నేను, ధ్యేయ వస్తువైన పరమాత్మ, చేసే సాధన ధ్యానం, అనే మూడింటి స్పృహ ఉన్నది. ఇదే త్రిపుటి అంటే. మనస్సు సత్వగుణంతో ఉన్నంత వరకు ఈ త్రిపుటి ఉంటుంది. సత్వగుణం కూడా అంతమైతే మనస్సు త్రిగుణాతీత మవుతుంది. అప్పుడే ఇక మనస్సు కూడా అంతమయ్యేది. అంటే నేను అనబడే అహంకారం పూర్తిగా అంతమైపోతుంది. అదే సమయంలో అహంకారంతో పాటు చేసే సాధన కూడా అంతమైపోతుంది. నేను అనే భావన ఉన్నంతసేపే చేసే సాధన అనేది ఉన్నది. అసలు నేనే లేకపోతే ఇంక ఈ ధ్యానం అనేది ఎక్కడుంది? సమాధి స్థితి ఎక్కడుంది? కనుక

అన్నీ పరమాత్మలో అంతమై పరమాత్మ ఒక్కటే మిగులుతుంది. ఇప్పుడిక జీవభావం లేదు. ఉన్నదొక్కటే ఆత్మ. ఇదే ఆత్మానుభూతి - ఆత్మసాక్షాత్కారం.

ఈ ఆత్మానుభూతికి అడ్డువచ్చే సత్వగుణాన్ని తొలగించుకోవాలి. ఇదే ఆత్మకు అడ్డువస్తున్న హిరణ్మయేన పాత్ర. ఈ పాత్రే సత్యస్యముఖం అపిహితం = పరమాత్మ ముఖాన్ని కప్పి ఉంచినది. బంగారు పాత్ర అని ఎందుకన్నారు? రాగిపాత్రో, ఇత్తడి పాత్రో, మట్టిపాత్రో అనలేదేమి? ఇవన్నీ పెద్దగా ఆకర్షణలున్నవి కాదు. బంగారమైతే ఎంతో ఆకర్షణీయమైనది. సామాన్యులనే కాదు గొప్పగొప్ప పండితులను,సర్వసంగ పరిత్యాగులను కూడా వలలో పడేసుకొనేంత ఆకర్షణ ఉంది దానికి.

సాక్షాత్తు శ్రీరామచంద్రుని భార్య సీతాదేవి కూడా ఈ బంగారు ఆకర్షణలో చిక్కి కష్టాలు కొని తెచ్చుకున్నది. ఆమె పరమాత్మ కన్న బంగారు లేడికి అధిక ప్రాధాన్యా న్నిచ్చింది. భర్తను దానికోసం పంపింది. భగవంతుని కన్న బంగారానికి విలువ ఇవ్వటంతో భగవంతునికి దూరమైంది. అనేకమైన కష్టాలు అనుభవించింది. కనుక ఎంతటి వారైనా సరే దాని ఆకర్షణ నుంచి తప్పించుకోవటం కష్టమే.

సత్వగుణం కూడా అంతటి ఆకర్షణ గలది కనుకనే దానిని బంగారు పాత్రతో పోల్చారు. సత్వం సుఖే సంజయతి అని భగవద్గీతలో చెప్పారు. సత్వం సుఖాన్నిస్తుంది. జ్ఞానాన్నిస్తుంది. ధర్మకార్యాలు, దైవకార్యాలు, పరోపకారం, లోకకళ్యాణం, త్యాగం చెయ్యాలనిపించే గుణమే సత్వగుణం. ఇంత మంచి గుణం కూడా ఆత్మ సాక్షాత్కారానికి అడ్డమే. కనుకనే సత్యస్య ముఖం అపిహితం అని చెప్పబడ్డది. దీనిని కూడా వదిలించుకుంటేనే చివరి సంస్కారపు పొర తొలగిపోయేది.మోక్షప్రాప్తి కలిగేది. కనుక సత్వగుణం మంచిదే అయినా దానిని తొలగించుకోక తప్పదు.

సత్యధర్మాయ దృష్టయే:- సత్యమునే ధర్మముగా కలిగిన నేను (జీవుడు). నిజంగా మానవులై పుట్టిన మనందరికీ ఒక ధర్మం ఉంది. నెరవేర్చవలసిన కర్తవ్యం ఉంది. ఏమిటా ధర్మం? ఏమిటా కర్తవ్యం? సత్య దర్శనం. పరమాత్మ దర్శనం. ఆత్మసాక్షాత్కారం. ఇదే నాధర్మం. ఇదే జీవ ధర్మం. ఇట్టి ధర్మాన్ని కలిగిన నేను ఇప్పుడా సత్యం (పరమాత్మ) యొక్క దర్శనం చేసుకోవాలి. కాని ఆయన ముఖం కప్పివేయబడి ఉన్నది. దేనితో? హిరణ్మయేన పాత్రేణ. బంగారు పాత్రతో. అంటే సత్వగుణంతో. మరి ఆ అడ్డుతొలగితే గదా! నాకు దర్శనం అయ్యేది. కనుక తొలగించుకోవాలి. ఎలా తొలగించుకోవాలి?

ఇంతవరకు తమోగుణాన్ని, రజోగుణాన్ని తొలగించుకున్నాం. ప్రయత్నం చేసి తొలగించుకున్నాం. సత్వగుణాన్ని పట్టుకొని వాటిని తొలగించుకున్నాం. మరి సత్వగుణాన్ని తొలగించుకోవాలంటే ఎవరిని పట్టుకోవాలి? దేనిని పట్టుకోవాలి? ఎవరి సాయం పొందాలి? ఎవరైతే ఈ మనస్సును పోషిస్తున్నారో వారిని పట్టుకోవాలి. ఆయనే పూషన్! అని పిలువబడుతున్నాడు. ఆయనే సూర్యభగవానుడు. ప్రత్యక్ష సాక్షి. ప్రత్యక్ష దైవం. అందరికీ వెలుగును ప్రసాదించేవాడు. అందరినీ పోషించేవాడు. ఆయనకా శక్తి ఎక్కడిది? ఆయనలో అంతర్యామిగానున్న పరమాత్మదే ఆ శక్తి. కనుక మన ప్రార్థన బాహ్యంగా సూర్యునికే అయినా ఆ పరమాత్మకే. అయితే అందరూ సూర్యుణ్ణే ప్రార్థించాలా? అక్కరలేదు. ఎవరి ఉపాస్యదేవతను వారు ప్రార్థించవచ్చు.

ఇక్కడ సూర్యునే ఎందుకు చెప్పినట్లు? ఈ ఉపనిషత్తు శుక్ల యజుర్వేదంలోనిది. దీనిని యాజ్ఞవల్క్య మహర్షికి సూర్యుడే ఉపదేశించాడు. కనుక సూర్యుడు ఉపాస్యదేవత. అందుకే ఆయనకు విన్నపం. ఏమని? పూషన్ - ఓ పోషకుడా! ఆత్మను

కప్పిఉంచిన సత్వగుణం అనే ఆ బంగారు పాత్రను తొలగించు. మిగిలిన రెండు పొరలను నేను తొలగించుకున్నాను. దీనిని తొలగించుకొనుటకు నేను అసమర్థుణ్ణి. నిన్ను అర్థించటం తప్ప నేను ఇంకేమీ చేయలేను అని ప్రార్థించాలి, అక్రోశించాలి, కేక వేయాలి.

- ఇదే భగవంతునికి చేసుకునే చిట్ట చివరి విన్నపం.

- ఇదే జీవభావం తొలగించుకోవటానికి జీవుడు వేసే చిట్ట చివరికేక.

- ఇదే జీవుని చావుకేక.

- ఇదే ధ్యాన పరాకాష్ట దశలో - సమాధి దశలో వేసే చావుకేక.

- ఇదే సత్వం సత్వాతీత స్థితికి చేరే పరిణామదశలోని కేక.

- ఇదే త్రిగుణాతీత స్థితి. మనస్సు అంతమయ్యే స్థితి. జీవభావం అంతరించే స్థితి. మానవజన్మ సార్థకం కాబోయే స్థితి. సమస్త కర్మబంధాల నుండి విడుదల పొందే స్థితి. జీవన్ముక్త స్థితి.

ఎన్నో జన్మల నుండి మనం చేస్తున్న సాధనలు సిద్ధించే స్థితి.

ధ్యాన పరాకాష్ట దశలో - అంటే నిర్వికల్ప సమాధి స్థితిలో జీవుడు వేసే ఈ కేకతో ఉపాస్యదేవత కరుణించి సత్వగుణం అనే చివరి తొడుగును -

ఆకర్షణలతో గూడిన హిరణ్మయేన పాత్రను -

జీవుడి యొక్క జీవభావాన్ని - తొలగించాడు. ఇప్పుడు ఆత్మను కప్పి ఉంచిన అడ్డుకాస్తా తొలగిపోయింది.

అద్భుత దర్శనం!

మాటలకందని అనుభూతి!

అక్కడి దృశ్యం చూడగానే హృదయం ఝల్లుమంది.

కన్నులతో చూడశక్యం గాని దృశ్యం!

మనస్సుతో ఆలోచించ వీలులేని దృశ్యం!

బుద్ధితో విచారణకు అందని దృశ్యం!

ఏముందక్కడ?

తరువాత మంత్రం వివరిస్తున్నది.

## షోడశ మంత్రం

మం॥ పూషన్నే కర్షే యమ సూర్య

ప్రాజా పత్య వ్యూహ రశ్మీన్ సమూహ।

తేజో యత్తే రూపంకళ్యాణ తమం

తత్తే పశ్యామియోసావసౌ పురుషః సో హమస్మి ॥

ప్రతి పదార్థం:- పూషన్ = ఓ పోషకుడా, ఏకర్షే= అద్వితీయుడగు ఓ ఋషి!, యమ= అంతటిని నియమించువాడా!, సూర్య = బుద్ధిని ప్రేరేపించువాడా (స్వీకరించువాడా!) ప్రాజాపత్య = ప్రజాపతి కుమారుడా ! (ప్రజలను పాలించే సూర్యుడా)! రశ్మీన్ = నీ తీక్షణ కిరణములను, వ్యూహ = తొలగించు, తేజః = నీ తేజస్సును, సమూహ =ఒక్కచోట చేర్చు, తే = నీయొక్క, యత్ కళ్యాణతమం రూపం = ఏదైతే అత్యంత మంగళ ప్రదమైన రూపం ఉన్నదో, తత్= అటువంటి, తే = నీ యొక్క రూపాన్ని, పశ్యామి = చూస్తున్నాను, అసౌ అసౌ = అదిగో అదిగో, యః పురుషః = ఏ

పురుషుడైతే ఉన్నాడో, సః = అతడు, అహంఅస్మి = నేనే అయి ఉన్నాను.

భావం :- పోషకుడా, అద్వితీయమైన ఓ ఋషీ ! అంతటినీ నియమించువాడా! శాసకుడా ! సర్వాన్నీ స్వీకరించేవాడా ! బుద్ధిని ప్రేరేపించే వాడా ! ప్రజాపతి కుమారుడైన సూర్య భగవానుడా ! నీతీక్షణమైన కిరణాలను ఉపసంహరించు, నీ తేజస్సునంతటిని ఒక్క చోటికి చేర్చు. ఆహా ! నీ యొక్క మంగళ ప్రదమైన రూపం ఏదైతే ఉన్నదో అట్టి రూపాన్ని నేను చూస్తున్నాను. అదిగదిగో అక్కడ ఉండే ఆ పురుషుడు ఎవరో కాదు. అతడునేనే అయి ఉన్నాను.

వ్యాఖ్య :- ధ్యాన పరాకాష్ట దశలో అంటే నిర్వికల్ప సమాధి దశలో సత్వ గుణం అనే చివరి సంస్కారపు పొరను, ఆకర్షణలతో గూడిన హిరణ్మయేన పాత్రను తొలగించమని ఉపాస్యదేవత అయిన సూర్యభగవానుని ప్రార్థించటం జరిగింది. విన్నపం చేసుకోవటం జరిగింది. చావుకేక వేయటం జరిగింది. వినయంతో కూడిన ఆ ప్రార్థన - ఆ కేక కారణంగా ఉపాస్యదేవత అయిన సూర్యభగవానుడు తన ప్రచండ కిరణాలతో ఆ చివరి అహంకారపు పొరను, సత్వగుణమనే చివరి సంస్కారపు పొరను, బంగారు పాత్ర అనే తొడుగును తొలగించటం జరిగింది.

కళ్ళు మిరిమిట్లు గొలిపే అద్భుత దృశ్యం. దాన్ని ఈ కళ్ళు చూడలేక పోతున్నాయి. కారణం? ఆ సూర్య కిరణాలే. అహంకారపు పొరను కరిగించటానికి సూర్యభగవాను డక్కడకు రాగానే ఆయన ప్రచండ కిరణాల ధాటికి ఆ పొరకాస్తా కరిగిపోయింది. ఆ తొడుగు కాస్తా తొలగిపోయింది. అయితే ఇప్పుడు ఆ సూర్యుని కిరణాలే అడ్డుగా ఉన్నాయి. ఆ కిరణాల ధాటికి అక్కడ ఏమీ చూడలేక పోతున్నాడు. అక్కడ ఏమున్నదో చూడాలంటే ఆ సూర్యకిరణాల అడ్డుకూడా తొలగాలి. అవి తొలగితే తప్ప అక్కడి

అద్భుత రూపాన్ని దర్శించే వీలు లేదు. అందుకే ఆ సూర్యభగవానునికి ప్రార్థన. ఏమని?

(1) పూషన్:- ఓ పోషకుడా! సమస్తమైన ప్రాణులకు వెలుగునిచ్చి ప్రాణులకు జీవించే అవకాశం కల్పించినవాడా! సముద్రపు నీటిని నీ కిరణాలతో వేడెక్కించి, వాటిని స్వీకరించి, మరల ప్రాణులకు వర్షరూపంలో ఇచ్చి దాహం తీర్చేవాడా? నీ కిరణాలతో వృక్షాలను పోషించి ప్రాణులకు ఫలాలను ఇప్పించేవాడా!

(2) ఏకర్షే:- ఏకమైన ఋషీ! అద్వితీయుడైన ఋషీ! ఋషి అంటే సర్వమూ తెలిసిన వాడు. భూత భవిష్యత్ వర్తమానాలు తెలిసిన వాడు. మరి లోకంలో చాలామంది ఋషులున్నారుగదా! ఏకమైన ఋషీ! అంటే అలాంటి వాడు ఇంకొకడు లేడని గదా! అవును. ఈ ఋషులంతా ఆ పరమాత్మ యొక్క చైతన్యంతో సర్వజ్ఞులైనారు. మరి సూర్య భగవానునిలో అంతర్యామిగా నున్న ఆ పరమాత్మ - ఎవరి యొక్క సహాయ సహకారాలతో పనిలేకుండానే ఆయన సర్వజ్ఞుడు. స్వయం శక్తి సంపన్నుడు. కనుకనే అట్టి వాడింకొకడు లేడు. అద్వితీయుడు.

(3) యమ:- నియామకుడా! శాసకుడా! అన్నింటిని నియమించిన వాడు, అన్నింటిని శాసించిన వాడు. అన్ని గ్రహాలను, ఉపగ్రహాలను నియమించిన వాడు, శాసించిన వాడు ఆ పరమాత్మే. ఏ గ్రహం ఎంత వేగంతో, ఎక్కడ, ఎలా తిరగాలో ఆయనే శాసించాడు. ఈ భూమి మీదనున్న ప్రాణికోట్లన్నీ ఎలా జీవించాలో నిర్దేశించిన వాడూ ఆయనే. కనుకనే ఆయన నియామకుడు.

(4) సూర్య:- అంటే స్వీకరించే వాడు అని ఒక అర్థం, ప్రేరేపించేవాడు అని ఒక అర్థం. మన యొక్క నమస్కారాలను, మన నిర్మల మనస్సును స్వీకరించే వాడు

ఆయనే. అలాగే ప్రాణికోట్ల యొక్క అందరి బుద్ధులను, మనస్సులను ప్రేరేపించేవాడూ ఆయనే. అందుకే ఆయన సూర్య.

(5) ప్రాజాపత్య:- ప్రజాపతి కుమారుడా అని. కనిపించే సూర్యుడు ప్రజాపతి కుమారుడు. ప్రజలను పాలించే పతి ఆ పరమాత్మే. ఆయనే సృష్టించేవాడు, పాలించేవాడు, లయం చేసేవాడు. ప్రజలను పాలించటానికి ఒక కర్మ నియమాన్ని - కర్మ సిద్ధాంతాన్ని ఏర్పాటు చేసి దాని ప్రకారం సర్వప్రాణులను పాలిస్తున్నాడు. ఆయన దేనికైనా సమర్థుడు.

ఇలా పైకి సూర్య భగవానుని సంబోధిస్తూ - సర్వాంతర్యామి అయిన పరమాత్మను వేడుకుంటున్నాడు. ఏమని?

రశ్మీన్ వ్యూహ:- నీ తీక్షణమైన కిరణాలను తొలగించు. ఎందుకు తొలగించటం? ఇంతకు ముందు పరమాత్మను దర్శించటానికి అహంకారపు పొర - సత్వ గుణం అనే తొడుగు - బంగారు పాత్ర అడ్డు వచ్చింది. దానిని తొలగించటానికే ఉపాస్య దేవత ఐన నిన్ను ప్రార్థించాను. నీ ప్రచండ కిరణాలతో ఆ తెరను కాస్తా తొలగించావు, బాగానే ఉంది. కాని ఇప్పుడు నీ కిరణాలే నాకు అడ్డుగా ఉన్నాయి, కనుక వాటిని తొలగించాలి. ఎవరికున్నది ఆ శక్తి? నీకే. అందుకే విన్నపం. ఇలా ప్రార్థించగానే సూర్య భగవానుడు తన ప్రచండ కిరణాలను ఉపసంహరించాడు. తొలగించాడు.

అలా తొలగించటంతో సర్వాంతర్యామి, సర్వవ్యాపకుడు, ఆ సూర్యునికే అంతటి కాంతినిచ్చిన కోటి సూర్య సమప్రభా తేజుడు అయిన పరమాత్మ అద్భుత రూపంతో దర్శన మిస్తున్నాడు. అయితే ఈ రూపాన్ని చూడగలమా? చూడలేం. ఎందుకని? సూర్యకిరణాలనే చూడలేని మనం ఈ సూర్యునికే అంతటి శక్తి నిచ్చిన కోటి సూర్య

సమ ప్రభావిలసితమైన ఆ పరమాత్మ యొక్క దివ్యతేజస్సును, సర్వత్రా ఈ బ్రహ్మాండం అంతటా వ్యాపించిన ఆయన యొక్క దివ్యతేజస్సును ఎలా చూడగలం? అందుకే ఆ సర్వ వ్యాపక పరమాత్మకే చివరి ప్రార్థన. చిట్టచివరి వినతి ఏమని?

సమూహ తేజ:- సర్వత్రా వ్యాపించియున్న నీ తేజస్సును ఒక్క చోటుకు చేర్చు. నేను చూడటానికి వీలయ్యేటట్లు నీ రూపాన్ని సమూహ పరచు అని.

ఈ ప్రార్థనతో పరమాత్మ తన తేజస్సు నంతటిని ఒక్క చోటకు చేర్చాడు. చూడటానికి వీలైన రూపం ప్రత్యక్షమైంది. ఇప్పుడా అద్భుత రూపాన్ని ఆనందంతో చూస్తున్నాడు. పరవశంతో చూస్తున్నాడు.

ఎలా ఉంది ఆ రూపం?

భయంకరమైన రూపంకాదు. కురుసభలో చూపించిన విశ్వరూపంకాదు. అర్జునుడు కూడా చూడలేక భయపడిపోయిన కురుక్షేత్ర యుద్ధభూమిలో చూపిన విశ్వరూపం కాదు. నాలుకలన్నీ బయటకు చాపి, భయంకరమైన అగ్నికీలలు వెలిగ్రక్కుతున్న క్రోధ రూపం కాదు. అది భగవంతుని యొక్క కళ్యాణ తమం రూపం. మంగళప్రదమైన రూపం. శాంతమైన రూపం. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే రూపం. చూచిన తర్వాత కన్నులు త్రిప్పాలనిపించని రూపం. శుభప్రదమైన రూపం, అద్వితీయమైన దివ్య మోహన రూపం, ప్రసన్నమైన రూపం. అదిగో అట్టి నీ రూపాన్ని చూస్తున్నాను. తత్ తేపశ్యామి = అట్టి నీ రూపాన్ని చూస్తున్నాను.

మంగళప్రదము, శుభప్రదము, కళ్యాణప్రదము అయిన దివ్య మోహనమైన ఆ భగవంతుని దర్శనం లభించింది. పరమాత్మ సాక్షాత్కారం లభించింది. ఎలా ఉన్నాడు ఆ పరమాత్మ? వర్ణించగలవా? అక్కడున్నదెవరో చెప్పగలవా?

అసౌ అసౌ పురుషః సో హ మస్మి :- అదిగదిగో ఆ పురుషుడు ఎవరో నేను స్పష్టంగా చూడగలుగుతున్నాను. అక్కడ కనిపించే ఆ దివ్యపురుషుడు మరెవరోకాదు -ఆ ! ఎవరు మరి ? ఆ పురుషుడు నేనే. నాకన్న వేరుగా మరెవరూ లేరు. అసలు అంతటా ఉన్నది నేనే. నేను తప్ప మరేమీ రెండవది లేదు. ఇంతకాలం మిథ్య అయిన శరీరాన్ని చూచి నేను అనుకున్నాను. మనోబుద్ధులు నేను అనుకున్నాను. అవేవీ నేను కాదు. నేను వాటన్నింటికి వేరుగా సత్యంగా ఉన్నవాణ్ణి. అవి మిధ్యారూపాలు. నేనే ఆత్మ. నేనే పరమాత్మ. ఇంతకాలం మిధ్యారూపాలను చూచి అజ్ఞానంతో నేననుకున్నాను. కాని అంతటా ఉన్న ఏకైక సత్యమయిన ఈ దివ్యమంగళ స్వరూపమే నేను.

ధ్యానం యొక్క పరాకాష్ట దశలో - అంటే నిర్వికల్ప సమాధి దశలో, త్రిపుటి అంతమైన స్థితిలో, ఆత్మ పరమాత్మతో ఐక్యం చెందే మహానుభవం ఇది. జీవ బ్రహ్మైక్యస్థితి ఇది. ఇప్పుడు ఇంతకాలం సాధన చేసిన సాధకుడు - చేసిన సాధన - రెండూ కూడా ఆ పరమాత్మలోనే అదృశ్యమై పోయినవి. ధ్యేయం - ధ్యాత - ధ్యానం అనే త్రిపుటి ఏకమై - ఏకమైన పరమాత్మయే మిగిలింది.

ఇప్పటి వరకు నేను జీవుణ్ణని, జీవుణ్ణయిన నేను ఆ పరమాత్మను దర్శించాలని, ఒక ఉపాస్యదేవతను ఆరాధించి, సాధనలు చేసి, సమాధి నిష్టలో నిర్వికల్ప స్థితిలో నిలిచాను. దీనితో జీవభావం కాస్తా తొలగిపోయింది. ఇప్పుడు సాధనచేసే జీవుడు, చేసే సాధన, సాధ్యవస్తువయిన పరమాత్మ అంతా ఒక్కటే అయిపోయింది. జీవుడు - ఈశ్వరుడు - పరమాత్మ ఒక్కటే అయి శుద్ధ చైతన్యం మాత్రం మిగిలింది. దానితో ఇంతవరకు జీవ భావంలో ఉండి సాధనచేసిన సాధకుడు జీవభావం తొలగటంతో అహం బ్రహ్మాస్మి అనే అనుభవం కలిగి పరమాత్మగా మిగిలిపోయాడు. అతడికిక ఈ ప్రపంచంలేదు. జీవభావం లేదు.

అహం బ్రహ్మాస్మి - సోహమస్మి అనే అనుభవం కలగటంతో సాధన పూర్తి అయింది. సాధకుడు కాస్తా సిద్ధుడయ్యాడు. జీవుడు దేవుడయ్యాడు, నరుడు నారాయణుడయ్యాడు. మానవుడు మాధవుడయ్యాడు. సమస్త కర్మబంధనాలనుండి విముక్తుడై జీవన్ముక్తుడయ్యాడు.

నిర్వికల్ప సమాధిలో మనస్సు నాశనం అయినప్పుడు మనస్సు త్రిగుణాతీత మైనప్పుడు ఈ మహానుభవం కలుగుతుంది.

జీవుడు జీవన్ముక్తుడే అయినా - దేవుడే అయినా - సిద్ధిపొందినా ఇంకా శరీరం మాత్రం అలాగే ఉంటుంది. అది ఏ ప్రారబ్ధకర్మలు అనుభవించటానికి వచ్చిందో అవి అన్నీ అనుభవించేదాకా ఆ శరీరం రాలిపోదు. అయితే సమస్త కర్మబంధనాల నుండి విముక్తుడైన సిద్ధుడు గదా ఇతడు ! మరి ప్రారబ్ధకర్మలను అనుభవించాల్సిందేనా ? అక్కరలేదు. అనుభవించే మనస్సు నాశనమైపోయింది. కనుక శరీరానికి ఏమి జరిగినా ఈ మహాత్మునికేమీ కాదు. ఆ శరీరంతో అతడికేం సంబంధం లేదు. అతడు శరీరంతో ఏం చేసినా అతడు చేసినట్లు కాదు. పరమాత్మ చేసినట్లే. అతడు నిరంతరం తనను ఆ పరమాత్మగానే భావించుకుంటూ ఉంటాడు. కనుక అతడికి ఈ శరీరం ద్వారా జరిగే పనుల వల్ల సుఖదుఃఖాలు ఉండవు. అతడెప్పుడూ ఆత్మానందంలో - బ్రహ్మానందంలో ఉంటాడు.

ఏ మహాత్ముని శరీరం ఎలా ప్రవర్తిస్తుంది అనే విషయం దాని ప్రారబ్ధాన్ని బట్టి, సమాజంయొక్క సమిష్టి ప్రారబ్ధాన్ని బట్టి ఉంటుంది.

చివరికి ఎప్పుడో ఒకప్పుడు దాని ప్రారబ్ధం తీరగానే అదిరాలిపోతుంది. అది రాలిపోయిన తర్వాత మళ్ళీ వస్తుందా ? రాదు. మళ్ళీ శరీరాన్ని తయారుచేసి పెట్టే

జీవభావం లేదు. మనోబుద్ధులు లేవు, కర్మ ఫలాలు లేవు. వాసనలు లేవు. కనుక మళ్ళీ జన్మలేదు. అదే జన్మ రాహిత్యం. ఈ జీవన్ముక్తుడు దేహం వదిలిన తర్వాత విదేహ ముక్తుడు అంటారు.

ఈ జీవన్ముక్తుడు శరీరాన్నెలా వదులుతాడు ? శరీరాన్ని విడిచే సమయంలో అతడి అనుభూతి ఎలా ఉంటుంది ? 17వ మంత్రంలో...

## సప్తదశ మంత్రం

మం॥ వాయు రనిల మమృతం

అథే దం భస్మాన్తగ్ం శరీరం ।

ఓంక్రతో స్మర కృతం స్మర

క్రతో స్మర కృతం స్మర ॥

ప్రతిపదార్థం :- అనిలం = స్థిరమైన నివాసంలేని, వాయుః = ఒక శరీరం నుండి మరొక శరీరానికి సంచరించే జీవుడు, అమృతం = నాశనం లేని శాశ్వత పరమాత్మలో అంతమైపోతాడు, అథః = ఇక, ఇదం శరీరం = ఈ స్థూల శరీరమేమో, భస్మాంతం = బూడిదై పోవటంతో ముగిసిపోతుంది, క్రతో = ఓ మనసా, ఓం = ప్రణవ స్వరూపుడైన పరమాత్మను, స్మర = స్మరించు, కృతం = సమాధి స్థితిలో నీవు పొందిన మహానుభవాన్ని, స్మర = స్మరించు, క్రతో = ఓ మనసా, స్మర = స్మరించు, కృతం = సమాధిస్థితిలో నీవు పొందిన మహానుభవాన్ని, స్మర = స్మరించు.

భావం :- స్థిరంగా ఒక చోట నిలకడగా ఉండక ఒక శరీరం నుండి మరొక

శరీరానికి సంచరించే జీవుడు నాశనం లేని శాశ్వత పరమాత్మ యందు లీనమయ్యాడు. ఇక ఈ శరీరం భస్మమైపోవటంతో అంతమైపోతుంది. ఓ మనసా ! నిరంతరం ప్రణవ స్వరూపుడైన పరమాత్మను స్మరించు. సమాధి స్థితిలో నీకు గలిగిన ఆత్మానుభవాన్ని స్మరించు. ఓ మనసా ! స్మరించు. సమాధి స్థితిలో నీకు కలిగిన మహానుభవాన్ని స్మరించు.

వ్యాఖ్య :- సాధనలన్నీ పూర్తి చేసి ఆత్మ సాక్షాత్కారంతో యోగ సిద్ధిని పొందిన జీవన్ముక్తుడు మరణ సమయంలో చేసే స్మరణ - ప్రార్ధనయే ఈ మంత్రం.

చనిపోవటం అనేది పుట్టిన వారందరికీ ఉన్నదే. సామాన్యుడూ మరణిస్తాడు, మహాత్ముడూ మరణిస్తాడు, జీవన్ముక్తుడైనవాడూ మరణిస్తాడు. అయితే జీవన్ముక్తుడు మరణించినా నిజంగా అతడు మరణించినట్లు కాదు, అతడికి మరణం లేదు.

మరణసమయంలో ఏది తలచుకుంటే అదే అవుతాడు అని భగవానుడు గీతలో చెప్పాడు. యంయంవాపి స్మరన్ భావం త్యజత్యన్తే కళేబరం తం తమే వైతికౌంతేయ! - అని. అలాగే ఎవరైతే అంత్యకాలంలో కూడా నన్నే స్మరిస్తూ శరీరాన్ని విడిచిపెడతారో వారు నన్నే పొందుతారు - అంతకాలేచ మామేవ స్మరన్ ముక్త్వా కళేబరం.. (8-5) అని కూడా చెప్పారు. మరి నిజంగా సామాన్యులెవరైనా భగవంతుని స్మరించగలరా ? లేదు. అసలు సామాన్యులకు ఈ విషయం తెలియదు. తెలిసినా నమ్మకముండదు. ఒకవేళ నమ్మినా స్వార్ధంతో ఆలోచిస్తారు గనుక ఆచరణ చేయరు. వారు జీవితమంతా ఏవేవో భౌతికమైన కోరికలతో ఉంటారు. కుటుంబ బాధ్యతలను తీర్చుకోవాలనే ఆరాటంలో ఉంటారు. వీటి కోసం ఏదో ఏదో చేయాలనే సంకల్పాలు చేసుకుంటూ ఉంటారు. వీటికి తోడుగా జన్మ జన్మల నుండి సంపాదించుకొని,

కూడబెట్టుకొని, వెంట తెచ్చుకున్న కర్మ ఫలాల మూటలు (సంచితకర్మలు) ఉంటాయి. ఈ శరీరాన్ని విడిచిపెట్టే సమయంలో ఆ సంచిత కర్మలలో నుండి పక్వానికి వచ్చిన ప్రారబ్ధ కర్మ ఫలాలను అనుభవించటానికీ, - శరీరం వదిలే సమయంలో నీకుండే ప్రబలమైన కోరికలను తీర్చుకోవటానికి, నీసంకల్పాలకు (వాసనలకు) అనుగుణంగా కర్మలు చేయటానికి, తగిన శరీరాలను సృష్టించుకొని మళ్ళీ మళ్ళీ ఈ లోకంలోకి వస్తూ ఉండాల్సిందే.

అయితే జీవన్ముక్తుడికి ఈ రహస్యం తెలుసు. అతడు కూడా ఇంతకు ముందు అనేక శరీరాలు ధరించి వచ్చినవాడే. పుడుతూ చస్తూ ఉన్నవాడే. అనేక జంతు జన్మల నెత్తి ప్రారబ్ధ కర్మ ఫలాలను అనుభవించి ఖర్చు చేసుకున్నాడు, ఆ జన్మలలో కర్మలు చేసి వాసనలను ఖర్చు చేసుకున్నాడు. అలాగే మానవ జన్మ నెత్తి కర్మ ఫలాలు అనుభవించి ఖర్చు చేసుకోవటమే గాక, సమస్త సంచిత కర్మలను దగ్ధం చేసుకొనుటకు ఆత్మ జ్ఞానాన్ని పొందాలని ఏ మహాత్ముని ద్వారానో తెలుసుకొని, అట్టి ఆత్మజ్ఞానాన్ని పొందటానికి, సాధనలు చేయటానికి ఒక మానవ జన్మను ఉపయోగించుకున్నాడు. అంతే అతడి దశ మారింది. ఆ సాధనా మార్గంలో అతడికి ఒకటి తర్వాత ఒకటి ఉత్తమ మానవ జన్మలు లభించినవి. ఆ జన్మలలో సద్గురువులు లభించారు. తద్వారా ఈ జన్మలో సాధన సంపూర్ణమై ఆత్మసాక్షాత్కారం పొంది సిద్ధుడయ్యాడు, జీవన్ముక్తుడయ్యాడు. సమస్త కర్మలు దగ్ధమై పోయినవి.

దానితో ఒక శరీరం నుండి మరొక శరీరానికి ప్రయాణించే జీవుడు కాస్తా జీవభావాన్ని వదలి ఆత్మతో ఐక్యమై పోయాడు. ప్రారబ్ధ కర్మ ఫలాలు అనుభవించటానికి తెచ్చుకున్న స్థూల శరీరం గడువు తీరిపోవటంతో అది కాస్తా వదిలిపోయింది. మరొక

శరీరాన్ని తెచ్చిపెట్టే కర్మఫలాలు జ్ఞానాగ్నిలో దగ్ధమైపోయాయి, కనుక ఇక శరీరం సృష్టించబడే కారణం లేకుండా పోయింది. ఇక ఇప్పుడు - ఈ శరీరాన్ని వదిలే సమయంలో దేనిని స్మరిస్తే దానినే పొందుతాడు గనుకను, తనలో భౌతికమైన కోరికలు - ఆశలు - సంకల్పాలు ఏవీ లేవు గనుకను, ఆయన నిరంతరం భగవంతునే స్మరిస్తూ ఉంటాడు. నిజంగా ప్రత్యేకంగా కావాలని స్మరించటం ఉండదు. ఆయన ఎప్పుడూ సమాధి స్థితిలో పొందిన మహానుభూతిని అనుభవిస్తూ ఉంటాడు. అహం బ్రహ్మాస్మి అనే అనుభూతిలోనే ఉంటాడు. ఇలా అంత్యకాలంలో పరమాత్మ స్మరణతో - పరమాత్మానుభూతితో ఉంటాడు గనుక ఆ పరమాత్మనే చేరుకుంటాడు.

ఇప్పుడతనికి ఏ ఆలోచనలు లేవు. ఏ సంకల్పాలు లేవు. ఏ కర్మఫలాలు లేవు. ఎప్పుడో సంబంధాన్ని తెంచుకున్న శరీరాన్ని కూడా విడిచిపెట్టాడు. పరమాత్మానుభూతితో పరమాత్మగా మిగిలాడు. దీనినే విదేహ ముక్తి అంటారు.

ఇంతవరకు పరమాత్మవైపు తిరిగిన శిష్యునికి సద్గురువు ఉపనిషత్తును బోధించి ముగించాడు. మోక్షప్రాప్తిని పొందే విధానాన్ని తెలియజేశాడు. అందుకే ఒకే వాక్యం రెండు సార్లు పలకటం - ఇలా ఉపనిషత్తును అధ్యయనం చేయటం పూర్తిచేసిన గురుశిష్యులు తమను సన్మార్గం వైపు నడిపించమని ప్రార్థన చేస్తూ 18వ మంత్రంతో ముగిస్తున్నారు.

బోధన పూర్తయిందే గాని సాధన పూర్తికాలేదు గదా! అందుకే ప్రార్థన....

# అష్టాదశ మంత్రం

మం॥ అగ్నే నయ సుపథా రాయే అస్మాన్

విశ్వాని దేవ వయునాని విద్వాన్ ।

యుయోధ్యస్మ జ్జుహురాణ మేనః

భూ యిష్టాం తేనమ ఉక్తిం విధేమ ॥

నమ ఉక్తిం విధేమ ॥

ప్రతిపదార్థం :- అగ్నే ! = ఓ అగ్ని దేవా ! (అగ్నికి అంతర్యామిగా ఉన్న ఓ పరమాత్మా!) అస్మాన్ = మమ్ములను, రాయే = ఆత్మ సంపాదన కొరకు, (మోక్షాన్ని అందుకొనుటకు) సుపథా = మంచి మార్గాన, నయ = నడిపించు, దేవ = ఓ దేవా! విశ్వాని = సమస్తమైన, వయునాని = మార్గాలు, విద్వాన్ = తెలిసిన వాడవు, జహురాణం = ప్రాపంచిక భోగాల ఆకర్షణల వల్ల వచ్చే, ఏనః = పాపములను, అస్మత్ = మానుండి, యుయోధి = తొలగించు, తే = నీకు, భూయిష్టాం = మళ్ళీ మళ్ళీ, నమ ఉక్తిం = నమస్కార వచనాలను, విధేమ = అర్పిస్తున్నాము.

భావం :- ఓ అగ్ని దేవా (పరమాత్మా)! మమ్ములను మోక్షప్రాప్తికై మంచి మార్గాన నడిపించు. ఓ దేవా ! నీవు సమస్తమైన మార్గాలు తెలిసిన వాడవు. ప్రాపంచికమైన భోగాలు మమ్ములను ఆకర్షించి పాపాలు చేయిస్తాయి. మానుండి ఆ పాపాలను తొలగించు. నీకు అనేకమైన నమస్కార వచనాలను తెలుపుకుంటున్నాను.

వ్యాఖ్య:- ఈ మంత్రం అగ్ని దేవునికి ప్రార్థన. అగ్ని ఎప్పుడూ అవ్యక్తంలో ఉంటుంది. దేనినైనా కాల్చటానికి అవకాశం దొరికిందా వెంటనే వ్యక్తమవుతుంది. అలా వ్యక్తమై వేడిని వెలుగుని వ్యాపకత్వాన్ని పొందుతుంది.

అలాగే పరమాత్మ (అగ్ని) అవ్యక్తంగా అంతటా ఉంటాడు. ఆయన వాసనలలో (కట్టెలు) ప్రతిఫలించాడా - కోరికల తపనను, వేడిని పుట్టిస్తాడు. ప్రపంచాన్ని వెలిగించి చూపుతాడు. దానితో ప్రపంచంలో కర్మల రంగంలో సంచరిస్తాం. ఆ పరమాత్మయనే అగ్ని కారణంగానే సత్పురుషులు సాధనలు చేస్తారు, దుర్మార్గులు చెడు దారుల్లో తిరుగుతారు. అన్ని మార్గాలు తెలిసిన వాడు అగ్నిదేవుడు (అగ్నికి అంతర్యామిగా ఉన్న పరమాత్మే అన్ని మార్గాలు తెలిసిన వాడు) అందుకే ఆయనకు ప్రార్థన.

లోకంలోని  మానవులంతా అనేక మార్గాలలో ప్రయాణం చేస్తుంటారు.

(1) మళ్ళీ మళ్ళీ ఈ లోకంలోకే వచ్చి నీచమైన, నికృష్టమైన జన్మలను గాని - లేదా సామాన్య మానవ జన్మలు గాని - జంతువుల జన్మలు గాని పొందుతూ ఉండే మార్గం.

(2) కొందరు శాస్త్ర విహిత సత్కర్మల ద్వారా పితృయాన మార్గంలో ప్రయాణించి పితృలోకాలను చేరి, దేవలోకాలను చేరి, అక్కడ సుఖభోగాలు అనుభవించే మార్గం - పితృయాన మార్గం.

(3) కొందరు నిష్కామ కర్మలతో, సాధనలు చేసి బ్రహ్మ లోకాన్ని చేరుకొని, అక్కడ బ్రహ్మతో పాటుగా నివశించి ఆయనతో పాటు ముక్తినందుకొనేవారు. ఇది దేవయాన మార్గం (క్రమ ముక్తి)

(4) సరాసరి మానవ జన్మ నుండి జీవన్ముక్తిని పొందేవారు.

(1 ఎ) కొందరు ఈ లోకంలోకి తాము వచ్చింది తినటానికి, త్రాగటానికి, సుఖంగా జీవించటానికి, భోగాలనుభవించటానికి, పెళ్ళి చేసుకోవటానికి, పిల్లలను కనటానికి, వారిని పెంచి పోషించటానికి అని భావిస్తూ, ఈ లక్ష్యం కోసమే నిరంతరం

శ్రమిస్తూ, ఇది సాధించటానికే పనిచేస్తూ ఉంటారు. లోకంలో ఎక్కువ మంది మానవులు ఈ రకం వారే. సాధారణంగా చాలా రకాలైన జంతువులు, పశుపక్ష్యాదులు కూడా తినటం, నిద్రించటం, పిల్లలను కనటం, వాటిని పెంచి పోషించటం, తగిన నివాసానికై అనుకూలమైన చోటును వెతుక్కోవటం... ఇవే చేస్తుంటాయి. సామాన్యంగా ఈ రకం వారంతా ఇలా జీవించి ఈ జన్మలలోని కోరికలు, సంకల్పాలకు అనుగుణంగాను, పూర్వజన్మార్జిత సంచిత కర్మలలోని పక్వమైన ప్రారబ్ధ కర్మలకనుగుణంగాను మళ్ళీ మళ్ళీ ఇలా సామాన్య జన్మలనే ఎత్తుతూ - పుడుతూ గిడుతూ ఉంటారు. సామాన్యంగా జంతు జన్మలనో సాధారణ మానవ జన్మలనో ఎత్తుతారు.

(బి) మరికొందరు నిషిద్ధ కర్మలను, నీచకర్మలను చేస్తూ ఇతరులను హింసిస్తూ, దోచుకుంటూ, దొంగతనాలు చేస్తూ హీన ప్రవృత్తితో జీవిస్తుంటారు. వారు ఇంకా ఇంకా నీచమైన, నికృష్టమైన హీన యోనులందు జన్మిస్తుంటారు. ఇంకా ఇంకా పతన దశకు చేరుకుంటారు.

కనుక ఇలాంటి వారంతా మళ్ళీ మళ్ళీ జన్మించే వారే. ఇవి పరమాత్మను అందుకొనుటకు ఉపకరించే మార్గాలు కాదు. వీరు దాదాపుగా ఏలోకాలకు వెళ్ళే పనిలేదు. తృణ జలూకం (గడ్డిపురుగు) ఎలాగైతే గడ్డిపోచ మీద ప్రాకుకుంటూ వెళ్ళి, మరొక గడ్డిపోచను పట్టుకొని మొదటి దానిని వదిలినట్లుగ - వీరు ఒక జన్మను వదిలి మరొక జన్మను, ఒక శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని ధరిస్తూ ఇలాగే నిరంతరం తిరుగుతూ వుంటారు. పశువుగానో, పక్షిగానో, క్రిమిగానో, కీటకంగానో, సామాన్య మానవులుగానో జన్మిస్తుంటారు.

(2) ఇక ఇతర లోకాలకు వెళ్ళే మార్గాలు 2 ఉన్నాయి.

(ఎ) పితృయానం (బి) దేవయానం

(ఎ) పితృయానం :- కొందరు ఈ మానవజన్మలో శాస్త్ర విహిత కర్మలనే చేస్తుంటారు, సత్కర్మలను చేస్తారు. పూజా పునస్కారాలు , యజ్ఞ యాగాదులు, దానధర్మాలు, పరోపకారం, లోక కళ్యాణం ఇలా అన్నీ సత్కర్మలే చేస్తారు. అయితే అన్నింటినీ మంచి జరగాలని, తమకు ఉత్తమ గతులు కలగాలని కోరికలతోనే చేస్తుంటారు. ఇవే సకామ కర్మలు. వీరికి ఆత్మజ్ఞానం, యోగ సాధన, గురుసేవ.... ఇలాంటివి ఉండవు. ఇట్టి వారు మరణించి తర్వాత పితృయాన మార్గం ద్వారా పితృలోకం, చంద్ర లోకం, స్వర్గలోకం అని ఇలాంటి ఉన్నత లోకాలకు - ఉత్తమ లోకాలకు వెళ్ళి, అక్కడ పుణ్యఫలం ఉన్నంతవరకు సుఖభోగాలు అనుభవించి, అవి ఖర్చయి పోగానే తిరిగి ఈ లోకానికి వచ్చి, మళ్ళీ వారి వారి పూర్వ కర్మఫలాల ననుసరించి జన్మలు ఎత్తుతారు.

(బి) దేవయాన మార్గం :- పూర్వజన్మ సుకృతంతో మానవ జన్మ లభించిన కొద్దిమంది ప్రాపంచిక విషయాలకు ప్రాధాన్యత ఇవ్వరు. గృహస్థులుగా ఉన్నప్పటికీ సత్పురుషుల సహవాసంతో, సజ్జనుల సాంగత్యంతో, సద్గురువులను సేవించి వారి ద్వారా జ్ఞానాన్ని పొందుతూ, నిష్కామంగా యజ్ఞయాగాదిక్రతువులు చేస్తూ, సత్కార్యాలు చేస్తూ భగవత్ చింతనతో కాలం గడుపుతూ, జపధ్యానాది సాధనలు చేస్తూ జీవితాన్ని గడిపేవారు. శరీరాన్ని విడిచిన తర్వాత దేవయానం ద్వారా ప్రయాణించి, సూర్యలోకానికి, అక్కణ్ణుంచి సత్యలోకానికి వెళ్ళి అక్కడ ప్రళయం వచ్చేంత వరకు బ్రహ్మ విచారణలో కాలం గడిపి, సృష్టికర్త బ్రహ్మతో సహా ముక్తి నందుకొనే వారు. ఇది క్రమ ముక్తి విధానం. ఈ పద్ధతిలో ఎవరూ కూడా బ్రహ్మ లోకం నుండి క్రిందికి దిగి

వచ్చే పనిలేదు. మళ్ళీ జన్మలెత్తే పనిలేదు.

(3) ఇక ఎంతో అరుదుగా ఉన్నతోన్నతమైన జీవిత లక్ష్యాన్ని అందుకొనుటకు తీవ్ర సాధనలు సాగించేవారు కొందరుంటారు. వీరు అనేక జన్మల పుణ్యఫలంగా ఉత్తమమైన మానవ జన్మను పొంది, ఆధ్యాత్మిక మార్గంలో ప్రవేశించి, సద్గురువుల ఉపదేశాలను స్వీకరిస్తూ , వేదాంత విషయాలను విని తెలుసుకుంటూ బ్రహ్మచర్యవ్రత నిష్టతోనూ, గృహస్త ధర్మంతోను, వానప్రస్థ, సన్యాసాశ్రమ ధర్మాలను స్వీకరించి, ప్రాపంచిక వ్యామోహాలను వీడి, నిష్కామ కర్మయోగాన్ని ఆచరించి తమోగుణాన్ని వదిలించుకొని, భక్తియోగంతో రజోగుణాన్ని వదిలించుకొని, పూర్తి సత్వ గుణంతో, సద్గురు కృపతో శాస్త్ర జ్ఞానాన్ని పొంది, సాధనలు సాగించి, ఆత్మ విచారణతో, ధ్యాన నిష్టతో ఆత్మానుభూతిని పొందేవారు. వీరి సమస్త కర్మలు జ్ఞానాగ్నిలో దగ్ధమైపోతాయి గనుక వారికిక జన్మ ఉండదు. వారే జీవన్ముక్తులు. వీరు నరరూపంలో కనిపించే నారాయణులు.

ఇలా అన్ని మార్గాలు తెలిసిన ఆ పరమాత్మకే ప్రార్ధన. ఆయనకే విన్నపం. ఓదేవా! అన్ని మార్గాలు తెలిసిన వాడివి నీవు. మమ్మల్ని మంచి మార్గాన నడిపించు. ఇలా మంచి మార్గాన నడుస్తున్నప్పటికీ ఈ ప్రాపంచిక వ్యామోహాలు, ఆకర్షణలు మమ్మల్ని తమవైపుకు లాక్కుంటాయి. ఆ కుటిల మార్గాలవెంటపడి పాపాలు చేయకుండా రక్షించవలసిన వాడవూనీవే. ఆ ఆకర్షణల విషవలయం నుండి తప్పించుకొనే తెలివి కూడా నీవే ప్రసాదించాలి. ఇంత చేసిన నీకు మేము ఏమి ఇవ్వగలం ? నమస్కారం మాత్రమే. ఈ నమస్కారం వల్ల నీకు ఒరిగేదేమన్నా ఉందా ! అహ! అదీ మాకే ప్రయోజనం. 'నమమ' అంటూ - నాది అంటూ ఏదీలేదు అనటంలో నా అహంకారం తగ్గుతుంది. సంస్కారం పెరుగుతుంది. కనుకనే నీకు మళ్ళీ మళ్ళీ నమస్కారాలు చెప్పుకుంటున్నాను.

ఈ ప్రార్థన మనం అగ్నిదేవునికి చేస్తున్నాం. యజ్ఞాలలో మనమిచ్చే ఆహుతులను దేవతలకు చేర్చే మధ్యవర్తి ఆయన. ఇక్కడ అగ్ని అంటే ''అగ్రం నయతి ఇతి అగ్ని'' అగ్రం అంటే ఉన్నత స్థితికి : నయతి అంటే చేర్చేది. మనలను ఉన్నత స్థితికి చేర్చేది అని వ్యుత్పత్తి అర్థం.

అగ్ని అంటే ఆ పరమాత్మయొక్క వ్యక్త స్వరూపమే అనే భావనతో మనం ఈ ప్రార్థన చేయాలి. ఇలా ఈ ఉపనిషత్తును అధ్యయనం చేసిన గురుశిష్యులు ఈ ప్రార్థనా మంత్రంతో ఉపనిషత్తును ముగిస్తున్నారు.

చివరి పదం రెండుసార్లు పలికితే ఉపనిషత్తు ముగిసినట్లు. మరి మనం కూడా శాంతి పాఠంతో మనకర్తవ్యాన్ని మళ్ళీ గుర్తుకు తెచ్చుకుందాం.

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం
పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణ మాదాయ
పూర్ణమేవావ శిష్యతే ॥
ఓం శాంతిః శాంతిః శాంతిః

శుక్ల యజుర్వేదంలోని మంత్రభాగంలో గల ఈ అద్భుతమైన ఉపనిషత్తును అధ్యయనం చేయటం ద్వారా మీరంతా ఆ పరమాత్మను అందుకొని జీవన్ముక్తులు కాగలరని ఆశిస్తూ... ఆశీస్సులందిస్తూ...

ఓం తత్ సత్